


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 360

శనివారం 21-3-2020




**మొనాకో గ్రాండ్‌ప్రి రద్దు**

1954 తర్వాత ఇదే తొలిసారి. కోవిడ్‌–19 కారణం – స్పోర్ట్స్‌లో



**4 రోజుల నష్టాలకు బ్రేక్‌**

కోవిడ్‌ కల్లోలం కొనసాగుతున్నా స్టాక్‌ మార్కెట్ల ర్యాలీ – బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# విదేశాల నుంచి వచ్చినవారు 69,000



**40,000** యూరప్‌, అమెరికాల నుంచి ఈ నెలలో హైదరాబాద్‌ వచ్చినవారు

**వీళ్లంతా ఈ నెలలో నేరుగా హైదరాబాద్‌ వచ్చినవాళ్లే**

- విదేశాల నుంచి వచ్చి బయట తిరుగుతున్న వైనం
- ఇంట్లోనే ఉండాలని సూచించినా పట్టించుకోని ప్రయాణికులు
- ఇటలీ, జర్మనీ నుంచి మార్చి 3– 14 మధ్య వచ్చిన వారు 540 మంది
- విమానాశ్రయంలో నామమాత్రపు తనిఖీలు చేసి పంపిన వైద్య బృందాలు
- 15 రోజుల పాటు ప్రజలను ఇళ్లకే పరిమితం చేయాలంటున్న వైద్యులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్‌

విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రయాణికులు 'ఐసోలేషన్‌'ప్రక్రియను విస్మరించి ప్రజల్లో కలిసిపోవడంతో ఎప్పుడు ఏ మూల నుంచి ఏ ఉపద్రవం వచ్చి పడుతుందే మోనన్న ఆందోళన అధికార యంత్రాంగంలో ఉంది. కోవిడ్‌ ఉధృతమై వందలాదిగా కేసులు నమోదైన యూరప్‌లోని ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌, బ్రిటన్‌ వంటి దేశాల నుంచి గడిచిన 10 రోజుల్లోనే 540 మంది హైదరాబాద్‌ వచ్చారు. వీరిలో అతి కొద్ది మంది మాత్రమే ఐసోలేషన్‌ సెంటర్‌కు వెళ్లినట్లు తాజా లెక్కలు చెబుతున్నాయి. ఈ నెలలో ఇప్పటివరకు మొత్తం 69 వేల మంది ప్రయాణికులు వివిధ దేశాల నుంచి నేరుగా హైదరాబాద్‌ చేరుకున్నారు. వారిలో అమెరికా, యూరప్‌ దేశాల నుంచి వచ్చిన వారే 40 వేల మంది ఉన్నారు. మలేసియా, సింగపూర్‌, దుబాయ్‌తో పాటు ఇతర గల్ఫ్‌ దేశాల నుంచి 20 వేల మందికి పైగా ఉన్నారు. మార్చి 10 నుంచి అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశీ ప్రయాణికులను పరీక్షించడం మొదలైన తర్వాత కూడా ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌, బ్రిటన్‌ నుంచి వచ్చిన 540 మంది ప్రజల్లో కలిసిపోయారు. వీరంతా మార్చి 3–14 తేదీల మధ్య వచ్చిన వారేనని, ఆ 4 దేశాల్లో కోవిడ్‌ ఉధృతంగా ఉన్న విషయాన్ని విస్మరించి వైద్య బృందాలు తేలిగ్గా వదిలివేశాయని ఎయిర్‌పోర్టు వర్గాలే విస్తుపోతున్నాయి.

**ఫ్రాన్స్‌ నుంచి వచ్చిన వరుడికి పాజిటివ్‌?**

ఫ్రాన్స్‌ నుంచి వచ్చిన ఓ యువకుడి నిర్వాకమిది. కోవిడ్‌ వ్యాప్తి ఉధృతంగా ఉన్న దేశం నుంచి వచ్చానన్న స్పృహ లేకుండా పెళ్లికి సిద్ధమైపోయాడు. వారించినా వినలేదు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో జరిగిన ఈ పెళ్లికి దాదాపు వెయ్యి మంది హాజరయ్యారు. ఇప్పుడు ఆ యువకుడు జ్వరం, దగ్గుతో బాధపడుతూ కోవిడ్‌ అనుమానంతో గాంధీ ఆస్పత్రిలో చేరాడు. అతడికి కోవిడ్‌ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ జరిగినా.. పుణే నుంచి వచ్చే నివేదిక కోసం ఎదురు చూస్తున్నారు. అతడి పెళ్లి ఎక్కడ జరిగింది? ఎంత మంది హాజరయ్యారన్న వివరాల కోసం అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ పెళ్లికి వెయ్యి మందికిపైగా మిగతా 2వ పేజీలో ▶

# 'నిర్భయ' దోషులకు ఎట్టకేలకు ఉరి




**తీహార్‌ జైలులో అమలైన మరణశిక్ష**

- 2012లో ఢిల్లీలో పారామెడికల్‌ విద్యార్థినిపై పాశవిక హత్యాచారం
- ఏళ్ల పాటు సాగిన విచారణ.. నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు
- పలుమార్లు శిక్ష అమలును వాయిదా వేయించుకున్న దోషులు

**నా కూతురి ఆత్మ శాంతించింది: ఆశాదేవి**

### అందరికీ పాజిటివ్‌

ఇండోనేసియా నుంచి కరీంనగర్‌కు వచ్చిన బృందంలోని మొత్తం 10 మందికీ కోవిడ్‌ వైరస్‌ సోకిందని వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. అలాగే లండన్‌లో చదువుకుంటున్న 18 ఏళ్ల యువతికి కూడా శుక్రవారం కోవిడ్‌ పాజిటివ్‌గా తేలింది. దీంతో తెలంగాణలో కోవిడ్‌ పాజిటివ్‌ కేసుల సంఖ్య 19కి చేరినట్లయింది.

### 10,000

కరోనా ధాటికి ప్రపంచం స్తంభించిపోతోంది. చైనాలో పుట్టిన ఈ వైరస్‌ కారణంగా ఇప్పటివరకూ మరణించిన వారి సంఖ్య పదివేలు దాటగా దాదాపు 2.44 లక్షల మందికి ఈ వైరస్‌ సోకినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వైరస్‌ మొదలైన చైనాలోని వూహాన్‌ ప్రాంతంలో రెండో రోజూ కొత్త కేసులేవీ నమోదు కాలేదు.

### గాయని కనికకు కరోనా

బాలీవుడ్‌ ప్రముఖ గాయని కనిక కపూర్‌కు కరోనా పాజిటివ్‌ అని తేలింది. కనిక ఇటీవల లక్నోలో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులో రాజస్తాన్‌ మాజీ సీఎం వసుంధర రాజే, ఆమె కుమారుడు దుష్యంత్‌ పాల్గొన్నారు. ఇప్పుడు కనికకు కరోనా పాజిటివ్‌ అని తేలడంతో వసుంధర రాజే, దుష్యంత్‌ సెల్ఫ్‌ క్వారంటైన్‌లోకి వెళ్లారు.

### 200 పైనే..

దేశంలో కోవిడ్‌కు సంబంధించి ఒక్క రోజులోనే అత్యధికంగా 50 కొత్త కేసులు నమోదు కావడంతో శుక్రవారం నాటికి దేశం మొత్తమ్మీద కరోనా వైరస్‌ బాధితుల సంఖ్య 223కు చేరుకుంది. ఈ మహమ్మారిని ఎదుర్కొనే విషయంలో రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధాని మోదీ ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

# టెన్త్‌ పరీక్షలు వాయిదా



- హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- 23 నుంచి 30 వరకు జరగాల్సిన పరీక్షలు నిలిపివేత
- నేడు జరిగే పరీక్ష మాత్రం యథాతథం
- వాయిదాపడ్డ పరీక్షల నిర్వహణ ఎప్పుడో తర్వాత చెబుతామన్న సర్కారు

సాక్షి, హైదరాబాద్‌

రాష్ట్రంలో కరోనా వైరస్‌ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో 10వ తరగతికి సంబంధించిన పలు పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను రప్పించడం సరికాదని, పరీక్షలను వాయిదా వేయాలని హైకోర్టు శుక్రవారం ఆదేశించడంతో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించాల్సిన పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే శనివారం జరిగే పరీక్షను వాయిదా వేయాలని హైకోర్టు చెప్పనందున ఆ పరీక్షను మాత్రం యథాతథంగా నిర్వహించనుంది. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్‌ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాయిదా పడిన మిగతా 4వ పేజీలో ▶

### 6.62 లక్షల మందికి కొత్త 'ఆసరా'

- మరి కొంతమంది వృద్ధులకు 'ఆసరా' దక్కనుంది. 57 ఏళ్లు నిండిన వారికి వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయంతో కొత్తగా 6.62లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం ప్రస్తుతం 65 ఏళ్లుపైబడిన వృద్ధులకు ఆసరా పింఛన్లను అందజేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఈ వయోపరిమితిని 57 ఏళ్లకు కుదిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. - 4లో









**ఇదండీ సంగతి**



### అన్ని గ్రామాల్లోనూ

# 144 సెక్షన్‌!

సాక్షి, హైదరాబాద్‌

కోవిడ్‌ కల్లోలం నేపథ్యంలో గ్రామాల్లో నిషేధాజ్ఞలు విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడొద్దని ఆదేశించింది. 144 సెక్షన్‌ తరహాలో సామూహిక జనసంచారం లేకుండా ఆంక్షలు అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించింది. కరోనా కేసుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. గ్రామాల్లో కొత్త వ్యక్తుల రాకపోకలపై నిఘా పెట్టాలని సూచించింది. కొత్త వ్యక్తులు ఎవరొచ్చినా.. ఆ సమాచారాన్ని నమోదు చేసుకోవాలని, రోజువారీ నివేదికలను స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్లకు సమర్పించాలనిఆదేశించింది. విదేశాల నుంచి వచ్చిన వారిపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, వారు ఏ దేశం నుంచి, ఏ విమానంలో వచ్చారు.. ఎప్పుడు, ఎక్కడ దిగారు.. అక్కడి నుంచి గ్రామానికి చేరుకునే సరికి మార్గమధ్యలో ఎవరెవరిని కలిశారు.. ఎక్కడ ఆగారనే వివరాలు నమోదు చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. సదరు వ్యక్తులు దేశానికి చేరుకుని 14 రోజులు కాకపోతే స్వీయ క్వారంటైన్‌ వెళ్లేలా ఒత్తిడి చేయాలని, రోజూ ఆ వ్యక్తుల కదలికలపై కన్నేసి ఉంచాలని స్పష్టం చేసింది. జలుబు, దగ్గు, జ్వరం ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే ఆస్పత్రులకు పంపాలని ఆదేశించింది. విదేశాల నుంచి వచ్చిన వారేకాకుండా.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి వివరాలు కూడా సేకరించాలని సూచించింది. ఇలా 26 అంశాలతో కూడిన నమూనాను పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం అందజేసింది. ఈ నమూనాలో ప్రతిరోజూ సమాచారం పంపాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఐదుగురి కంటే ఎక్కువ మంది ఒక చోట చేరొద్దని, సామూహిక సమావేశాలు, ఉత్సవాలను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించకూడదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. అన్ని సమావేశాలను రద్దు చేసుకోవాలని, చట్టబద్ధంగా జరగాల్సిన సమావేశాలైతే, పరిమిత సంఖ్యలో హాజరయ్యేలా చూసుకోవాలని పేర్కొంది. మనిషికి మనిషి మధ్య కనీసం మీటరు దూరం ఉండాలని స్పష్టం చేసింది.



- ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడొద్దు
- కొత్త వారు ఎవరొచ్చినా సమాచారమివ్వాలి
- పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వ ఆదేశం

**ఆఫీసు బయట నీళ్లు, సబ్బు**

కోవిడ్‌ దరిచేరకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వం సూచించింది. ఇందులో భాగంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం బయట బకెట్‌ నీళ్లు, సబ్బు అందుబాటులో ఉంచాలని నిర్దేశించింది. కార్యాలయంలోకి ప్రవేశించే ముందు శుభ్రంగా కాళ్లు, చేతులు కడుక్కున్న తర్వాతే అనుమతించాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఊరుకోవద్దని తేల్చి చెప్పింది. కరోనా నేపథ్యంలో విధుల నిర్వహణలో షిఫ్ట్‌ల పద్ధతి పాటించాలని స్పష్టం చేసింది. తహసీల్దార్‌, ఎంపీడీవో, స్థానిక వైద్యాధికారి సూచనలకు అనుగుణంగా ఆయా విభాగాల ఉద్యోగులు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్ర సరిహద్దులోని చెక్‌పోస్టులపై నిఘా పెట్టాలని, ఆయా ప్రాంతాల నుంచి వివిధ రవాణా సాధనాల ద్వారా రాష్ట్రం లోకి ప్రవేశించే వ్యక్తుల రాకపోకలను గమనించాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ ప్రయాణికుల కదలికలను గుర్తించాలని, ఎక్కడి నుంచి వస్తున్నారో ఆరా తీయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో, తహసీల్దార్లు, వైద్యాధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా శాఖల ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు.

### పరీక్షలన్నీ వాయిదా వేయండి: యూజీసీ

సాక్షి, హైదరాబాద్‌: దేశంలోని అన్ని యూనివర్సిటీలు, తమ అనుబంధ కాలేజీల్లో సెమిస్టర్‌, ఇతర అన్ని రకాల పరీక్షలను వాయిదా వేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌ (యూజీసీ) ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 31 వరకు ఎలాంటి పరీక్షలను నిర్వహించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను అన్ని యూనివర్సిటీలు పాటించాలని పేర్కొంది.




### కమల్‌నాథ్‌ రాజీనామా

మధ్యప్రదేశ్‌ సీఎం కమల్‌నాథ్‌ తన పదవికి రాజీనామా చేశారు. బలపరీక్షకు ముందే మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి కమల్‌నాథ్‌ తన నిర్ణయాన్ని ప్రకటించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ లాల్జీ టాండన్‌కి కమల్‌నాథ్‌ తన రాజీనామా పత్రాన్ని సమర్పించినట్టు రాజ్‌భవన్‌ అధికారులు వెల్లడించారు. దీంతో గత కొద్దిరోజులుగా మధ్యప్రదేశ్‌లో నెలకొన్న నాటకీయ పరిణామాలకు తెరపడింది.



- వివరాలు 11లో

### త్వరలో ఆర్థిక ప్యాకేజీ

కరోనా కారణంగా సమస్యలను ఎదుర్కొంటున్న రంగాలకు ఆర్థిక ప్యాకేజీని త్వరలో ప్రకటిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ భరోసా ఇచ్చారు. ఇందుకు ఎన్ని రోజులు పడుతుందన్న వివరాలను ఆమె వెల్లడించలేదు. పౌర విమానయానం, పర్యాటకం, ఎంఎస్‌ఎంఈ, పశుసంవర్ధక శాఖల మంత్రులు, అధికారులతో ఆమె ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు.



- బిజినెస్‌లో

### పీకే బెనర్జీ అస్తమయం

దాదాపు ఐదు దశాబ్దాలకుపైగా భారత ఫుట్‌బాల్‌కు క్రీడాకారుడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా సేవలు అందించిన దిగ్గజం ప్రదీప్‌ కుమార్‌ బెనర్జీ శుక్రవారం కన్నుమూశారు. 83 ఏళ్ల బెనర్జీ 1956, 1960 ఒలింపిక్స్‌ క్రీడల్లో... 1958, 1962, 1966 ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. భారత్‌ తరపున ఆయన 84 మ్యాచ్‌లు ఆడి 65 గోల్స్‌ చేశారు.



- స్పోర్ట్స్‌లో

### కేఫ్‌.. ఎలా సేఫ్‌!

- భయం వద్దు.. అవగాహనతో తరిమేద్దాం.. కోవిడ్‌ వైరస్‌ విషయంలో సర్వత్రా వినిపిస్తున్నమాట. నలుగురు ఓ చోట చేరితే వైరస్‌ ప్రబలే ప్రమాదం ఉన్నందున వీలైనంత మేరకు గుమికూడే పరిస్థితి లేకుండా చూడాలని ప్రభుత్వం వెల్లడించింది. అందుకే ప్రార్థనా మందిరాలకు వెళ్లకుండా ఇళ్లలోనే ప్రార్థనలు చేసుకోవాలని, శుభకార్యాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ.. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు జనానికి ఆహ్వానం పలికే కేఫ్‌లు మాత్రం ఇప్పుడూ అదే పంథాను అనుసరిస్తూ బెదరగొడుతున్నాయి. - 5లో















సాక్షి సెంట్రల్ డెస్క్



నిన్నటి గూగుల్ డూడుల్ చూశారా.. అది ఇదే.. కరోనా వైరస్ గడగడలాడిస్తున్న నేపథ్యంలో వైరస్ రాకుండా అందరూ చేతులు కడగండి. అలా ఇలా కడగండి అని చెబుతున్నారే.. దీన్ని ఈయన 173 ఏళ్ల క్రితమే చెప్పారట. పేరు డాక్టర్ ఇగ్నెస్ సెమెల్‌వైజ్.. హంగేరీకి చెందిన ఫిజీషియన్. చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల కలిగే వైద్యపరమైన సుగుణాలను గుర్తించిన తొలి వ్యక్తిగా ఈయన పేరుగాంచారు. 1847, మార్చి 20న ఆయనీవిషయాన్ని శాస్త్రీయంగా కనుగొన్నారట. అందుకే కరోనా తీవ్రంగా ప్రబలుతున్న నేపథ్యంలో హ్యాండ్ వాష్ వీడియో డూడుల్‌ను పెట్టిన గూగుల్ ఆయన్నీ విధంగా గౌరవించింది.

## ఇండోనేసియా బృందంలో
# అందరికీ పాజిటివ్

**సాక్షి, హైదరాబాద్:** ఇండోనేసియా నుంచి కరీంనగర్‌కు వచ్చిన బృందం మొత్తానికి కోవిడ్ వైరస్ సోకింది. మొదట ఆ దేశానికి చెందిన ఒక వ్యక్తికి కోవిడ్ పాజిటివ్ రాగా, ఆ తర్వాత గురువారం ఏడుగురికి, శుక్రవారం మిగిలిన ఇద్దరికి కూడా కోవిడ్ పాజిటివ్ వచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. దీంతోపాటు లండన్‌లో చదువుకుంటున్న 18 ఏళ్ల యువతికి కూడా శుక్రవారం కోవిడ్ పాజిటివ్ తేలింది. దీంతో తెలంగాణలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 19కి చేరినట్లయింది. ఇండోనేసియా బృందంతో పాటు గైడ్‌గా వచ్చిన ఉత్తరప్రదేశ్ వ్యక్తికి మాత్రం నెగెటివ్ వచ్చింది. దీంతో కరీంనగర్‌లో, రాష్ట్రంలోనూ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. లండన్ నుంచి వచ్చిన యువతి ఈనెల 17న హైదరాబాద్ వచ్చింది. అప్పటికే ఆమెలో కోవిడ్ అనుమానిత లక్షణాలున్నాయి. దీంతో ఆమెను కుటుంబసభ్యులు కాంటినెంటల్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే ఉంచి నమూనాలను సేకరించి గాంధీ ఆస్పత్రిలో పరీక్షించారు. ఆ పరీక్షల్లో ఆమెకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

**19** రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కోవిడ్ కేసులు..

- మొదట ఒకరు.. తర్వాత ఏడుగురు.. ఇప్పుడు మరో ఇద్దరికి
- లండన్ నుంచి వచ్చిన 18 ఏళ్ల యువతికి పాజిటివ్

**జవాన్‌కు నెగెటివ్..**
సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు నెగెటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు నమోదైన 19 కేసుల్లో 10 మంది ఇండోనేసియా దేశస్తులు కాగా, దుబాయ్ నుంచి వచ్చిన వారు ఇద్దరు, లండన్ నుంచి వచ్చిన వారు ఇద్దరు, స్కాట్లాండ్ నుంచి వచ్చిన వారు ముగ్గురు, ఇటలీ, నెదర్లాండ్ నుంచి వచ్చిన వారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. విదేశీయులు 10 మంది కాగా, మన రాష్ట్రానికి చెందిన వారు విదేశాల్లో ఉంటూ ఇక్కడకు వచ్చిన వారు 8 మంది ఉన్నారు. మరొకరు ప్రవాస భారతీయుడు. మొదటి కోవిడ్ బాధితుడికి నయమై ప్రస్తుతం ఇంట్లో ఐసోలేషన్‌లో ఉన్నాడు. మిగిలిన 18 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరు న్యుమోనియాతో బాధపడుతున్నాడు. కాగా, ఇండోనేసియన్లు కాకుండా మిగిలిన తొమ్మిది మందితో కాంటాక్ట్ అయిన 351 మంది వ్యక్తులందరికీ నెగెటివ్ రావడం ఊరట కలిగించే అంశం. ఇక ఇండోనేసియన్లతో కాంటాక్ట్ అయిన 25 మందిని వైద్యాధికారులు శుక్రవారం గాంధీకి తీసుకొచ్చారు. వారికి పరీక్షలు జరుగుతున్నాయి. ఆ వివరాలు తెలియాల్సి ఉంది.



# సిలికాన్ వ్యాలీ షట్‌డౌన్

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

అగ్రరాజ్యం అమెరికాను కరోనా వైరస్ వణికిస్తోంది. శుక్రవారానికి దాదాపు 11,500 కేసులు నమోదవడంతో దాదాపు సగం రాష్ట్రాల్లో ప్రజలను ఇళ్లకే పరిమితం చేశారు. భారతీయులు ముఖ్యంగా తెలుగువారు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో భారతీయ దుకాణాలు మూసి ఉండటంతో నిత్యావసర వస్తువులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిలికాన్ వ్యాలీగా పిలిచే శాన్‌ఫ్రాన్సిస్కో, శాన్‌జోస్ (కాలిఫోర్నియా) పూర్తిగా మూతపడింది. కొద్ది సంఖ్యలో వ్యాపార సంస్థలు తెరిచి ఉంటున్నా వాటిలో నిత్యావసర వస్తువులు దొరకడం లేదు. గూగుల్, ఫేస్‌బుక్, యాపిల్, అమెజాన్ సహా వందలాది కంపెనీల్లో పనిచేసే వేలాది మంది ఉద్యోగులు ఇళ్ల నుంచే విధులు నిర్వహిస్తున్నారు.

**ప్రజలు వీధుల్లోకి రావొద్దని హెచ్చరికలు**
ప్రపంచ వాణిజ్య కేంద్రాల్లో అగ్రగామి న్యూయార్క్ పూర్తిగా స్తంభించింది. పొరుగునే ఉన్న న్యూజెర్సీ, కనెక్టికట్ రాష్ట్రాల్లో ప్రజలను ఇళ్లకే పరిమితం చేశారు. న్యూయార్క్‌లో కేసులు పెరుగుతుండటంతో అధికారులు ప్రజలను వీధుల్లోకి రావొద్దని హెచ్చరించారు. నైట్ క్లబ్‌లు, రెస్టారెంట్లు మూతపడ్డాయి. వాషింగ్టన్, ఫ్లోరిడా, ఇల్లినాయీ, షికాగో, లూసియానా, జార్జియా, టెక్సాస్ వంటి రాష్ట్రాల్లోనూ కోవిడ్ కేసులు పెరుగుతుండటంతో ప్రజలను ఇళ్లకు పరిమితం చేయాలని స్థానిక ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. ప్రారంభ దశలో వాషింగ్టన్, న్యూయార్క్, కాలిఫోర్నియా రాష్ట్రాలకే పరిమితమైన వైరస్... ఇప్పుడు మరికొన్ని రాష్ట్రాలను తాకింది. అత్యధికంగా న్యూయార్క్‌లో 4,152 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి దాకా వాషింగ్టన్‌లో 1,228, కాలిఫోర్నియాలో 1,044, న్యూజెర్సీలో 742 కేసులు నమోదయ్యాయి. న్యూజెర్సీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వైరస్ బారిన పడి మృతి చెందారు. వంద అంతకంటే ఎక్కువ కేసులు నమోదైన రాష్ట్రాల్లో విస్కాన్సిన్, పెన్సిల్వేనియా, టెక్సాస్, కొలరాడొ, మసాచ్యూసెట్స్, లూసియానా, ఇల్లినాయీ, జార్జియా, ఫ్లోరిడా ఉన్నాయి. వాటిలో కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీలలో భారతీయులు అందులోనూ తెలుగువారు లక్షల్లో నివసిస్తున్నారు.

**వైరస్ ప్రభావంతో సగం రాష్ట్రాల్లో ఇళ్లకే ప్రజలు పరిమితం**
- నిత్యావసరాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు
- మూతపడ్డ రెస్టారెంట్లు, నైట్ క్లబ్‌లు

**నిత్యావసరాల కోసం భారీ క్యూలు...**
కరోనా వైరస్ దృష్ట్యా ఇళ్లకే పరిమితం కావాలని కాలిఫోర్నియా ప్రభుత్వం హెచ్చరించడంతో శాన్‌ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజిలెస్, శాన్‌జోస్ నగరాలు నిర్మానుష్యంగా మారాయి. భారతీయులు ఆధారపడే దుకాణాలు మూసి ఉండటంతో వేలాది మంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరీ ఇబ్బందుల్లో ఉన్న వారి కుటుంబాలకు తోటి భారతీయులు తమ దగ్గర ఉన్న నిత్యావసరాల్లో కొన్నింటిని అందజేస్తున్నారు. ఈ పరిస్థితి మారడానికి భారతీయ దుకాణాలను తెరిపించాలని, అక్కడ నిత్యావసర వస్తువులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిలికాన్ వ్యాలీ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు కాలిఫోర్నియా గవర్నర్‌ను కోరారు. న్యూజెర్సీలో ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకొనేందుకు తెలుగు సంఘాలు ప్రత్యేక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేశాయి. కాలిఫోర్నియాలోనూ ఈ తరహా గ్రూపులు ఏర్పాటు చేస్తున్నామని సిలికాన్ వ్యాలీ తెలుగు అసోసియేషన్‌కు చెందిన మందడి రాకేశ్‌రెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

**జాగ్రత్తలు తప్పనిసరి...**
అమెరికాలో ఉండే తెలుగువారు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇళ్లకే పరిమితం కావాలని తెలుగు అసోసియేషన్లు విజ్ఞప్తి చేశాయి. నిత్యావసర వస్తువుల కోసం బయటకు వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాయి. భారతీయ స్టోర్‌లలో నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ తెలుగు సంఘాలు అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నాయి. కరోనా వైరస్ నేపథ్యంలో దేశీయ, విదేశీ ప్రయాణాలు చేయొద్దని, 60 ఏళ్లకు పైబడిన భారతీయ తల్లిదండ్రులు ఇల్లు దాటి బయటకు రావద్దని నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ తరుణంలో స్వదేశానికి వెళ్లాలన్న ఆలోచన మానుకోవాలని సూచించింది.

వనస్థలిపురంలోని ఒక సూపర్ మార్కెట్‌లో రద్దీ



# చలో సూపర్ మార్కెట్
## నిత్యావసరాల కోసం జనం పరుగు

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా కోవిడ్ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉండటం, దీని కట్టడి చర్యల్లో భాగంగా ప్రజలు ఇళ్లను విడిచి బయటకు రావొద్దన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హెచ్చరికల నేపథ్యంలో నిత్యావసరాల నిల్వలపై ప్రజలంతా దృష్టి పెట్టారు. పొరుగు రాష్ట్రాల్లో లాక్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో నిత్యావసరాల ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాటిని ముందస్తుగా నిల్వ చేసుకుంటున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రైతు బజార్‌లతోపాటు మోండా మార్కెట్, మీరాలంమండి, మాదన్నపేట, ఎన్టీఆర్‌నగర్, బోయిన్‌పల్లి, అల్వాల్, కొత్తపేట, మెహిదీపట్నం, ఎర్రగడ్డ మార్కెట్ ప్రాంతాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. సాధారణంగా 2–3 రోజుల అవసరాల కోసం కూరగాయలు కొనుగోళ్లు చేసే వారూ వారానికి సరిపడా కొనుగోళ్లు జరుపుతూ కనిపించారు. బియ్యం, నూనెలు, పప్పులు, ఉల్లిగడ్డలను 2 నెలలకు సరిపోయేలా కొనుగోలు చేశారు. మరోవైపు హోటళ్లు మూసేయడంతో తోపుడుబండ్లపై టిఫిన్లు అమ్మే వారికి డిమాండ్ పెరిగింది. దీంతో వారు సైతం ఇడ్లీ, దోశ, పూరీ, వడలకు అవసరమైన సరుకులను భారీగా కొనుగోలు చేస్తున్నారు.

**ఆన్‌లైన్ అమ్మకాలు అదుర్స్..**
ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రం హోం వెసులుబాటు కల్పించడంతో ఇళ్లకే పరిమితమైన ఉద్యోగులు నిత్యావసరాల కోసం ఆన్‌లైన్‌పై ఆధారపడ్డారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్ వంటి ఆన్‌లైన్ యాప్‌లతో సరుకుల కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారు. బ్యాచిలర్ ఉద్యోగులైతే పాలు, పెరుగు సైతం ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నారు.

## సీఎం కరీంనగర్ టూర్ వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రజల్లో భరోసా నింపేందుకు సీఎం కేసీఆర్ శనివారం కరీంనగర్ వెళ్లాలనుకున్న పర్యటన వాయిదా పడింది. దేశవ్యాప్తంగా ప్రబలుతున్న కోవిడ్‌పై ప్రజల్లో ధైర్యం నింపేందుకు కరీంనగర్ పర్యటనకు సీఎం సంకల్పించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం పర్యటన వల్ల భారీగా జరుగుతున్న స్క్రీనింగ్, వైద్య ఏర్పాట్లకు అసౌకర్యం కలగకుండా ఉండాలని కరీంనగర్ జిల్లా యంత్రాంగం, వైద్య శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. దీంతో కేసీఆర్ తన పర్యటనను రద్దు చేసుకున్నారు. కోవిడ్ పరిస్థితి సహా కరీంనగర్‌లో వైద్య ఏర్పాట్లపై కలెక్టర్, పోలీస్ కమిషనర్లతో శుక్రవారం కేసీఆర్ మాట్లాడారు.

**జనతా కర్ఫ్యూ విధిగా పాటించండి: సీఎం**
ప్రధాని పిలుపు మేరకు ఆదివారం దేశవ్యాప్తంగా తలపెట్టిన జనతా కర్ఫ్యూను రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛందంగా పాటించాలని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు, కార్యాచరణపై ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సీఎస్ సోమేశ్ కుమార్‌ను సీఎం ఆదేశించారు.

## సీసీఎంబీలో పరీక్షలకు
# అనుమతివ్వండి

**సాక్షి, హైదరాబాద్:** కరోనా పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) సెంటర్‌ను ఉపయోగించుకునేందుకు అనుమతివ్వాలని ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. కేవలం తెలంగాణ వారికే కాకుండా దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వారికైనా సీసీఎంబీలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని కేసీఆర్ ప్రధాని దృష్టికి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సీసీఎంబీని జీవ సంబంధ పరిశోధనల కోసం ఉపయోగిస్తున్నారని, పరీక్షలకు అనుమతిస్తే ఏకకాలంలో వెయ్యి శాంపిళ్ల పరీక్షించే అవకాశం ఉందన్నారు. కరోనా వైరస్ నియంత్రణలో కేంద్రంతో కలసి పనిచేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం కేసీఆర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి సీఎం పలు సూచనలు చేశారు. విదేశాల నుంచి వస్తున్న వారి ద్వారానే వైరస్ ప్రబలే అవకాశం ఉన్నందున కొన్ని రోజులపాటు విదేశాల నుంచి విమాన రాకపోకలను పూర్తిగా నిలిపేయాలన్నారు. రైళ్ల ద్వారా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉన్నందున రైల్వే స్టేషన్లలో వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు రైల్వే స్టేషన్లు, బోగీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కేసీఆర్ కేంద్రాన్ని కోరారు. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు పెద్ద ఎత్తున విదేశాల నుంచి ప్రయాణికులు వస్తారని, వారికి క్షుణ్ణంగా కోవిడ్ వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. జనసమ్మర్థం ఎక్కువ ఉండే ప్రధాన నగరాలపై దృష్టి కేంద్రీకరించి కోవిడ్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని కేసీఆర్ కోరారు.



ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం కేసీఆర్ విజ్ఞప్తి

**పండుగలు, ఉత్సవాలకు దూరం...:** కోవిడ్ వ్యాప్తి నిరోధ చర్యలను కేసీఆర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానికి వివరించారు. జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవడంతోపాటు శ్రీరామ నవమి, జగ్నే కీ రాత్ వంటి పండుగలు, ఉత్సవాలను రద్దు చేశామన్నారు.

# ..వచ్చినవారు 69,000

▶ మొదటి పేజీ తరువాయి

హాజరయ్యారని సమాచారం. లండన్ నుంచి ఈ నెల 13న హైదరాబాద్ వచ్చిన మరో యువకుడు కోవిడ్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరాడు. అతడికీ పాజిటివ్ వచ్చింది. ఈ రెండు ఉదంతాలు మచ్చుకు మాత్రమే. విదేశాల నుంచి వచ్చిన వారిలో ఎంతమందికి ఈ కోవిడ్ లక్షణాలు బయటపడతాయన్నది తేలడానికి ఇంకా వారం నుంచి 10 రోజులు పడుతుంది.

**సీఎం పిలుపుపై స్పందిస్తారా?**
విదేశాల నుంచి వచ్చి బయట తిరుగుతున్న వారు ముందుకు రావాలన్న సీఎం పిలుపుపై స్పందిస్తారా.. ఐసోలేషన్ కేంద్రాలకు వెళ్తారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అమెరికా నుంచి వచ్చీ రాగానే అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సంగతి తెలుసుకున్న కలెక్టర్.. కోనప్పకు ఫోన్ చేసి ఐసోలేషన్‌లో ఉండాలని కోరారు. కొద్దిమంది సినిమా రంగానికి చెందిన సెలబ్రిటీలు షూటింగ్‌ల కోసం యూరప్ తదితర దేశాలకు వచ్చినా ఐసోలేషన్‌లో లేరని తెలిసింది. లక్షణాలు బయటపడేలోపే సమీప ఆరోగ్య కేంద్రాలు లేదా ఐసోలేషన్ కేంద్రాలకు వెళ్తే బాగుంటుందని అధికారులు సూచిస్తున్నారు.

**లాక్‌డౌన్ తప్పనిసరి!**
కోవిడ్‌ను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విస్మరించిన ఇటలీ, ఇరాన్ దేశాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకపోతే భారత్ తీవ్రమైన అనర్థాలు చవిచూడాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకుంటున్నా అవి కోవిడ్‌కు ఏ మాత్రం విరుగుడు కాదని పేర్కొంటున్నారు. వచ్చే 15 రోజుల పాటు లాక్‌డౌన్ కాకపోతే ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయని ఆందోళన చెందుతున్నారు. వేలాదిగా కేసులు నమోదై వందల సంఖ్యలో ప్రజలు చనిపోతున్నా ఈ వైరస్ నియంత్రణ విషయంలో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం సంతృప్తికరంగా లేవని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) శాస్త్రవేత్త ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. వైరస్ వ్యాప్తి ఉధృతంగా ఉన్న దేశాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన ప్రయాణికులను ఐసోలేషన్‌కు తరలించని కారణంగా వచ్చే వారం, పది రోజుల్లో ఏం జరుగుతుందోనన్న ఆందోళనకు గురిచేస్తోందని సీసీఎంబీ శాస్త్రవేత్త ఒకరు వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో మంత్రులు, సీనియర్ అధికారులు సీఎం ఎదుట ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## గాంధీకి ఇద్దరు అనుమానితులు

**మన్సూరాబాద్:** కోవిడ్ అనుమానితుడు ఎల్‌బీ నగర్‌లో బస్సు ఎక్కడం కలకలం సృష్టించింది. ఏపీలోని భీమవరానికి చెందిన వ్యక్తి ఇటీవల దుబాయ్ నుంచి ముంబైకి వచ్చాడు. అక్కడి నుంచి బస్సులో నగరానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం భీమవరం వెళ్లేందుకు ఎల్‌బీనగర్‌లో బస్సు ఎక్కేందుకు ప్రయత్నించాడు. అతని ఎడమ చేతిపై కోవిడ్ అనుమానితుడిగా సూచిస్తూ సింబల్ ఉండటంతో దాన్ని చూసిన ఆర్టీసీ అధికారులు బస్సు ఎక్కేందుకు అభ్యంతరం తెలిపారు. వెంటనే ఎల్‌బీ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు.. అతడిని గాంధీ ఐసోలేషన్ వార్డుకు తరలించారు.

**మరో అనుమానితుడు సైతం..**
చింతల్‌కుంట మల్లికార్జున్‌నగర్ నార్త్ కాలనీలో ఉండే ఓ వ్యక్తి దుబాయ్ నుంచి 3 రోజుల క్రితం నగరానికి వచ్చాడు. విదేశాల నుంచి వచ్చిన వారి గుర్తింపును చేపడుతున్న బృందం అతని ఇంటికి వెళ్లి వివరాలు సేకరించింది. అతను జ్వరం, దగ్గుతో బాధపడుతున్న నేపథ్యంలో గాంధీలోని ఐసోలేషన్ వార్డుకు తరలించింది.

# నల్లగుట్టలో టెన్షన్

- ఇరాన్ నుంచి వచ్చిన 8 మంది మత ప్రచారకులు
- కోవిడ్ లక్షణాలు లేకపోవడంతో ఇంట్లోనే క్వారంటైన్

**రాంగోపాల్‌పేట్/చాంద్రాయణగుట్ట:** ఇరాన్ నుంచి ఎనిమిది మంది మతప్రచారకులు హైదరాబాద్‌లోని నల్లగుట్టకు వచ్చారనే సమాచారంతో ఆ ప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ నెల 18 నుంచి నలుగురు పురుషులు నల్లగుట్ట మసీదులోనే బస చేస్తుండగా నలుగురు మహిళలు మసీదు కమిటీకి చెందిన ఓ సభ్యుడి ఇంట్లో బస చేస్తున్నారు. అయితే ప్రాథమిక పరీక్షల్లో వారికి కరోనా లక్షణాల్లేవని తేలడంతో వారిని ఈ నెల 29 వరకు క్వారంటైన్ చేశారు. అయినా స్థానికుల్లో అనుమానం వెంటాడుతోంది. ఇరాన్ నుంచి 8 మంది గత నెల 24న ఢిల్లీకి విమానంలో వచ్చారు. అక్కడి నుంచి 29న హైదరాబాద్‌కు రైలులో వచ్చారు. మల్లేపల్లిలోని బడా మసీదులో అప్పటి నుంచి బస చేస్తూ ఉన్నారు. గురువారం రాత్రి ఈ విషయం తెలియడంతో రాంగోపాల్‌పేట పోలీసులు మసీదు కమిటీ ప్రతినిధులను సంప్రదించారు. వారిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా, కరోనా లక్షణాలు లేవని అంగీకరించలేదు. శుక్రవారం ఉదయం వైద్య బృందం వచ్చి వారికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించడంతో ఎలాంటి లక్షణాలు కన్పించలేదు. ఈ నెల 29న వారు తిరిగి ఢిల్లీ వెళ్లి.. వచ్చే నెల 4న ఇరాన్ వెళ్తుండటంతో అప్పటివరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. మరోవైపు కిర్గిస్తాన్ నుంచి ఫిబ్రవరిలో హైదరాబాద్ వచ్చిన 11 మందితోపాటు యూపీకి చెందిన మరో ఇద్దరు గైడ్‌లు రెండు రోజుల నుంచి రియాసత్‌నగర్‌లోని ఓ ప్రార్థనామందిరంలోనే ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకుని అధికారులు వారిని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలోని ఐసోలేషన్ కేంద్రానికి తరలించారు.

# క్వారంటైన్‌లో ఉండలేం

**ప్రభుత్వ కేంద్రాల్లో ఉండలేమని విమాన ప్రయాణికుల గగ్గోలు**

- వసతులు సరిగ్గా లేవని అధికారులతో వాగ్వాదం
- ఇంటిపట్టునే ఉంటామనే హామీతో ఇళ్లకు..
- ఇళ్లకు వెళ్లినా ఐసోలేషన్ పాటించని వైనం

**1,019** అధికారులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చి వెళ్లినవారు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా విదేశాల నుంచి వచ్చిన విమాన ప్రయాణికులను ప్రభుత్వం క్వారంటైన్ కేంద్రాలకు తరలించినా అక్కడ ఉండేందుకు వారు నిరాకరిస్తున్నారు. వసతులు లేవని, భోజనం సరిగ్గా లేదని, ఒంటరిగా ఉండలేకపోతున్నామని సాకులు చూపుతూ ఇంటిబాట పడుతున్నారు. తమ ఇళ్లలో అనేక వసతులున్నాయని, ఇళ్లలోనే ఐసోలేషన్‌లో ఉంటామని చెబుతూ వెళ్లిపోతున్నారు. అయితే వారిని ఒప్పించడంలో, వసతులు కల్పించడంలో వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు విఫలం అవుతోందన్న విమర్శలు వస్తున్నాయి. శుక్రవారం నాటికి ఏడు క్వారంటైన్ కేంద్రాల నుంచి ఏకంగా 1,019 మంది వెళ్లిపోయినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే వారి నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకొని పంపిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

## ముందుజాగ్రత్తగా తరలించినా...

చైనా, ఇటలీ, దక్షిణ కొరియా, ఇరాన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ సహా నాలుగు గల్ఫ్ దేశాల నుంచి వచ్చే విమాన ప్రయాణికులకు కరోనా వైరస్ లక్షణాలు లేకపోయినా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని క్వారంటైన్ కేంద్రాలకు తరలించింది. ఇతర దేశాల నుంచి వచ్చేవారు ఎవరైనా ఇళ్లలో ఐసోలేషన్‌లో ఉండాలని సూచించింది. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. క్వారంటైన్ కేంద్రాల్లో ఎవరికైనా వైరస్ లక్షణాలుంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్ధారణ పరీక్షలకు తరలిస్తోంది. అయితే ఈ విషయంలో మొదట కఠినంగా వ్యవహరించిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు... చివరకు వసతులు కల్పించలేకపోతున్నామన్న భావనతో చేతులెత్తేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వారిని క్వారంటైన్ సెంటర్ల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్, పాస్‌పోర్టులు తీసుకొని పంపిస్తున్నారు. ఆయా దేశాల నుంచి వచ్చే విమాన ప్రయాణికులందరినీ 14 రోజులపాటు వికారాబాద్‌లోని హరిత రిసార్ట్, దూలపల్లి ఫారెస్టు అకాడమీ లాంటి ఏడు చోట్ల ఉంచారు. అయితే ఆయా దేశాల నుంచి వచ్చిన వారిలో వీఐపీలు ఉండటం, సర్కారు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై కొందరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో వారందరినీ ఇళ్లకు పంపేశారు. అయితే ఇలా అత్యధిక వైరస్ ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారిని క్వారంటైన్‌లో ఉంచకుండా పంపిస్తే ఎలాగన్న దానిపై విమర్శలు వస్తున్నాయి.

**మాకేం కాదన్న ధీమాలో కొందరు**
రాష్ట్రంలో సెకండ్ కాంటాక్టు కాలేదు. మన వాతావరణానికి ఈ వైరస్ బతకదనో లేక మన వాళ్ల రోగనిరోధక శక్తి ఎక్కువనో చాలా మందిలో ధీమా ఉన్నట్లు కనిపిస్తోంది. కొందరు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల్లోనూ ఇదే భావన నెలకొన్నట్లు తెలుస్తోంది. అందుకే కోవిడ్‌ను తేలిగ్గా తీసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. రెండ్రోజుల క్రితం మంత్రి ఈటల వైరస్ పరిస్థితి తీవ్రంగా ఉందని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని చెప్పారు. కానీ కొందరు వైద్యాధికారులు దీన్ని తేలిగ్గా తీసుకోవడంతో ప్రజల్లో సీరియస్‌నెస్ తగ్గుతుందన్న ఆందోళన నెలకొంది. ఒకరిద్దరు కీలక అధికారులూ పరిస్థితి తీవ్రతను చెప్పకుండా ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారన్న భావనను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

**హోం క్వారంటైన్‌పై మార్గదర్శకాలు...**
ప్రజలు హోం క్వారంటైన్‌లో ఎలా ఉండాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం... విదేశాల నుంచి వచ్చిన వారంతా 14 రోజులపాటు ఇంటి దగ్గరే ఉండాలి. హోం క్వారంటైన్‌లో ఉండేవారు ఒంటరిగా ఉండాలి. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. డిస్పోజబుల్ పేపర్ టవళ్లను వాడాలి. తుమ్మినా, దగ్గినా ముఖానికి మాస్కు లేదా రుమాలు అడ్డం పెట్టుకోవాలి. క్వారంటైన్ వారుంటున్న గదిని, అందులోని వస్తువులను, బాత్రూమ్‌ను రోజుకు ఒక్కసారైనా హైపోక్లోరైడ్ సొల్యూషన్‌తో శుభ్రపరచాలి. ఏవైనా వైరస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వానికి సమాచారం అందించాలి.

## ఎమ్మెల్యే కోనేరు కోనప్పను క్వారంటైన్‌లో ఉంచండి..

కరోనా కోరల్లో చిక్కిన అమెరికాలో ఇటీవల పర్యటించి వచ్చిన సిర్పూర్ కాగజ్‌నగర్ టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులను క్వారంటైన్‌లో ఉంచాలని ఉన్నతాధికారులు జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అక్కడికి వెళ్లి వచ్చిన ఆయన క్వారంటైన్‌లో ఉండటం మంచిదని సూచించారు. ఆయన్ను క్వారంటైన్‌లో ఉంచాల్సిందిగా ఉన్నతాధికారులు స్థానిక డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆసిఫాబాద్ డీఎంహెచ్‌వో ఎమ్మెల్యే కోనప్పకు ప్రభుత్వం తరఫున లేఖ కూడా పంపారు. 14 రోజులపాటు ఇంట్లోనే ఉండాలని, ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనవద్దని, ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని కోరారు. లేఖ ప్రతుల్ని జిల్లా ఎస్పీకి కూడా పంపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.

# 2022 నాటికి బీబీనగర్ 'ఎయిమ్స్'

## రూ.1,028 కోట్లు మంజూరుకు కేంద్రం ఓకే



సాక్షి ,న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్రంలోని బీబీనగర్‌లో రూ.1,028 వ్యయ ంతో ఎయిమ్స్‌ను ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ అనుమతిం చిందని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా. హర్షవర్ధన్ చెప్పారు.లోక్‌సభలో శుక్ర వారం సభ్యుడు జి.రంజిత్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ బీబీనగర్‌లో 2022 నాటికి ఎయిమ్స్ ఏర్పాటవుతుందని చెప్పారు. దీనికోసం ఇప్పటి వరకు రూ.5 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.హయ్యర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ కొత్త ఎయిమ్స్ ఏర్పాటుకు నిధులు అందిస్తోందని, ఎయిమ్స్ నిర్మాణానికి నిధుల సమస్య లేదని ఆయన తెలిపారు

### కరోనా వైరస్ నియంత్రణకు 'ఆయుష్'కృషి

కరోనా వైరస్ నివారణ కోసం, దాని సమాచారం అందించేందుకు 'ఆయుష్'మంత్రిత్వశాఖకు చెందిన పరిశోధనా మండళ్లు ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ సమాచారాన్ని రూపొందించి ఓపీడీ రోగులకు తెలియచేస్తున్నాయని ఆయుష్ శాఖ సహాయ మంత్రి శ్రీపద్ యెస్సో నాయక్ తెలిపారు. కరోనా వ్యాప్తిని అరికట్టడం కోసం ఆయుర్వేద, యునానీ, హోమియోపతి వైద్య విధానాలు సూచించే జాగ్రత్తలను, ఇన్‌ఫెక్షన్‌ను అదుపు చేయడంలో ఉపయోగపడే మందులను తెలియచేస్తూ పరిశోధనా మండళ్లు జనవరిలోనే అడ్వయిజరీ జారీ చేశాయని మంత్రి లోక్ సభకు తెలిపారు.సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తేజస్వీ సూర్య లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.హోమియోపతి కేంద్ర పరిశోధనా మండలి చైనాలోని వూహాన్‌లో కరోనా రోగుల లక్షణాలను విశ్లేషించి వైరస్ నివారణకు ఆర్సెనికం ఆల్బం 30సిని జీనస్ ఎపిడమికస్‌గా ఉపయోగించవచ్చని సిఫారసుచేసిందని చెప్పారు. శ్వాససంబంధిత ఇన్‌ఫెక్షన్‌లకు ఆర్సెనిక్ ఆల్బంను సాధారణంగా వాడుతారని మండలి సూచించిందని మంత్రి తెలిపారు.

### ఆయుష్ ఆసుపత్రికి ఆర్థిక సహాయం చేయండి

ప్రజారోగ్యం రాష్ట్ర పరిధిలోని అంశం కనుక మెదక్ జిల్లాలో ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుచేయడం రాష్ట్రం చేతిలో ఉంటుందని మంత్రి శ్రీపద్ యెస్సో నాయక్ చెప్పారు. జాతీయ ఆయుష్ మిషన్ కింద సంబంధిత ఆసుపత్రుల అభివృద్ధికి మంత్రిత్వశాఖ ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఎర్రగడ్డలోని ఆయుష్ ఆసుపత్రికి ఈ విధమైన ఆర్థిక సహాయం లభించిందని మంత్రి తెలిపారు. కొత్త ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా సమాధానమిచ్చారు.

# ఇద్దరు అటవీ అధికారుల సస్పెన్షన్

**సాక్షి,హైదరాబాద్:** విధుల పట్ల నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఇద్దరు అటవీ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. మంచిర్యాల ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) నాగభూషణం, బెజ్జూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) కిరణ్ కుమార్‌లను పీసీసీఎఫ్ ఆర్.శోభ శుక్రవారం సస్పెండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న హరితహారంలోని మొక్కల సంరక్షణ, కేంద్ర ప్రభుత్వ కంపా నిధులతో చేపట్టే అటవీ పునరుజ్జీవన చర్యలపట్ల ఈ ఇద్దరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వీరిపై సస్పెన్షన్ వేటు పడినట్లు అటవీశాఖ వర్గాలు వెల్లడించాయి. హరితహారంలో భాగంగా దాదాపు 50 వేల మొక్కలను నాటకపోవడమే కాకుండా, వాటిని ఎండబెట్టడంతో ఎఫ్ఆర్వోపై చర్య తీసుకున్నారు. ఈ ఇద్దరు అధికారులపై వచ్చిన ఆరోపణలపై ఆదిలాబాద్ చీఫ్ కన్జర్వేటర్‌తో పీసీసీఎఫ్ విచారణ జరిపించారు. వీరిపై వచ్చిన ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు లభించడంతో సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.




# రెండు రోజులు తేలికపాటి వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న రెండురోజులు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక నుంచి దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది.












## ఉద్యమం బాధ్యత రేవంత్‌కేనా?

**సాక్షి, హైదరాబాద్:** అవినీతిపై ఉద్యమం చేసే బాధ్యత టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్‌రెడ్డికే ఇచ్చారా? అనే అంశాన్ని కోర్‌కమిటీ సమావేశంలో రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియాను అడుగుతామని ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. పార్టీ పక్షాన ఆందోళనలు, ఉద్యమాలు కుంతియా, రేవంత్ ఇద్దరే చూసుకుంటారా? తాము అసలు పనిచేయాలా వద్దా.. అనే విషయాన్ని కూడా అడుగుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎవరి జాగీరు కాదని, కోర్ కమిటీలో చర్చించాకే పార్టీపరంగా చేపట్టే ఉద్యమాలపై నిర్ణయించాలని సూచించారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో కొందరు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మిమ్మల్ని పరామర్శించేందుకు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి జైలుకెందుకు రాలేదు' అని ఖైదీలు తనను అడిగారని రేవంత్ అనడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఖైదీలు ఏది చెబితే అది రేవంత్ చేసేట్టు అయితే ఆయన జైలులో ఉంటే బాగుంటుందని వారు అనుకుంటే జైల్లోనే ఉంటారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అందరినీ కలుపుకొని పార్టీని నడపడం ఆషామాషీ విషయం కాదని, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వంటి నాయకుడు ఎవరినీ నొప్పించకుండా సమన్వయం చేశారు కాబట్టే సక్సెస్‌ఫుల్ నేతగా పేరు గడించారని పేర్కొన్నారు.


జగ్గారెడ్డి

## వైరస్ నివారణకు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలి: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ మహమ్మారి విస్తరించకుండా నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వెంకట్ డిమాండ్ చేశారు. ప్రపంచదేశాలు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి నివారణ చర్యలు తీసుకుంటుంటే ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లు మాత్రం మాటలకే పరిమితం అవుతున్నారని విమర్శించారు. ఆదివారం జనతా కర్ఫ్యూ పాటించాలని చెబుతున్న మోదీ.. పేదలకు ఉచితంగా మాస్కులు, శానిటైజర్లు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం ఎంబీభవన్‌లో పార్టీ నాయకులు డీజీ నరసింహారావు, ఎం.సాయిబాబులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి జరగాల్సిన ఎన్‌పీఆర్, జనగణనను వాయిదా వేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రోజు కూలీలకు నెలరోజుల పాటు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని, 20 కేజీల బియ్యం, రూ.5వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ప్రభుత్వాలు చేపట్టే అవగాహన కార్యక్రమాల్లో పార్టీ, ప్రజాసంఘాల శ్రేణులు పాల్గొనాలని, గ్రామాల్లో ప్రజలకు జాగ్రత్తల గురించి వివరించాలని వెంకట్ కోరారు.

## హైదరాబాద్‌కు రాకండి

### కార్యకర్తలు, ప్రజలకు ఎంపీ కోమటిరెడ్డి విజ్ఞప్తి

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వైరస్ వ్యాప్తి నియంత్రణ అయ్యే వరకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఎవరూ హైదరాబాద్‌కు రావొద్దని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలు, ప్రజలకు తనతో ఏ అవసరమున్నా తాను, తన కార్యాలయ సిబ్బంది ఫోన్‌లో అందుబాటులో ఉంటామని తెలియజేశారు. కోవిడ్ వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, ప్రయాణాలన్నీ వాయిదా వేసుకోవాలని కోమటిరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ వైరస్‌ను నిర్మూలించవచ్చని, ప్రజలు ఓ సమూహంగా ఎక్కడా గుమికూడకుండా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, వైరస్‌ను దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరింటికి వారు పరిమితమై, అన్ని జాగ్రత్తలు పాటించి వైరస్‌ను తరిమేద్దామని పిలుపునిచ్చారు.



## హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్–19 విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి (హెల్త్ ఎమర్జెన్సీ) ప్రకటించాలని, కేరళ తరహా ప్యాకేజీ ప్రకటించాలని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మఖ్దూంభవన్‌లో శుక్రవారం సయ్యద్ అజీజ్‌పాషాతో కలసి మీడియాతో మాట్లాడారు. కోవిడ్ విస్తరణ కారణంగా ఉపాధి కోల్పోతున్న సంఘటిత, అసంఘటిత కార్మికులు, కూలీలు, చిరువ్యాపారులకు నిత్యావసర వస్తువులను ఉచితంగా అందజేయాలన్నారు. కోవిడ్ వ్యాప్తి నిరోధానికి కేరళ ప్రభుత్వం రూ.20 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో కూడా తగిన చర్యలు చేపట్టి ప్రజలకు పటిష్ట వైద్యసేవలు అందించాలన్నారు. కాగా, అకాల, వడగళ్ల వర్షం కారణంగా రాష్ట్రంలో దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, జొన్న ఆహార పంటలకు ఎకరానికి రూ.20 వేలు, మామిడి తోటలకు ఎకరానికి రూ.40 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతుసంఘం (సీపీఐ) ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ కోరారు.

## ప్రతీ పౌరుడి ఖాతాలో రూ.5 లక్షలు వేయాలి

### టీపీసీసీ ఎస్సీ విభాగం

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా గత ఎన్నికల్లో బీజేపీ హామీ ఇచ్చిన మేరకు రూ.15 లక్షల చొప్పున కాకపోయినా కనీసం రూ.5 లక్షల చొప్పున ప్రతి పౌరుడి బ్యాంక్ ఖాతాలో వెంటనే జతచేసి దేశాన్ని కొన్నిరోజుల పాటు లాక్‌డౌన్ చేయాలని టీపీసీసీ ఎస్సీ విభాగం డిమాండ్‌చేసింది. శుక్రవారం గాంధీభవన్‌లో ఈ విభాగం చైర్మన్ నాగరిగారి ప్రీతమ్ మీడియాతో మాట్లాడుతూ రేషన్‌షాపుల్లో రెండునెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని, మధ్య, పేద తరగతి వర్గాల వారు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు మూడునెలల పాటు వడ్డీ వసూలు చేయకుండా మారటోరియం పీరియడ్‌ను ప్రకటించాలని సూచించారు. వెంటనే మద్యం షాపులను మూసేసి డ్రంకన్ డ్రైవ్ నిలిపేయాలని, ఈ విపత్తు కారణంగా పౌల్ట్రీరంగంలో భారీగా నష్టపోయిన వ్యాపారులు, పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## నిరంతర విద్యుత్ సరఫరాపై సీఎండీ సమీక్ష

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్–19 వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు సర్వశక్తులు కేంద్రీకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విపత్కర పరిస్థితుల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా పలు చర్యలు తీసుకుంటోంది. నిరంతర విద్యుత్ సరఫరా కోసం చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అన్ని జోనల్, సర్కిళ్ల స్థాయిలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి అత్యయిక పరిస్థితిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తు, రెగ్యులర్ మెయింటెనెన్స్ చేపట్టడంతో పాటు, కోవిడ్ సాధారణ స్థితికి చేరిన తర్వాతే జల, థర్మల్ విద్యుత్ కేంద్రాల మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో చీఫ్ ఇంజనీర్ల నేతృత్వంలో కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేయాలని, నిర్మాణాలు జరిగే చోట సంబంధిత కాంట్రాక్టు సంస్థలు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. 15 రోజులకు సరిపడేలా బొగ్గు ఇతర ఇంధన నిల్వలు ఉండేలా చూసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టాలని ప్రభాకర్‌రావు ఆదేశించారు.


కోవిడ్ ప్రబలకుండా నిరోధించే చర్యల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై స్ప్రే చేస్తున్న దృశ్యం

# కేఫ్.. ఎలా సేఫ్!

### జన సమూహాలకు కేంద్రాలుగా చాయ్ కేఫ్‌లు

- నిత్యావసర జాబితాలో లేకున్నా వాటికీ అనుమతి
- తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు నడుస్తున్న వైనం
- చాలా కేఫ్‌లలో అపరిశుభ్ర పరిస్థితి.. కోవిడ్ వ్యాప్తికి అవకాశం
- సరిగ్గా శుభ్రపరచని గ్లాసుల్లో చాయ్, మంచినీటి సరఫరా
- తినగా వదిలేసిన బిస్కెట్లు, సమోసాలే ఇతరులకు...

**సాక్షి, హైదరాబాద్:** భయం వద్దు.. అవగాహనతో తరిమేద్దాం.. కోవిడ్ వైరస్ విషయంలో సర్వత్రా వినిపిస్తున్నమాట. నలుగురు ఓ చోట చేరితే వైరస్ ప్రబలే ప్రమాదం ఉన్నందున వీలైనంత మేరకు గుమికూడే పరిస్థితి లేకుండా చూడాలని ప్రభుత్వం వెల్లడించింది. అందుకే ప్రార్థనా మందిరాలకు వెళ్లకుండా ఇళ్లలోనే ప్రార్థనలు చేసుకోవాలని, శుభకార్యాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ.. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు జనానికి ఆహ్వానం పలికే కేఫ్‌లు మాత్రం ఇప్పుడూ అదే పంథాను అనుసరిస్తూ బెదరగొడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తప్ప మిగతా చోట్ల ఇప్పటికీ అవి కిటకిటలాడుతూనే ఉన్నాయి. సమోసాలు తింటూ చాయ్ బిస్కెట్లు లాగించే వారితో కేఫ్‌లు నిండుగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ పాతనగరం పరిధిలో పరిస్థితి ఎప్పటిలాగే ఉంది. ఓ వైపు కోవిడ్ వైరస్ భయపెడుతుండటంతో వీలైనంత వరకు జనసమూహం లేకుండా చేయటం ద్వారా వైరస్ మన ప్రాంతంలో విస్తరించకుండా చూడాలన్న తాపత్రయం కనిపిస్తుండగా, కేఫ్‌ల నిర్వాహకులు మాత్రం దాన్ని పట్టించుకుంటున్నట్టు కనిపించటం లేదు.

### పెరుగుతున్న కేసులు..

గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో కోవిడ్ వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య కాస్త వేగంగానే పెరుగుతోంది. నాలుగైదు రోజుల క్రితం వరకు పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్న ధీమా కనిపించింది. కానీ అనూహ్యంగా, ఇండోనేసియాకు చెందిన కొందరు మత ప్రచారానికి నగరానికి రావటం, వారిలో ఓ బృందంలోని పది మందికి గాను పది మందికి కోవిడ్ వైరస్ సోకడంతో ఇప్పుడు ఆందోళన పెరిగింది. ఇండోనేసియాకు చెందిన మరో రెండు బృందాలు కూడా ఉన్నట్టు గుర్తించిన అధికారులు వారి నమూనాలు సేకరించి పరీక్షకు పంపారు. ఇండోనేసియాకు చెందిన కోవిడ్ బాధితులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తిరిగినందున వేరేవారికి కూడా వైరస్ సోకిందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితిలో ప్రజలు వీలైనంతమేరకు సమూహంగా ఉండకుండా ఉంటే, పరిస్థితి అదుపు తప్పకుండా కట్టడి చేసే అవకాశం ఉంటుంది. కానీ, ఆ ప్రయత్నానికి కేఫ్‌లు గండికొడుతున్నాయి.

### గల్లీగల్లీలో..

కోవిడ్ వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో.. అది ఒకరి నుంచి ఒకరికి పాకకుండా ఉండేందుకు ఇటీవల ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా విద్యా సంస్థలు, సినిమా హాళ్లు, మ్యూజియాలు, పార్కులు, జిమ్నాజియంలు, ఈతకొలనులు.. ఇలాంటి వాటిని మూసేసింది. అయితే జనం సరుకులు కొనేందుకు వీలుగా మాల్స్, ఇతర దుకాణాలకు మాత్రం అనుమతించింది. ఇవి నిత్యావసరాలకు సంబంధించినవి కావటంతో వాటిని మూసివేయించటం సరికాదని ప్రభుత్వం భావించింది. కానీ ఏ రకంగానూ అత్యవసరం, నిత్యావసరం జాబితాలోకి రానప్పటికీ కేఫ్‌లు మాత్రం యథాప్రకారం తెరిచే ఉంటున్నాయి. హైదరాబాద్ నగరంలో దాదాపు 23 వేల వరకు కేఫ్‌లున్నాయి. ఇవన్నీ ఇప్పుడు కోవిడ్ భయం ఇసుమంతైనా లేకుండా దర్జాగా జనంతో కళకళలాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం గతంతో పోలిస్తే రద్దీ తక్కువగానే ఉన్నా, చాలా ప్రాంతాల్లో ఎప్పటిలాగానే కేఫ్‌లు కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ పాతనగరం, ఇతర ప్రాంతాల్లోని బస్తీల్లో అవి జన సమూహం కూడేందుకు కేంద్రాలుగా ఉన్నాయి. చాలా కేఫ్‌లలో ఎక్కువ మంది టైంపాస్ జనమే కనిపిస్తారు. దోస్తులతో కలసి కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ.. సిగరెట్లు కాలుస్తూ చాయ్ బిస్కెట్లను లాగించేవారే ఎక్కువ. ఇటు రోజులో నాలుగైదు పర్యాయాలు కేఫ్‌లలో టైంపాస్ చేసే వారూ ఉన్నారు.

### ఇవి ప్రమాదకరం కావా...

**1. గ్లాసులు శుభ్రం చేస్తారా..:**



కొన్ని పెద్ద కేఫ్‌లలో ఎప్పుడు చూసినా వందమందికి తగ్గకుండా కనిపిస్తారు. చిన్న వాటిల్లో ఆ సంఖ్య పది నుంచి 20 మంది వరకు ఉంటుంది. కేఫ్ అనగానే ముందుగా కనిపించేది చాయ్. నిత్యం వం దల కప్పుల చాయ్ ఖర్చవుతుంటుంది. చాయ్‌కి ముందుగా వేళ్లు నీటిలో మునిగేలా బాయ్ మంచి నీటి గ్లాసులు తెచ్చిపెడతాడు. ఈ గ్లాసులను సరిగా శుభ్రం చేయరన్న విషయం తెలిసిందే. వెరసి ఎంగిలి గ్లాసుల విధానం చాలాచోట్ల కనిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితిలో ఇది ప్రమాదంగా పరిణమిస్తుందన్న భయం వ్యక్తమవుతోంది.

**2. ఆ వదిలేసిన బిస్కెట్లు, సమోసాలే ఇతరులకు..:**



కేఫ్‌లలో బిస్కెట్లు, సమోసాలు అనగానే ప్లేట్‌లో కొన్నింటిని తెచ్చి పెడతారు. అందులో మనం తినగా మిగిలిన వాటిని తిరిగి తీసుకెళ్లి ఇతరులకు అందిస్తారు. ఈ క్రమం లో ఆ బిస్కెట్లు, సమోసాలు ఎక్కువ మంది తడిమేందుకు అవకాశం కలుగుతుంది. చిన్నపాటి నిర్లక్ష్యం ఉన్నా వైరస్ విస్తరించే తరుణంలో ఇది ప్రమాదకరమే కదా..!

**3. బయటి తిండి వద్దన్నప్పుడు..:**



కోవిడ్ విస్తరిస్తున్న వేళ వీలైనంతవరకు బయటి తిండికి దూరంగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేయటం, తయారు చేసే వారు కనీస జాగ్రత్తలు తీసుకుంటారన్న నమ్మకం లేకపోవటం.. ఇందుకు కారణం. మరి కేఫ్‌లు దానికి గండికొడుతున్నాయి.

**4. ఒకరికొకరు తగిలేలా..:**

ఒక టేబుల్ చుట్టూ నలుగురైదుగురు కూర్చుంటారు. స్థలాభావం వల్ల.. ఉన్నంతలో ఎక్కువ మంది కూర్చునేలా చిన్న టేబుళ్లు, చిన్న కుర్చీలుంటాయి. ఫలితంగా వారంతా ఒకరినొకరు తగిలేలా కూర్చుంటారు. ఇది ప్రస్తుత పరిస్థితిలో అత్యంత ప్రమాదకరం.

**5. ఒక సిగరెట్.. ముగ్గురు మిత్రులు..:**

ఒక సిగరెట్ వెలిగించి సరదాగా దాన్ని ఇద్దరు ముగ్గురు మిత్రులు కాల్చే పరిస్థితి ఇప్పటికీ ఉంది. ఇందుకు ఎక్కువగా కేఫ్‌లే వేదికవుతాయి. చాయ్ తాగి ఓ సిగరెట్ వెలిగించి తలో రెండు పఫ్‌లు లాగించి వెళ్లిపోతుంటారు. ఈ ఎంగిలి కూడా ప్రమాదకరమే. కేఫ్‌లో పొగయ్యే అవకాశం లేకుంటే ఇది కూడా కొంతమేర తగ్గుతుంది.


శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుంటున్న గవర్నర్ తమిళిసై

## అప్రమత్తంగా ఉండండి..

### గవర్నర్ తమిళిసై పిలుపు

**సాక్షి, హైదరాబాద్:** 'తెలంగాణ సోదర సోదరీమణులారా చేతులు బాగా కడుక్కోండి, దూరాన్ని పాటించండి. ఇంట్లోనే ఉండండి. 'కోవిడ్'లక్షణాలు ఉన్నట్లు అనుమానాలు వస్తే డాక్టర్‌ను సంప్రదించండి. అప్రమత్తంగా ఉండండి. కానీ ఆందోళన పడకండి. ప్రభుత్వం మీతో ఉంది' అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రజలకు భరోసా ఇచ్చారు. కోవిడ్ –19 ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె పిలుపునిచ్చారు. ప్రజలను రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయని, ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ప్రజలు పాటించాలని గవర్నర్ కోరారు. గతంలో మన పెద్దలు యుద్ధాలను చూశారని, ప్రస్తుత తరం వైరస్ రూపంలో 'బయోవార్'ను ఎదుర్కొంటున్నదని గవర్నర్ వ్యాఖ్యానించారు.

### 22న రాజ్‌భవన్‌లో థ్యాంక్స్ గివింగ్

ప్రధాని మోదీ పిలుపుమేరకు ఈ నెల 22న జనతా కర్ఫ్యూను విజయవంతం చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. 'కోవిడ్'ను అరికట్టేందుకు పోరాడుతున్న వారికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ నెల 22న సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తమిళిసై వెల్లడించారు. మీడియా సమావేశానికి వచ్చిన గవర్నర్‌కు రాజ్‌భవన్ వైద్య బృందం థర్మల్ స్క్రీనింగ్ పరీక్ష చేసి, శానిటైజర్‌ను అందజేశారు.

# ఎక్కడి రైళ్లు అక్కడే..

- జనతా కర్ఫ్యూలో భాగంగా ఆదివారం నిలిపివేత
- బస్సుల విషయంలో ఇంకా నిర్ణయించని రాష్ట్ర ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** ఆదివారం ఎక్కడి రైళ్లు అక్కడే నిలిచిపోనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ఉదయం 7 నుంచి రాత్రి 9 వరకు రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోనున్నాయి. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైళ్లు రెండు మూడింటిని నడిపించే అవకాశం ఉందని పేర్కొంటున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఇతర సాధారణ రైళ్లను మాత్రం నిర్ధారిత సమయంలో నడపబోమని చెబుతున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ముందే ప్రయాణం ప్రారంభించిన దూరప్రాంత రైళ్లు మాత్రం యథావిధిగా గమ్యం వైపు వెళ్లనున్నాయి. కానీ ఉదయం 7 నుంచి రాత్రి 9 మధ్య ప్రారంభమయ్యే మిగతా అన్ని రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. ప్యాసింజర్ రైళ్లకు సంబంధించి దాదాపు 2,400 సర్వీసులు, దూర ప్రాంతాలకు తిరిగే రైళ్లకు సంబంధించి దాదాపు 1,300 సర్వీసులు నిలిచిపోనున్నాయి. నగరంలో తిరిగే 121 ఎంఎంటీఎస్ రైళ్లలో రెండు, మూడు మినహా మిగతావాటిని నిలిపేస్తున్నారు. అవసరాన్ని బట్టి వాటిని అతి తక్కువ ట్రిప్పుల్లో తిప్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని కూడా నడపాలా, పూర్తిగా నిలిపేయాలా అన్న విషయంలో శనివారం తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఆర్టీసీ బస్సుల విషయంలో మాత్రం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతానికి తాము ఏ నిర్ణయం తీసుకోలేదని, ప్రభుత్వం నుంచి ఆదేశం వస్తే శనివారం నిర్ణయిస్తామని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. డిమాండ్ ఆధారంగా బస్సులను తిప్పే అవకాశమే ఉందని మరో అధికారి పేర్కొన్నారు.


టికెట్ కౌంటర్ వద్ద క్యూ లైన్‌లో ఏర్పాటు చేసిన మార్కింగ్

### టికెట్ క్యూలో మీటర్ దూరం

కోవిడ్ ప్రమాదం పొంచి ఉన్నా, జనజీవనానికి ఇబ్బంది లేకుండా రైళ్లు నడుపుతున్నారు. వీలైనంత మేర రద్దీ తగ్గేలా చర్యలు ప్రారంభించారు. దీంతో ప్రయాణికుల మధ్య వీలైనంత దూరం ఉండేలా అధికారులు చర్యలు ప్రారంభించారు. సాధారణంగా టికెట్ బుక్ చేసుకునే విషయంలో ప్రయాణికులు ఒకరి వెనక ఒకరు తగులుకుంటూ నిలబడతారు. ఇది ప్రమాదానికి హేతువుగా భావిస్తున్న అధికారులు ఇప్పుడు ఇద్దరి మధ్య కనీసం మీటర్ దూరం ఉండేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో రిజర్వేషన్ కార్యాలయాలు, సాధారణ బుకింగ్ కేంద్రాలు, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ల వద్ద, పార్సిల్ కార్యాలయాల వద్ద ఒకరికి ఒకరికి మధ్య మీటర్ దూరం ఉండేలా ఫ్లోర్‌పై మార్కింగ్ ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో ఉన్నప్పుడు ఒక్కో ప్రయాణికుడు ఆ గీతల మధ్యలోనే నిలబడాల్సి ఉంటుంది. ఈ విషయంలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఆర్‌పీఎఫ్ సిబ్బందిని నియమించారు.

### డార్మిటరీల మూసివేత

రైల్వే స్టేషన్లలో రద్దీ లేకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఉన్న రిటైరింగ్ రూమ్స్, డార్మిటరీలను మూసేయాలని రైల్వే నిర్ణయించింది. శనివారం రాత్రి 12 నుంచి ఏప్రిల్ 15 రాత్రి 12 వరకు వీటిని మూసి ఉంచాలని నిర్ణయించింది. వాటికి సంబంధించి ఆన్‌లైన్ సహా బుకింగ్స్‌ను నిలిపేసింది. ఇప్పటికే వాటిని బుక్ చేసుకున్న వారికి డబ్బులు తిరిగి చెల్లించనున్నట్టు అధికారులు ప్రకటించారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే కోవిడ్ కట్టడి

- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి
- డాక్టర్ల సంఘాలు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ సంఘాలతో సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఎంత మంది డాక్టర్లున్నా ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్యమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. డాక్టర్ల సంఘాలు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ తదితర సంఘాలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. డాక్టర్లు చెప్పేది ప్రజలు ఎక్కువగా నమ్ముతారన్నారు. అందుకే మండల స్థాయి నుంచే ప్రజలను కోవిడ్ బారి నుంచి తప్పించుకునేలా చైతన్యపరచాలని వారికి విన్నవించారు. వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు చెప్పాలని డాక్టర్ల సంఘాలకు సూచించారు. వైరస్ సోకిన వారికి చికిత్స అందించేందుకు మన సామర్థ్యాన్ని అంచనా వేసుకుని పెట్టుకున్నామని తెలిపారు. వెయ్యి మంది వచ్చినా చికిత్స అందించే సామర్థ్యం ఉందన్నారు. ఇంట్లో ఉండడానికి జాగా లేని వారికి క్వారంటైన్ సెంటర్ల ఏర్పాటు కొనసాగుతుందని చెప్పారు. ప్రస్తుతానికి ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. రోగుల సంఖ్య పెరిగితే ప్రైవేటు ఆసుపత్రులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ యోగితా రాణా, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం ఆపొద్దు: సత్యవతి రాథోడ్

- ఉదయం 11 గంటల్లోపు వండి పంపిణీ చేయాలి
- వేడిగా ఉన్నప్పుడు అందిస్తేనే సత్ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** అంగన్‌వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిందేనని, కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునేంత వరకూ పౌష్టికాహార పంపిణీని ఆపవద్దని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో శుక్రవారం డీఎస్ఎస్ భవన్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి దివ్య, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ తదితరులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఆరోగ్య లక్ష్మి పథకం కింద అందించే భోజనాన్ని ఉదయం 9 గంటల నుంచి 11 గంటల్లోపు వండి, పంపిణీ చేయాలన్నారు. ఈ పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు తింటేనే మంచి ఫలితాలు వస్తాయని, ఈమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసే అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

### లక్షణాలుంటే సమాచారమివ్వండి

కోవిడ్ లక్షణాలున్నట్లు గుర్తిస్తే వెంటనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన పరిశుభ్రత చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు గుమికూడకుండా ఉపాధ్యాయులు వెంట ఉండి పర్యవేక్షించాలన్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో శానిటైజర్లు అందుబాటులో ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. అనంతరం మహబూబాబాద్, ములుగు, వరంగల్ అర్బన్ కలెక్టర్లతో మంత్రి సత్యవతి రాథోడ్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, ఈ మూడు జిల్లాలకు విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిపై గట్టి నిఘా ఉంచాలన్నారు.


సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్

## స్పాట్ వాల్యుయేషన్ వాయిదా వేయండి

### జూనియర్ లెక్చరర్ల వినతి

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన (స్పాట్ వాల్యుయేషన్) వాయిదా వేయాలని జూనియర్ లెక్చరర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని మూల్యాంకన కేంద్రంలో శుక్రవారం వారు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 18నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షల వ్యాల్యుయేషన్ ఈ నెలాఖరు వరకు నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో వ్యాల్యుయేషన్ కేంద్రంలో వందల మంది లెక్చరర్లు ఒకే చోట ఉండి జవాబు పత్రాలను దిద్దడం వల్ల సమస్య తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల వ్యాల్యుయేషన్‌ను నిలిపివేయాలని కోరుతున్నారు. లెక్చరర్ల ఆందోళనను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

### నేటి నుంచి రెండు షిఫ్టులలో..

ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈనెల 21 నుంచి రెండు విడతల్లో చేపట్టాలని బోర్డు పరీక్షల నియంత్రణాధికారి క్యాంపు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒక విడతలో ఇంగ్లిషు, సివిక్స్, తెలుగు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 7 గంటల వరకు రెండో విడతలో మ్యాథ్స్, హిందీ, సంస్కృతం జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలని పేర్కొన్నారు. వాల్యుయేషన్ కేంద్రాల్లో కుర్చీలు, బల్లలు అన్నింటిని శానిటైజ్ చేయాలని, డెటాల్‌తోనూ శుభ్రపరచాలని పేర్కొన్నారు. శానిటైజర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

సాక్షి
శనివారం, మార్చి, 21

# ఎంపీలో కాంగ్రెస్‌కు భంగపాటు

అధికారాన్ని కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ శుక్రవారం రాజీనామా చేయకతప్పలేదు. ఆరుగురు మంత్రులతోసహా 23మంది ఎమ్మెల్యేలు కర్ణాటకలోని రిసార్ట్‌కు వలసపోయి, కమల్‌నాథ్ నాయకత్వంలో తమకు విశ్వాసం లేదని పదిరోజులక్రితం ప్రకటించినప్పటినుంచీ రాష్ట్రం రాజకీయ సంక్షోభంలో పడిపోయింది. వారితో మాట్లాడటానికి, వెనక్కు తీసుకురావడానికి దిగ్విజయ్‌సింగ్ మొదలుకొని కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రయత్నం ఫలించకపోగా...రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు స్పీకర్‌ను నేరుగా కలిసి తమ నిర్ణయం ఇష్టపూర్వకమైనదని, దాని వెనక ఎవరి ఒత్తిళ్లూ లేవని చెప్పే సంప్రదాయంనుంచి సుప్రీంకోర్టు మినహాయింపు ఇవ్వడంతో కమల్‌నాథ్ ప్రభుత్వ పతనం ఖాయమైపోయింది. వారు నేరుగా రాలేకపోతే వీడియో కాల్ ద్వారా వారి అభిప్రాయాలు తీసుకోమని సుప్రీంకోర్టు సూచించగా స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతి నిరాకరించారు. రాజీనామాలను ధ్రువీకరించడానికి భోపాల్‌లో అడుగుపెట్టినప్పుడు ఆ ఎమ్మెల్యేలను ఒప్పించవచ్చని కాంగ్రెస్ భావించింది. తిరుగుబాటు చేసిన చాలామందిలో అంతర్మథనం మొదలైందని, సభలో ఓటింగ్ జరిగినప్పుడు కాంగ్రెస్ సత్తా ఏమిటో తేలుతుందని కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అంతకు కొన్ని రోజుల ముందు చెప్పడంలోని అంతరార్థం ఇదే. కానీ ధర్మాసనం నుంచి వచ్చిన వీడియో కాల్ ప్రతిపాదనతో కాంగ్రెస్ ఆశలు కల్లలయ్యాయి. ఆరుగురు మంత్రులూ శాసనసభ్యత్వాలకు చేసిన రాజీనామాలను స్పీకర్ ఆమోదించారు. మిగిలిన వారిపై ఒత్తిళ్లు లేవని స్పీకర్ వ్యక్తిగతంగా సంతృప్తి చెందాల్సివుంటుందని ఆయన తరఫు న్యాయవాది చేసిన వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. సభకు రావాలా వద్దా అనేది ఎమ్మెల్యేల ఇష్టమని, హాజరుకావాలనుకున్నవారికి రక్షణ కల్పించాలని కర్ణాటక, మధ్యప్రదేశ్ డీజీపీలను ఆదేశించింది. పైగా సభలో ఓటింగ్ తప్ప మరేదీ చేపట్టడానికి వీల్లేదని, అది కూడా చేతులెత్తడం ద్వారా మాత్రమే జరగాలని, దీన్నంతటినీ వీడియో తీయాలని ఆదేశించింది.

అధికార పక్షాలనుంచి ఫిరాయింపుల్ని ప్రోత్సహించడం, ప్రభుత్వాలను కూల్చడం మన దేశంలో కొత్తేమీ కాదు. అలా ఫిరాయించినవారిని వెనక్కు తీసుకురావడానికి అధికార పక్షాలనుంచి ప్రయత్నాలూ రివాజే. కానీ మధ్యప్రదేశ్ డ్రామాలో మొదటి సగం మాత్రమే జరిగింది. వెళ్లినవారంతా కర్ణాటక విడిది నుంచి వెనక్కు రావడానికి, కాంగ్రెస్ పెద్దల్ని కలవడానికి నిరాకరించారు. రాజీనామాల సంగతిని ధ్రువీకరించడానికి స్పీకర్‌ను వ్యక్తిగతంగా కలిసేందుకు కూడా సిద్ధపడలేదు. ఫిరాయింపులకు పాల్పడితే శాసనసభ్యత్వం కోల్పోయేవిధంగా చట్టం తీసుకొచ్చిన కాంగ్రెసే అంతకు ముందూ, ఆ తర్వాతా కూడా ఫిరాయింపు రాజకీయాలను ప్రోత్సహించింది. ప్రభుత్వాల భవితవ్యాన్ని రాజ్‌భవన్‌లే తేల్చే సంప్రదాయాన్ని కూడా ఆ పార్టీయే మొదలుపెట్టింది. ఇలా ప్రభుత్వాలను ఇష్టానుసారం బర్తరఫ్ చేయడానికి వీల్లేదని, బలాబలాలు చట్టసభల్లోనే తేలాలని ఎస్‌ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేశాక ఈ ధోరణి తగ్గింది. అయితే పూర్తిగా కనుమరుగు కాలేదు. ఇప్పుడు కేంద్రంలో ఎన్‌డీఏ కూటమికి నాయకత్వంవహిస్తున్న బీజేపీ ఆ ఎత్తుగడలకే కొత్త పద్ధతులు జోడించింది. 60 స్థానాలున్న అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో 42 స్థానాలు గెల్చుకున్న కాంగ్రెస్‌ను నాలుగేళ్లక్రితం సునాయాసంగా అధికారం నుంచి దించేయగలిగింది. ప్రభుత్వం ఏర్పాటుకు తగినన్ని స్థానాలు గెల్చుకోని గోవాలో కూడా అది అధికారం తెచ్చుకోగలిగింది. కర్ణాటకలో సరేసరి. అక్కడ 14 నెలలపాటు కొనసాగిన కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వాన్ని నిరుడు జూలైలో కూల్చడంలోనూ ఈ కొత్త ఎత్తుగడలే అక్కరకొచ్చాయి. ఇప్పుడు మధ్యప్రదేశ్‌లో సైతం బీజేపీ ఈ ఎత్తుగడలనే అనుసరించింది.

మధ్యప్రదేశ్ సంక్షోభం హఠాత్తుగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల పర్యవసానంగా జరిగినట్టు కనబడినా 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఇందుకు సంబంధించిన బీజాలు పడ్డాయి. అక్కడ ముగ్గురు నేతలు–దిగ్విజయ్‌సింగ్, కమల్‌నాథ్, జ్యోతిరాదిత్య సింధియా శిబిరాలుగా కాంగ్రెస్ చీలిపోయింది. ఎన్నికల సమయంలో కాబోయే సీఎం జ్యోతిరాదిత్యేనని రాహుల్ గాంధీ అందరిలోనూ అభిప్రాయం కలిగించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాలు గెల్చుకోగా, బీజేపీ 109కి పరిమితమైంది. సీఎం పీఠంపై ఎవరుండాలో మీరే నిర్ణయించాలని రాహుల్‌గాంధీని లెజిస్లేచర్ పార్టీ ఏకగ్రీవంగా కోరినా, ఆయన ఆ పని చేయలేకపోయారు. కమల్‌నాథ్ వైపే సోనియాగాంధీ మొగ్గు చూపడం, అందుకోసం రాహుల్‌పై ఒత్తిడి తీసుకురావడం పర్యవసానంగానే ఇలా జరిగింది. రాజీ మార్గంగా ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తామని జ్యోతిరాదిత్యను ఒప్పించినా, అయితే తమ వర్గంనుంచి కూడా మరో ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని దిగ్విజయ్‌సింగ్ డిమాండ్ చేశారు. దీంతో జ్యోతిరాదిత్య వెనకడుగు వేశారు. ఆయనకు కనీసం రాజ్యసభ స్థానాన్ని ఇస్తామని కూడా పార్టీ హామీ ఇవ్వలేకపోయింది. ముగ్గురు నేతల తీరువల్ల ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వున్నా అధిష్టానం మేల్కొనలేదు. ఈ పరిస్థితిని తనకనుకూలంగా మలుచుకోవడంలో బీజేపీ విజయం సాధించింది. ఆయన్ను తమ పార్టీలో చేర్చుకుని ఎంపీగా అవకాశమిచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదించారు గనుక ఆ స్థానాలకు త్వరలోనే ఎన్నికలు జరిగే అవకాశం వుంది. అయితే వాటిల్లో ఎన్నిటిని కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోగలదన్నదాన్ని బట్టి మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ భవితవ్యం ఆధారపడివుంటుంది. పార్టీలో ఉన్నన్నాళ్లూ జ్యోతిరాదిత్యకు పొగబెట్టిన ఇద్దరు సీనియర్ నేతలు కమల్‌నాథ్, దిగ్విజయ్‌సింగ్‌లు ఆ ఉప ఎన్నికల్లో ఏమేరకు తమ సత్తా చాటుతారో చూడాల్సివుంది. అంతకన్నా ముందు మరింతమంది ఎమ్మెల్యేలు బీజేపీ వైపు పోకుండా చూడటం వారికి పెద్ద పరీక్ష.

# సైన్స్‌ను విశ్వసిస్తేనే విజయం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

**భారతీయ వైద్య చరిత్రలో ప్లేగు వ్యాధిపై పోరాటంలో తన ప్రాణాలను పణంగా పెట్టిన తొలి వైద్యుడు డాక్టర్ యశ్వంత్‌రావు పూలే. 1896–97లో బ్యూబోనిక్ ప్లేగు విరుచుకుపడినప్పుడు బొంబాయిలో ప్రత్యేక క్లినిక్ ప్రారంభించి, కులమతాలకు అతీతంగా ప్లేగు రోగులకు సేవ చేస్తూన్న క్రమంలోనే తన తల్లి సావిత్రీబాయి పూలేతో పాటు డాక్టర్ యశ్వంతరావు కన్నుమూశారు. ఇప్పుడు ఎయిర్ కండిషన్ ఉన్న విమానాల్లో అంతర్జాతీయ ప్రయాణాలు సాగిస్తున్న కాలంలో ఖండాంతరాలకు వ్యాపిస్తున్న కరోనా వైరస్ ఇంకా ఎక్కువ ప్రమాదకారిగా మారనుంది. డాక్టర్ యశ్వంతరావు, సావిత్రీబాయి పూలే వంటి సాహసోపేతులైన వైద్యులు, నర్సులతో కూడిన ఆసుపత్రులు చేసే త్యాగాలు మాత్రమే ప్రపంచాన్ని, భారత్‌ని కాపాడగలవు.**

కోవిడ్–19 అటు సంపన్నుల్లో, ఇటు పేదల్లో ప్రపంచవ్యాప్త సంక్షోభాన్ని సృష్టించిందనడంలో సందేహమే లేదు. ప్రతి మనిషిలోనూ ఇప్పుడు నెలకొన్న మృత్యు భయం ప్రపంచవ్యాప్తంగా మానవుల్లోని మంచి, చెడు ప్రవర్తనకు పరీక్షకు గురిచేస్తోంది. విశ్వాసం ప్రాతిపదికగా ఏర్పడిన అన్ని సంస్థలూ, చివరకు మతాలు, మఠాలు, పీఠాలు, సన్యాసులు, సాధువులు, బిషప్‌లు, ముల్లాలు తదితరులందరూ కరోనా విషయమై పరీక్షకు నిలబడాల్సి వస్తోంది. ఈ ప్రాణాంతక సంక్రమణ వ్యాధికి వీరివద్ద ఏ మందూ లేదు మరి. ప్రపంచంలోని మానవులందరూ ప్రస్తుత కల్లోల పరిస్థితుల్లో డాక్టర్లు, నర్సులే తమ ప్రాణరక్షకులని, ఆసుపత్రులు మాత్రమే తమని ప్రాణాలతో నిలిపే దేవాలయాలు అని నమ్మడం మొదలుపెట్టేశారు.

ప్రతి క్షణం, ప్రతి గంటా కరోనాకు సంబంధించిన ప్రమాదాన్ని, ఆందోళనను ఎదుర్కొంటూనే కోవిడ్–19 రోగులకు సేవ చేయడంలో మునిగిపోయిన డాక్టర్లు, నర్సులందరికీ మనం తప్పక సెల్యూట్ చేయాలి. వాటికన్, మక్కా, తిరుపతి, షిర్డీ వంటి అన్ని ఆలయాలూ, చర్చిలూ, మసీదులూ, ప్రపంచంలోని అతి పెద్ద బౌద్ధ విహారాలు కూడా ప్రస్తుతం మూతపడిపోయాయి. భూమ్మీద నిజమైన దేవుడు లేక దేవత అయిన డాక్టర్, నర్సు కోసమే మనం ఇప్పుడు చూస్తున్నాం. నిస్సందేహంగానే, కోవిడ్–19 ఇప్పుడు ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తోంది. అదేమిటంటే సైన్స్, మందులతో కూడిన సరికొత్త ప్రపంచం.

ఈ సందర్భంగా భారతీయ వైద్య చరిత్రలో తన ప్రాణాలను పణంగా పెట్టిన మొట్టమొదటి డాక్టరు గురించి మనం తెలుసుకోవలసి ఉంది. 1897లో భారతదేశంలో బ్యూబోనిక్ ప్లేగు వ్యాధి విజృంభించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మహాత్మా జ్యోతీరావ్ పూలే, సావిత్రీబాయి పూలేల దత్తపుత్రుడు డాక్టర్ యశ్వంతరావు పూలే నిజంగానే చరిత్రకెక్కారు. 1896–97 కాలంలో బొంబాయిలో ప్రత్యేక క్లినిక్ ప్రారంభించి ప్లేగు రోగులకు సేవ చేస్తూన్న క్రమంలోనే తనను దత్తత తీసుకున్న తల్లి సావిత్రీబాయి పూలేతో పాటు డాక్టర్ యశ్వంతరావు కన్నుమూశారు. సమకాలీన వైద్యులు కూడా అనుసరించాల్సిన గొప్ప ఉదాహరణగా ఆయన నిలిచిపోయారు.

తన తల్లిదండ్రుల సామాజిక సంస్కరణోద్యమంలో భాగంగా అన్ని కులాలు, కమ్యూనిటీలకు చెందిన ప్లేగ్ రోగులకు సేవచేసిన మొట్టమొదటి వైద్యుడిగా డాక్టర్ యశ్వంతరావు పూలే చరిత్రలో నిలిచిపోయారు. బ్రిటిష్ పాలకులు కులాలకు అతీతంగా వైద్యసేవలందించడాన్ని తప్పనిసరి చేయడంతో బ్రాహ్మణులు వైద్య వృత్తిని చేపట్టడం నిలిపివేశారు. వర్ణధర్మానుసారం.. బ్రాహ్మణులు చికిత్స సమయంలో కూడా దళితులను, శూద్రులను తాకడానికి ఇష్టపడేవారు కాదు. అప్పుడే పూలే సత్యశోధక్ ఉద్యమం మానవ అస్పృశ్యత, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా భారీ ప్రచారాన్ని చేపట్టింది.

పూలే దంపతులకు సంతానం లేకపోవడంతో బ్రాహ్మణ వితంతువు అయిన కాశీబాయి పుత్రుడిని దత్తత తీసుకున్నారు. భర్త మరణానంతరం ఆమె గర్భం దాల్చడంతో పూనాలోని ఛాందస బ్రాహ్మణులు ఆ వితంతువును చంపాలనుకున్నారు. బాలగంగాధర్ తిలక్ సైతం



1897లో ప్లేగు బారిన పడిన రోగికి సేవలందిస్తున్న వైద్యుడు

వారి ఈ ప్రయత్నాన్ని బలపర్చడం గమనార్హం. పూలే ఆమెను కాపాడి తమ ఇంట్లోనే ఆశ్రయమిచ్చి తల్లి, బిడ్డలను క్షేమంగా చూసుకున్నారు. 1874లో ఆ వితంతువు కుమారుడు యశ్వంతరావును పూలే దంపతులు దత్తత తీసుకున్నారు. అతడిని విద్యావంతుడిని చేసి వైద్యుడిని చేశారు. తాము ప్రారంభించిన సంఘ సంస్కరణోద్యమంలో పనిచేస్తున్న వ్యక్తి కుమార్తె రాధతో యశ్వంతరావుకు పెళ్లి చేశారు. అది కులాంతర వివాహం. బ్రాహ్మణ పండితులు జరిపే పెళ్లి పద్ధతికి భిన్నంగా దండలు మార్చుకునే సాధారణ పద్ధతిలో ఈ ఇద్దరి పెళ్లి చేశారు. దీంతో పూజారులు ఈ పెళ్లిని కోర్టుకు లాగారు కూడా.

జ్యోతిబా పూలే 1890లో చనిపోయారు. తర్వాత సావిత్రి, ఆమె కుమారుడు తమ సామాజిక, వైద్య సేవలను కొనసాగించారు. సావిత్రీబాయి జీవిత చరిత్రకారుడొకరు ఇలా రాశారు: 'ప్రపంచమంతటా వ్యాపించిన మూడవ బ్యూబోనిక్ ప్లేగు సంక్రమణ వ్యాధి 1897లో మహారాష్ట్రలోని నల్లస్పోరా ప్రాంతాన్ని చుట్టుముట్టినప్పుడు సావిత్రీబాయి, యశ్వంతరావు సాహసోపేతంగా పూనా శివార్లలో ఒక క్లినిక్ ప్రారంభించి ప్లేగ్ వ్యాధికి గురైన రోగులకు సేవ చేశారు. రోగులను సావిత్రీబాయి క్లినిక్‌వద్దకు తీసుకువస్తే యశ్వంతరావు వారికి చికిత్స చేసేవారు. రోగులకు సేవ చేస్తున్న క్రమంలోనే సావిత్రీబాయికి కూడా ప్లేగు సంక్రమించి 1897 మార్చి 10న కన్నుమూశారు'.

ఈ విషాదం అంతటితో ముగియలేదు. అదే సంవత్సరం ప్లేగు వ్యాధికి గురైన డాక్టర్ యశ్వంతరావు కూడా మరణించారు. బ్యూబోనిక్ ప్లేగు అనే ఈ సాంక్రమిక వ్యాధి మానవులు నివాసమున్న అన్ని ప్రాంతాలకూ వ్యాపించింది. ఈ వ్యాధి బారినపడి భారత్, చైనాల్లో కోటి 20 లక్షలమంది చనిపోయారు. ఒక్క భారత్‌లోనే కోటిమంది రోగులు చనిపోయారు. ఆ సమయంలో డాక్టర్ యశ్వంత రావు త్యాగం నుంచే భారతదేశంలో వైద్య చికిత్సలు రూపుదిద్దుకున్నాయి. ఆయనలాగే మరొక భారతీయ వైద్యులు డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్ 1930లలో చైనాలో రోగులకు సేవలు చేసి చరిత్రలో మిగిలిపోయారు. 1938లో రెండో సీనో–జపనీస్ యుద్ధ కాలంలో వైద్యసేవలందించడానికి భారత్‌నుంచి వెళ్లిన అయిదుగురు వైద్య బృందంలో కోట్నీస్ ఒకరు. చైనాలో వైద్యసేవలందిస్తూనే కోట్నీస్ అమరుడయ్యారు.

ఇప్పుడు ఎయిర్ కండిషన్ ఉన్న విమానాల్లో అంతర్జాతీయ ప్రయాణాలు సాగిస్తున్న కాలంలో ఖండాంతరాలకు వ్యాపిస్తున్న కరోనా వైరస్ ఇంకా ఎక్కువ ప్రమాదకారిగా మారనుంది. డాక్టర్ యశ్వంతరావు పూలే, సావిత్రీబాయి పూలే వంటి సాహసోపేతులైన సుశిక్షితులైన వైద్యులు, నర్సులతో కూడిన ఆసుపత్రులు చేసే త్యాగాలతో మాత్రమే ప్రపంచాన్ని, భారత్‌ని కాపాడగలవు. కొన్ని పాలకవర్గ శక్తులు కరోనా వైరస్ గురించి అనేక మూఢనమ్మకాలను వ్యాప్తి చేస్తున్న పరిస్థితుల్లో, మన సాహసోపేతమైన, త్యాగపూరితమైన వైద్య చరిత్ర నుంచి పాఠం నేర్చుకోవాలి. మన వైద్య చరిత్రలో త్యాగానికి, బాధను భరించడానికి సంబంధించి డాక్టర్ యశ్వంత్‌రావు ఉత్తమ ఉదాహరణగా నిలబడతారు.

మానవాళిపై కొత్తగా విరుచుకుపడుతున్న కరోనా సాంక్రమిక వ్యాధికి గోమూత్రం, గోవు పేడ టీకా మందుగా ఉపయోగపడతాయని కొన్ని శక్తులు ప్రచారం చేస్తున్నాయి. వీరు అలా నమ్ముతున్నట్లయితే నిక్షేపంగా వాటిని సేవించి నిజమైన క్షేత్రరంగంలో కోవిడ్–19 వైరస్ బారినపడిన వారికి సేవ చేసేందుకు ముందుకు ఉరకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ప్రజలు మాత్రం పరీక్షకు నిలబడి.. నిరూపితమైన సైన్సు, మందులు, ప్రయోగశాలలు, డాక్టర్లు, నర్సులపై మాత్రమే ఆధారపడాలి. భారత్ ఇప్పుడు 130 కోట్లమంది ప్రజలున్న దేశం. భారత ప్రజారాశుల్లో చాలామంది తరతరాలుగా తమను వెంటాడుతున్న నిరక్షరాస్యత, అలక్ష్యంతో కూడిన వారసత్వానికి లోబడిపోయి మూఢనమ్మకాలను ఇప్పటికీ నమ్ముతున్నారు. ఇప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం, ముక్కును కవర్ చేసుకోవడం, నోటిని తాకకుండా ఉండటం వంటి సంరక్షణ పద్ధతుల గురించి మీడియా, మొబైల్ నెట్‌వర్క్ ప్రజలకు సమాచారం అందిస్తున్నాయి.

అయినప్పటికీ కులతత్వం, అనాగరికత్వం మన నైతిక జీవనానికి మరింత నష్టం కలిగిస్తున్నాయి. సైన్స్, మందులపై విశ్వాసం ఉంచుతున్న కేరళ ప్రభుత్వం కోవిడ్–19 సాంక్రమిక వ్యాధితో ఉత్తమంగా పోరాడుతోందని ప్రధాని నరేంద్రమోదీ సైతం ఆమోదించారు. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇప్పుడు తమతమ ప్రాంతాల్లో వైరస్ అంత విస్తృతంగా వ్యాప్తిలో లేనప్పటికీ తగిన సన్నాహక చర్యలను తప్పకుండా చేపట్టాలి. కరోనా వైరస్ నిరోధక పోరాటంలో తమ ప్రాణాలను పణంగా పెడుతున్న నర్సులకు, డాక్టర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు, మెరుగైన పనిపరిస్థితులను అందచేయాలి. గ్రామస్థాయిలో వైద్యపరమైన వసతిసౌకర్యాలను నెలకొల్పడానికి భారతదేశం మరింత డబ్బును ఖర్చు చేయాలి, మరింతగా వైద్య, పారా మెడికల్ సిబ్బందికి ఉద్యోగాలు కల్పించాలి. ఈ అంశంలో మనం చైనానుంచి తప్పక నేర్చుకోవాలి. ఎందుకంటే ప్రపంచంలో మొట్టమొదటగా చైనాలోనే కరోనా వైరస్ పుట్టినప్పటికీ సైన్స్, మెడిసిన్‌పై అపార విశ్వాసం ఉంచినందుకే ఆ దేశం తక్కువ నష్టాలతో బయటపడటమే కాకుండా వైరస్‌ను పూర్తిగా అరికట్టింది కూడా.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### మహమ్మారి



"ఈ మహమ్మారి చైనా నుంచి వ్యాపించినందున దాన్ని చైనీస్ వైరస్ అని పిలవడం తప్పేమీ కాదు. అయితే, చైనా ఈ పని ఉద్దేశపూర్వకంగా చేసిందంటే నేను ఒప్పుకోను. వాళ్లే చేసి ఉంటే బయటపడగానే దాన్ని అణచివేసి ఊరుకునేవారు. సకాలంలో అందరినీ హెచ్చరించేవారు కాదు"

– హర్ష్‌గుప్తా, వ్యాపారవేత్త

### మూర్ఖత్వం



"భారతదేశపు అతి పెద్ద సమస్య నిరక్షరాస్యత కాదు, చదువుకున్నవారి మూర్ఖత్వమే అని కరోనా నిరూపించింది"

– అమిత్ టాండన్, సింగర్

### నేరం



"గాయని కనికా కపూర్‌కు కోవిడ్–19 పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. ఆమె ఆదివారం బ్రిటన్ నుంచి తిరిగి వచ్చింది. కానీ, తన పర్యటన వివరాలను అధికారుల దగ్గర దాచిపెట్టింది. తిరిగి వచ్చాక ఒక స్టార్ హోటల్‌లో ఉండటమే కాకుండా వంద మందికి పైగా హాజరైన పార్టీలో పాల్గొంది. ఇది ఎంత నేరపూరితమైన ప్రవర్తన!"

– పాలోమీ సహా, జర్నలిస్ట్

### లాక్‌డౌన్



"కాలిఫోర్నియా మొత్తం నిర్బంధంలోకి వెళ్లడం చాలా షాక్‌కు గురిచేసింది. హాలీవుడ్ సినిమా దర్శకులు సైతం ఇటువంటి కథాంశాన్ని ఊహిస్తారని నేను అనుకోవడం లేదు. కంటాజియన్ సినిమా దాదాపు ఇలాగే ఉన్నా ఇటువంటి నిర్బంధాన్ని ఊహించలేదు. వాస్తవం కల్పన కంటే నిజంగా బలమైనది"

– రామ్‌గోపాల్ వర్మ, దర్శకుడు

### వినతి



"ఒక డాక్టర్‌గా మీ అందరికీ నాది ఒకటే విన్నపం. మీరు మా కోసం ప్లేట్లు చప్పుడు చేయడమో, చప్పట్లు కొట్టడమో లేదంటే మమ్మల్ని పొగడటమో చేయనవసరం లేదు. కేవలం మాపై దాడులను నిలిపివేయండి. మెడికల్ సైన్స్ పరిమితులను దయచేసి అర్థం చేసుకోండి. సాటి పౌరులు బాసటగా నిలిస్తే భారతీయ వైద్యులు అద్భుతాలు చేయగలరు"

– హర్జిత్ సింగ్ భట్టి, వైద్యుడు

### సంతోషం



"ప్రధాని ప్రసంగంలో రాజనీతిజ్ఞత ఉందనీ, జనతా కర్ఫ్యూ ఆలోచన అభినందించదగినదనీ, కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి అందరూ చేతులు కలపాలంటూ ఇండియా టీవీ ఎడిటర్ రజత్ శర్మలాంటి సీనియర్ జర్నలిస్టులు ముందుకు రావడం సంతోషం. కోవిడ్–19పై పోరాటంలో సరైన సమాచారాన్ని అందివ్వడం కీలకం"

– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

### అపోహ



"కోవిడ్–19 చుట్టూ అపోహలు సృష్టించకపోవడం చాలా ముఖ్యం. ఇదొక భయంకరమైన అంటు రోగం. ఎవరికైనా అది సోకే అవకాశం ఉంది. అపోహలు ఏర్పడితే తప్పుడు సమాచారం అందించడం, సహకరించకపోవడం జరుగుతుంది. ఈ పోరాటంలో గెలిచేలోగా అది మనందరినీ తీసుకుపోతుంది"

– పినరయ్ విజయన్, కేరళ సీఎం

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.ద్వాదశి ఉ.8.44 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం ధనిష్ఠ రా.8.14 వరకు, తదుపరి శతభిషం వర్జ్యం తె.3.57 నుంచి 5.44 వరకు (తెల్లవారితే ఆదివారం) దుర్ముహూర్తం ఉ.6.08 నుంచి 7.44 వరకు అమృతఘడియలు... ఉ.9.04 నుంచి 10.33 వరకు.

**సూర్యోదయం :** 6.08
**సూర్యాస్తమయం:** 6.07
**రాహుకాలం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుంచి 3.00 వరకు

# పరిశుభ్రతే పరమధర్మం



శ్రీరమణ

ఒక ఉలికిపాటు. ఒక విపత్తు. ఎప్పుడూ లేదు. ఒకప్పుడు ఇలాంటి ఎదురుచూడని వైపరీత్యాలు జరిగి ఉండచ్చు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. కేవలం కొన్ని సెకండ్ల వ్యవధిలో సమాచారాన్ని విశ్వమంతా చేరవేయగల సాంకేతిక పరిజ్ఞానం మనిషి వేళ్ల కొసమీద ఉంది. కొద్ది గంటల్లో నేలమీద ఏ మూల నుంచి ఏ మూలకైనా చేరగల సౌకర్య సామర్థ్యాలను మనిషి సాధించాడు. అదే ఇప్పుడు ఈ పెనుముప్పుకి దోహదమైంది. కరోనా అంటువ్యాధి విమానాలెక్కి సముద్రాలు దాటి ఖండాంతరాలను వచ్చి చేరింది.

నూతన సంవత్సరం 2020 ఈ విపత్తులో ప్రారంభం కావడం మొత్తం మానవాళిని అల్లకల్లోలం చేస్తోంది. ఇంతవరకు కరోనా నైజం ఎవరికీ అంతుబట్టలేదు. శాస్త్రవేత్తలు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతానికి తెలిసిందేమంటే వ్యక్తిగత మరియు సమష్టి పరిశుభ్రత మాత్రమే దీనికి విరుగుడుగా నిర్ధారించారు. వయసుమళ్లినవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు. మాటిమాటికీ చేతులు శుభ్రం చేసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

పరిశుభ్రతలోనే పరమేశ్వరుడున్నాడని అనాదిగా మనం విశ్వసిస్తున్నాం. పాటిస్తున్నాం. రోజూ కనీసం మూడుసార్లు నదీ స్నానం, దైవ ధ్యానం,

అక్షర తూణీరం




అగ్నిహోత్ర ఆరాధన లాంటి నియమాలను మన ఋషులు శాస్త్రోక్తంగా ఆచరించి మరీ ఉద్బోధించారు. రోజులు మారాయి. ఎవరికీ తీరిక ఓపికలు లేవు. రోజూ ఒక స్నానానికి కూడా వ్యవధి లేదు. ప్రపంచీకరణ తర్వాత అవకాశమున్న అన్ని వెసులు బాట్లని మనం దినచర్యలోకి అలవాటుగా తెచ్చు కుని, అదే నాగరికత అనుకుంటున్నాం. ఒకనాటి ముతక ఖద్దరు వస్త్రాలు, వాటిని రోజూ ఉతికి ఆరేసి ధరించడం అనాగరికం అయింది. ఇప్పుడు మనం ధరించే చాలా రకాల దుస్తులు ఉతికే పనిలేదు. ఒంటిమీదే పుట్టి ఒంటిమీదే చిరిగిపోతాయ్. ఇంటికి ఎలాంటి పరాయి మనిషి వచ్చినా, అతిథి వచ్చినా కాళ్లకి నీళ్లివ్వడం మన ఆచారం. అదిప్పుడు అనాచారం. మరీ పసిపిల్లలున్న ఇళ్లలోకి ఈ శుభ్రత పాటించకుండా ఎవరూ గడపలోకి అడుగుపెట్టేవారు కాదు. మళ్లీ ఇన్నాళ్లకి ఆచారాలు గుర్తుకొస్తున్నాయ్.

స్వచ్ఛభారత్ ఒక శుభారంభం. కానీ మన ప్రజల ఉదాసీనత, తరాలుగా ఉన్న అశ్రద్ధ, అవగాహనా రాహిత్యంతో ఆ ఉద్యమం చేరాల్సిన స్థాయికి చేరలేదు. మన రైలు బోగీలు, మన ప్రయాణికుల బస్సులు, ఆయా స్టేషన్లు ఇన్నాళ్లూ శానిటైజేషన్‌ని చూడలేదు. ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన అవన్నీ నడుస్తున్నాయి. మనకి చెత్త చెదారం ఇంకా చిమ్మేసినవన్నీ తీసి గోడవతల వెయ్యడం మనకో అలవాటు. మనకి సూర్యుడు రక్షాకరుడు. రోజులో పది నించి పన్నెండు గంటలు రకరకాల కిరణాలను భూమికి పంపుతూ అనేకానేక సూక్ష్మజీవుల్ని నాశనం చేస్తున్నాడు. సూర్యుడు ప్రత్యక్ష నారాయణుడుగా పూజలందుకుంటున్నాడు. సూర్యభగవానుడు నిజానికి మన జెండా మీద ఉండాలి. మనకి చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అలవాటే. కరోనాకి అవగాహనే ప్రస్తుతానికి మందు. ప్రపంచ దేశాలన్నీ ముందు జాగ్రత్తకీ, తర్వాత వైద్యానికి మందుల పరిశోధనతో తలమునకలవుతున్నాయ్. త్వరలోనే పరిష్కారం వస్తుందన్నది నిస్సంశయం.

ప్రధాని మోదీ జాతికి సందేశమిస్తూ, రేపు వచ్చే ఆదివారం ఐచ్ఛికంగా దేశమంతా కర్ఫ్యూ పాటించాలని చెప్పారు. పన్నెండు గంటలు నిరోధిస్తే వైరస్ చనిపోతుందని కూడా చెప్పారు. ఈ చిన్న అభ్యర్థనని అందరం పాటిద్దాం. నిర్మానుష్యమైన చారిత్రక ప్రదేశాల్లో అరుదైన ఫొటోలు తీద్దామని, సెల్ఫీలు దిగుదామని కూడా బయటకు రావద్దు. ఇలాంటి ప్రయత్నాలని ఎవరూ హర్షించరు. అది గర్వకారణం కూడా కాదు. దేశభక్తి, సమాజ భక్తి ఉంటే అంతా తలా పది మందికి చెప్పి, నచ్చజెప్పి కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు యథాశక్తి దోహదపడండి. సర్వే జనా సుఖినోభవంతు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# కరస్పర్శ కరువైన వేళ...!

సందర్భం



జూలూరు గౌరీశంకర్

ఇది యుద్ధమే. ఆయుధాలు లేని యుద్ధం. భయాన్ని భయపెట్టి, ధైర్యాన్ని గురి పెట్టాలి. కాలం ఎన్ని కల్లోలాలను కనలేదు చెప్పు. ఎన్నెన్ని గత్తర్లకు కత్తెరెయ్య లేదు చెప్పు... ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్న సమయంలో వాటిని తొలగించి ధైర్యం చెప్పి నిలపవలసిన బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఇతరులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు ఆదుకోవలసిన మానవతా బాధ్యతను కూడా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంది. వ్యక్తులు కాకుండా మొత్తం సమాజమే ప్రమాదంలో పడ్డప్పుడు ప్రతి ఒక్కరూ ఆపదలను జయించటానికి సిద్ధం కావాలి. అందుకోసం ప్రజలను సన్నద్ధం చేసే పనిని చేస్తూ ప్రజలను ఆపదల నుంచి దరిచేర్చేందుకు కేసీఆర్ పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. కరోనా దూసుకొస్తున్న ఈ ప్రమాద ఘంటికల్లో మానవత్వానికి ప్రమాదం వచ్చింది. ఈ సందర్భంలో సీఎం చేస్తున్న పని గొప్పది.

ఇలాంటి సంకటస్థితిలో మనిషిని మనిషి ద్వేషించే స్థితినుంచి మానవీయ దృక్పథాన్ని ప్రతిష్ఠించవలసిన సందర్భం ముఖ్యమైనది. శుభ్రతా పరిశుభ్రతలను ఖడ్గాయుధాలను చేసుకుని, ఈ తాజా గత్తరకు ఘోరీ కట్టాలి. శ్వాసకు ధైర్యకవచాలను ధరింపచేయాలి. కనిపించని శత్రువుపై చేస్తున్న సామూహిక యుద్ధం సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ పరిస్థితులను సమీక్షించుకుంటూ స్వీయ ఆరోగ్య పరిరక్షణా చర్యలు అవసరమని ప్రజలకు పిలుపునిచ్చారు. కరోనాను ఎదుర్కొనేందుకు కఠినచర్యలు తీసుకుంటూనే ప్రజలను అప్రమత్తంగా ఉంచుతూ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విమానాశ్రయాలనుంచి వస్తున్న వారిని విమానాశ్రయాల దగ్గరే పరీక్షలు నిర్వహించి ఈ నేల మీదకు కరోనాను విస్తరించకుండా చేసేందుకు మొత్తం అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు.

శ్వాసనాళాల దగ్గరే, పరిశుభ్ర నాలాల దగ్గరే దాన్ని మట్టుబెట్టాలి. దాన్ని పసికడితే చాలు, ఈ ప్రపంచం పొలిమేరలు దాటించవచ్చు. అప్రమత్తతే ఆయుధం. కడిగేయటమే పరిష్కారం. కరచాలనమే ఖడ్గ చాలనం. ప్రణామమే ఖడ్గ ప్రవాహం. పల్లె పట్టణ ప్రగతులే విషప్రాణిని చుట్టుముట్టే పద్మవ్యూహాలు. మన ఉష్ణమండల కాసారాలతో, నిప్పుకణికల ఎండలతో, శత్రువును నిలువరిద్దాం పద.

ఇది ఆయుధాలులేని మహాయుద్ధం. మనిషి ఉనికినే అంతం చేసి ప్రశ్నార్థకం చేస్తున్న కరోనావైరస్ మహమ్మారిని ఈ ప్రపంచ పొలిమేరల దాకా తన్ని తరిమేయటానికి మనందరం కలిసి రెండు చేతులూ శుభ్రంగా కడుక్కుందాం. మన దృష్టిని మరల్చుకోకుండా లక్ష్యాన్ని ముక్కుతో నలుపుకోకుండా ధైర్యాన్ని గురిపెట్టిన బాణం చేసి వదలాలి. మన చేతుల్ని కడుక్కుని యుద్ధంపై పరిశుద్ధ యుద్ధం చేయాలి. పల్లె, పట్టణ ప్రగతుల శుభ్రతతోనే రూపం లేని విపత్తును తరిమితరిమి కొట్టాలి. తిరగబడ్డ నేలకు పాఠాలక్కర్లేదు. శుభ్రం చేసిన చేతులే, పరిశుభ్ర పరిసరాలే శత్రుసంహారాలు. శత్రువు చావుబతుకులు మన చేతుల్లోనే భద్రంగా ఉన్నాయి. చేతులు కడిగి చప్పట్లు కొట్టి ఈ 3వ ప్రపంచయుద్ధాన్ని ప్రపంచం ఆమడల దాకా తరిమికొడదాం. పదండి ముందుకు. విరుగుడు లేనిది ఈ ప్రపంచంలో లేదు. మనందరి కట్టుదిట్టమైన కార్యాచరణే మహమ్మారి వైరస్‌కు విరుగుడు. శత్రు చొరబాటును మనకు మనమే గస్తీలు కట్టి కట్టడి చేద్దాం. మనకు మనమే విరుగుడు. దుఃఖ నదులకు ఆనకట్ట అప్రమత్త రెప్పలతోనే కట్టాలి. ఇది ఓ కవి పద్యంతో చేసే వైద్యం. కానరాని శత్రువుపై యుద్ధాన్ని ఆరోగ్య ప్రపంచంతోనే ఢీ కొట్టాలి.

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా జాడ ఇప్పటికి అంతగా లేకపోయినప్పటికినీ అక్కడి ప్రభుత్వం కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. కరోనా ప్రదర్శిస్తున్న కర్కశత్వానికి ప్రజలు, పాలకులు జాగరూకతతో ఉండటమే సరైన సమాధానం. బహిరంగ ప్రదేశాలకు వెళ్లొద్దని, సామాజిక దూరాన్ని పాటించాలని ప్రచారప్రసార మాధ్యమాలు, విస్తృతంగా ప్రచారం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన సెలవులను ఆసరా చేసుకుని బయటతిరిగితే కరోనాను కట్టడి చేయటానికి ఆటంకాలు ఏర్పడతాయి. సెలవులు ఇచ్చింది బైట తిరగటానికి, అనవసర ప్రయాణాలు చేయటానికి కాదు. వ్యాధి నివారణకంటే వ్యాధి నిరోధక చర్యలు ముఖ్యం.

మాట్లాడని మాస్కే మందుపాతర. శుద్ధమైన చేయే తిరుగులేని అస్త్రం. శత్రువా నిన్నెట్లా నివారించాలో తెలుసు. చేతులు కడిగి నీకు నీళ్లొదులుతాం. పద్యం కూడా వైద్యమే. ఇది మూడవ ప్రపంచ యుద్ధం. చేయీ చేయీ కడిగి దీన్ని ఓడిద్దాం.

వ్యాసకర్త ప్రముఖ కవి, సామాజిక విశ్లేషకులు
మొబైల్ : 94401 69896

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899


పద్మప్రియ

**మనిషి డిజేబుల్డ్ అయినా పర్లేదు.. జీవితం డిజేబుల్డ్ కాకూడదు! సమస్యలు శక్తిని పెంచాలే తప్ప.. ప్రయాణాన్ని ఆపేలా చేయకూడదు! బతుకుబండి పాస్, ఫెయిల్యూర్‌లతో కాదు.. మనోధైర్యం, ఆత్మవిశ్వాసంతో నడవాలి చివరిశ్వాస వరకూ ఆస్వాదించాలి.. ఇది పద్మప్రియ నమ్మి, ఆచరిస్తున్న బాట!! ఆమె.. గాయని.. థియేటర్ ఆర్టిస్ట్.. జీవితం విసిరిన ప్రతి సవాలుకు జవాబు ఇస్తూ ముందుకు వెళ్తున్న ఫిజికల్లీ చాలెంజ్డ్ విజేత...**

# ప్రియమైన గెలుపు

‘నా పేరు పద్మప్రియ. చూస్తున్నారుగా నన్ను? చక్రాల కుర్చీలేందే కదల్లేను. అయినా మిమ్మల్ని కలుసుకోవాలి.. మీతో మాట్లాడాలి అన్న ఆశ.. ఆ ఇబ్బందులన్నిటినీ అధిగమించేలా చేసి ఇదిగో ఇలా మీ దగ్గరకు చేర్చింది. నాతో ఉన్న ఈ ఇరవై మందీ నా లాంటివాళ్లే. ఒకరు వినలేరు.. మరొకరు మాట్లాడలేరు.. ఇంకొకరు చూడలేరు.. కండరాలు బిగుసుకుపోయి ఒకరు.. అవయవాలన్నీ అచేతనమై మరొకరు.. ఒక్కోరిదీ ఒక్కో సమస్య. అయినా మేం ఎక్కడా ఆగలేదు. ఆత్మహత్య అన్న ఆలోచనే చేయలేదు. ఇదేం బతుకురా దేవుడా అని మా మీద మేం జాలి పడలేదు. ప్రతిరోజూ కొత్త ఉదయాన్ని చూస్తామన్న నమ్మకంతో నిద్రపోతాం. కనిపించిన ఉదయాన్ని కొత్తగా మార్చుకునే ధైర్యంతో నడుస్తాం. అలాగని మాకంతా హాయిగా సాగిపోతోందని అనుకోకండి. మాలో చాలామంది బాల్యం వెక్కిరింతలు, అవహేళనలు, చీదరింపులు, చీత్కారాలతోనే గడిచిపోయింది. వాటినుంచే బలాన్ని తెచ్చుకున్నాం. పోరాటానికి ఆయుధంగా మలచుకున్నాం.. ఈ రోజు మా జీవన పాఠాన్ని మీకు చెప్పి.. మీలో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపే స్థాయికి వచ్చాం. గెలుపు అంటే మార్కులు, పరీక్షలో పాస్ అవడం కాదు. గెలుపు అంటే జీవితాన్ని ఆస్వాదించడం. మంచి అయినా.. చెడు అయినా చివరిశ్వాస వరకూ జీవించాలి. భయం ఒక అపోహ..’ కాలేజీ పిల్లలకు చెప్పుకుపోతోంది పద్మప్రియ. ఆమెతో పాటు ఉన్న మరో 20 మంది ఫిజికల్లీ చాలెంజ్డ్ కళాకారులూ తమ జీవితంలోని సవాళ్లను చెప్పుకొచ్చారు.

కిందటేడు.. సాంకేతిక పొరపాటు వల్ల ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయి. దాంతో కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ‘అరే.. ఇంత చిన్న విషయానికే ఆత్మహత్యలా? రేప్పొద్దున జీవితంలో ఇంకెన్ని చూడాలి? మానసికంగా ఎంత బలంగా ఉండాలీ పిల్లలు?’అని కలత చెందింది.. చలించిపోయింది పద్మప్రియ. ఆ పిల్లల్లో ఆత్మబలం కలిగించడానికి తనలా ఫిజికల్లీ చాలెంజ్డ్ కళాకారుల జాబితా ఒకటి తయారు చేశారు ఆమె. తను చేయబోయే పని గురించి వాళ్లకు చెప్పారు. ఆసక్తి, సమయమూ ఉన్న 20 మంది కళాకారులు కూడారు. పద్మప్రియ నాయకత్వంలో తెలంగాణలోని పది జిల్లాల్లోని ప్రతి కళాశాలకు వెళ్లి తమ జీవిత గాథలతో విద్యార్థులను మోటివేట్ చేశారు. తాము పడ్డ అవమానాలు, పొందిన ఆనందాన్ని పంచుకుంటూనే స్కిట్స్, పాటలు, డ్యాన్స్‌తో పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని కలిగించే ప్రయత్నం చేసి ఫలితం సాధించారు.


పద్మప్రియ

**నేపథ్యం..**

పుట్టిపెరిగిందంతా ఖమ్మంలోనే. తల్లి కుసుమ గృహిణి. తండ్రి సత్యం.. ప్రైవేట్ ఉద్యోగి (ఇప్పుడు లేరు). పద్మప్రియకు ఇద్దరు తోబుట్టువులు.. ఒక అక్క, తమ్ముడు. చిన్నప్పుడే పద్మకు పోలియో సోకింది. ఆరేళ్లున్నప్పుడు తల్లిదండ్రులు ఆమెను ఖమ్మంలోనే సెయింట్ మేరీ పోలియో రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించారు. ప్రతి ఎండాకాలం ఒక ఆపరేషన్ చొప్పున పదహారేళ్లొచ్చేప్పటికి ఎనిమిది ఆపరేషన్లతో కూర్చొని.. చంక కర్రల సహాయంతో నడవగలిగే దశకు చేరింది పద్మ.

**పాటలకు గమకాలు నేర్చుకుందక్కడే..**

‘కాళ్ల మీద నిలబడ్డమే కాదు జీవితంలో నిలబడ్డం నేర్చుకుందీ ఆ క్రిస్టియన్ మిషనరీలోనే. నా తొలి గురువు క్లారా హీటెన్. కథలు, పాటలు నేర్పి, నాలో పాడేకళకు మెరుగులు దిద్దింది ఆవిడే. నాటకాలు, చిన్న చిన్న స్కిట్స్ వేస్తూ నటనలోనూ అక్కడే తర్ఫీదు పొందింది ఆమె. జిల్లా, రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో పాల్గొనడం, ప్రైజ్‌తో హాస్టల్‌కు రావడం సర్వసాధారణంగా ఉండేదామెకు.

**కృష్ణుడు .. పాండురంగడూ**

ఖమ్మంలోనే డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానంలో పీజీ డిప్లమా పూర్తిచేసి ..పాటలతో ఫ్యూచర్‌ను నిర్మించుకోవాలనుకొని హైదరాబాద్ చేరింది. ‘మాయాబజార్ (దాసరి దర్శకత్వంలో)’ అనే సినిమా కోసం వంశీ ఇంటర్నేషనల్ నిర్వహించిన పాటల పోటీల్లో పాల్గొంది. పోటీ జరగలేదు.. కాని పాటలు పాడే ప్రోగ్రామ్ జరిగింది శివరాత్రి నాడు కావడంతో భక్తిపాటలను ఆలపించింది పద్మ. ఆమె గాత్రాన్ని మెచ్చిన వంశీ రామరాజు తన ‘వేగేశ్న’ ఫౌండేషన్‌లో ఉద్యోగమివ్వడమేగాక సంగీతం లో శిక్షణ నిచ్చే బాధ్యతనూ తీసుకున్నారు. కొలువు చేసుకుంటూనే కర్ణాటక, లలిత సంగీతంలో శిక్షణపొందింది. పద్యగానంలో స్పెషలైజేషన్ చేసింది. మరోవైపు సినిమా ఫంక్షన్స్‌లో పాటలు, నాటకాలతో పాపులర్ అయిపోయింది. ఆ తర్వాత వంశీ రామరాజు తన వేగేశ్నలోని ఫిజికల్లీ చాలెంజ్డ్ కళాకారులతో దేశమంతా తిరిగి పౌరాణిక నాటకాలు వేయించారు. అందులో కృష్ణుడిగా, పాండురంగడుగా, సత్యభామగా వేసిన పద్మప్రియకూ మంచి గుర్తింపు వచ్చింది. ఈ మూడు పాత్రలతోపాటు వెంకటేశ్వరస్వామి పాత్రతో సహా పురుష పాత్రలకు పెట్టింది పేరుగా మారింది పద్మప్రియ.

**పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిజేబుల్డ్..**

‘నీ జీవితం ఎంతోమందికి ఇన్‌స్పిరేషన్ కావాలి అంటే నువ్వో సంస్థగానూ మారాలి. నీలాంటి పదిమందికి మార్గం చూపించాలి’ అని తొలి గురువు క్లారా, మలి గురువు వంశీ విజయ రామరాజు చెవినిల్లు కట్టుకొని మరీ పోరారు. దాంతో 1999లో పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిజేబుల్డ్ సంస్థను పెట్టింది. 2001లో వేగేశ్న నుంచి బయటకు వచ్చి.. మొత్తం తన సంస్థ మీదే దృష్టి పెట్టింది. ఫిజికల్లీ చాలెంజ్డ్ వాళ్ల కోసం టైలరింగ్, కంప్యూటర్ విద్యతోపాటు సంగీత, నాటకాల్లోనూ శిక్షణ ప్రారంభించింది. ఆసక్తి ఉండి అవకాశాల్లేని ఫిజికల్లీ చాలెంజ్డ్ కళాకారులకు తమ సంస్థ తరపున అవకాశాలూ కల్పిస్తూ ఉపాధి నిచ్చే ప్రయత్నమూ చేస్తోంది విజయవంతంగా. స్టేజ్‌షోస్‌తోపాటు టెలివిజన్‌లోనూ రాణిస్తోంది.

**విశిష్టప్రతిభా పురస్కారం..**

పద్యగానంలో పద్మప్రియను మించినవారు లేరనే కితాబు తెచ్చుకుంది. అందుకే పద్యగానం ప్రాంతీయ కళే అయినా తన ప్రతిభతో ప్రపంచానికి పరిచయం చేసిన తీరుకి ముగ్ధులై 2009లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ‘విశిష్ఠ ప్రతిభా పురస్కారం’తో పద్మప్రియను సత్కరించారు. ఆసియా ఖండంలోనే పద్యనాటకం వేసిన తొలిమహిళగా గుర్తింపునిచ్చారు. యేటికి ఎదురీది నిలబడ్డమే జీవితం అని చాటిన ఆమె శక్తికి 2010లో ‘స్త్రీ శక్తి పురస్కార’మూ తలవంచి ఆమెను వరించింది. ఇంకెన్నో తెలంగాణ రాష్ట్రప్రభుత్వ అవార్డులూ వచ్చాయి. సెన్సార్‌బోర్డ్ సభ్యురాలిగానూ పనిచేసింది. కళాసేవే కాదు.. సామాజిక సేవలోనూ ముందుంది పద్మ. పిడబ్ల్యూడీ యాక్ట్‌కి సంబంధించి తెలంగాణ అడ్వయిజరీ బోర్డ్‌లో సభ్యురాలిగా ఉన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధికి సంబంధించి ఫిజికల్లీ చాలెంజ్డ్ పర్సన్స్ హక్కుల కోసమూ పోరాటం చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

– సరస్వతి రమ



**ఈరోజు సినిమా యాక్టర్స్‌కి ఎంత క్రేజ్ ఉందో పద్యగాన నాటకాలు వేసే మాకూ అంతే ఉంది. ఈ కళను సామాజిక సమస్యలను ఎత్తిచూపడానికి మాధ్యమంగా వాడుకోవాలనుకుంటున్నాం. రైతు ఆత్మహత్యలు, ఆడవాళ్ల మీద పెరుగుతున్న హింసను అరికట్టేందుకు ఈ కళతో మా వంతు కృషిచేస్తాం. నేను చెప్పేది ఒకటే.. అన్నీ అనుకున్నట్టు జరగవు. ఏం జరిగినా బతకడం ఆపొద్దు. తెలంగాణ పాత పది జిల్లాల్లో పిల్లలను మోటివేట్ చేసినట్టుగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ చేయాలనుకుంటున్నాం. తెలంగాణలోనూ కొనసాగించాలనుకుంటున్నాం’ అంటుంది పద్మప్రియ.**

కరోనా కథలు - 4

## ‘ఆట’విడుపు

కరోనా భయం... కరోనా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు... కరోనాను నిలువరించే ప్రయత్నాలు... కరోనాకు వైద్య మార్గాల అన్వేషణ... మొత్తానికి స్కూళ్లు బంద్, సినిమా థియేటర్‌లు బంద్, షాపింగ్ మాల్స్ బంద్. ఇవన్నీ ప్రభుత్వం చేస్తున్న బంద్‌లు. వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ ఆఫీస్‌లు కూడా తలుపులు బిడాయించుకుంటున్నాయి. ప్రయాణాలను జనం ఎవరికి వారే స్వచ్ఛందంగా బంద్ చేసుకున్నారు. నిర్విరామంగా పని చేస్తున్నదల్లా ఒక్క దవాఖానాలే. తలుపులు తెరుచుకుని ఉంటున్నవి ఇళ్లు కూడా. ఇంట్లో పిల్లలు స్కూళ్లకు, పెద్దవాళ్లు ఆఫీసులకు వెళ్లి తొమ్మిదింటికంతా మూసుకునే తలుపులు ఇప్పుడు రోజంతా బార్లా తెరుచుకునే ఉంటున్నాయి. పిల్లల కేరింతలతో కళకళలాడుతున్నాయి ఇళ్లు. వేసవి సెలవులు ముందుగా వచ్చినట్లు పిల్లలు సంతోషంగా గెంతులేస్తుంటారు. ఈ పిడుగుల అల్లరిని భరించడం ఎలాగ భగవంతుడా అని తల్లులూ తండ్రులూ, నానమ్మ–తాతల గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తుంటాయి. పిల్లల్ని రోజంతా ఎంగేజ్ చేయడమెలాగో తెలియక ఆందోళన పడుతున్నారు. నిజానికి పిల్లల పేరెంట్స్‌కి ఇప్పుడు అసలైన ఆటవిడుపు. ఆటలాడుకోవడానికి తగినంత విరామం. బిజీ లైఫ్‌లో ఉద్యోగాలు, డెడ్‌లైన్‌లతో పోటీ పడుతూ పిల్లలతో క్వాలిటీ టైమ్ గడపలేక పోయామే అనే బెంగ ఉద్యోగం చేసే పేరెంట్స్‌లో ఏదో ఒక మూల ఉండే ఉంటుంది. ఈ కరోనా సెలవులు ఆ బెంగ తీర్చేస్తాయి.



**ఆటల్ని అటకదించండి**

గడచిన వేసవిలో పిల్లల కోసం కొన్న బోర్డు గేమ్‌లు ఉండే ఉంటాయి. స్కూళ్లు తెరిచిన వెంటనే అటకెక్కిన ఆ బోర్డు గేమ్‌లను అటక దించితే చాలు. చైనీస్ చక్కర్స్, చెస్, క్యారమ్ బోర్డు, పరమపద సోపాన పటం, వామనగుంటలు, బారాహ్‌గట్టా, ట్రేడ్, పిన్ బోర్డ్, బిల్డింగ్ బ్లాక్స్... ఇంకా ఎన్ని ఆటలున్నాయో! షెల్ఫుల్లో దాగిన అన్నింటినీ బయటకు తీసి ఒకసారి శానిటైజర్‌తో తుడిచి వాటిని ఆటకు సిద్ధం చేయండి. ఎలాగూ రెస్టారెంట్‌లకు వెళ్లే ధైర్యం కూడా ఎవరూ చేయడం లేదు. కాబట్టి ఇంట్లో ఆరోగ్యకరంగా, రుచిగా వండుకుని ఇంటి భోజనాన్ని ఎంజాయ్ చేస్తూ ఇంటిల్లిపాదీ కలిసి ఆడుకోవచ్చు.

చెట్టు నీడ

## ఊరంతా మొక్కారు

అదొక పల్లెటూరు. ఆ సంవత్సరం ఆ వూళ్ళో వర్షాలు పడక అనావృష్టి ఏర్పడి కరవు కాటకాలు సంభవించాయి. ఆ గ్రామశివారులో ఒక పెద్ద రాతికొండ ఉంది. ఆ కొండకి కుండలతో నీళ్లు తీసుకువెళ్లి అభిషేకం చేస్తే వర్షాలు పడతాయని గ్రామస్తుల నమ్మకం.

ఆ గ్రామపెద్ద రచ్చబండ దగ్గర గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఇంటికో కుండనీరు చొప్పున ఆ రాతికొండకి జలాభిషేకం చేయాలని చెప్పాడు.

ఆ గ్రామపెద్ద అభిప్రాయంతో అందరూ ఏకీభవించి మరునాడే జలాభిషేకం చేయాలని నిర్ణయించుకున్నారు.

ఆ మర్నాడు అందరూ తప్పెట్లు తాళాలతో నెత్తిన నీటికుండలతో బయలుదేరారు.

దారిలో వారికి ఒక బాలుడు కొన్ని మొక్కలను పాతుతూ వాటికి నీళ్ళు పోస్తూ కనిపించాడు. గ్రామపెద్ద ఆ బాలుడిని సమీపించి–

‘నాయనా మనవూరి ప్రజలంతా నీటి చుక్కకోసం అల్లాడిపోతుంటే నువ్విలా నీటిని వృథా చేయవచ్చా?‘అని ప్రశ్నించాడు.

అందుకు ఆ బాలుడు –‘ఊరంతా పచ్చటి చెట్లు ఉంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, నీటి కరువుండదని బడిలో మా ఉపాధ్యాయులు చెప్పారు. అందుకే ముందుగా విత్తనాలు నాటి, అవి మొలకెత్తి కొంచెం ఎదిగాక వాటిని తీసి దూర దూరంగా నాటి అవి బతకడానికి రోజూ నీరు పోస్తున్నాను. ఇక ఇవి పెద్దయితే మనకు ఈ కరువు కాటకాలుండవు కదండీ’’ అని జవాబిచ్చాడు.



ఆ బాలుడి సమాధానానికి ముచ్చటపడ్డ ఆ గ్రామపెద్ద అందరినీ పిలిచి మొక్కలు నాటమని చెప్పాడు. అందరూ అంగీకార సూచకంగా తలలూపారు.

– లోగిస లక్ష్మీనాయుడు

బ్యూటిప్

**మొటిమలు తగ్గాలంటే..**

జాజికాయను పొడి చేసి, అందులో పచ్చి పాలు కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని మొటిమలు, మచ్చలు ఉన్నచోట రాయాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. అలా తరచూ చేస్తుంటే మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.



స్వచ్ఛత

## కప్పు పాలు
## కోటి రూపాయలకు దారి

‘మెట్రో నగరాల్లో స్వచ్ఛమైన ఆవుపాలు లభించాలనుకోవడం అత్యాశగా మారిన ఈ రోజుల్లో ఓ పాతికేళ్ల యువతి చేసిన ప్రయత్నం ఆమెను కోటిరూపాయల వ్యాపారిగా నిలబెట్టింది. ఆ కోటీశ్వరురాలి పేరు శిల్పి సిన్హా. ఎనిమిదేళ్ల క్రితం వరకు జార్ఖండ్‌లోని డాల్టన్‌గంజ్ టౌన్‌లో ఉండేది. పై చదువుల కోసం బెంగళూరుకు వచ్చింది. మంచి పేరున్న హాస్టల్‌లో వసతి చూసుకుంది. ఓ కప్పు ఆవుపాలతో తన ఉదయాన్ని ప్రారంభించడం శిల్పి అలవాటు. పాలు తెప్పించుకుని తాగినప్పుడు అవి ఆమెకు మింగుడుపడలేదు. కారణం అవి కల్తీపాలు. స్వచ్ఛమైన కప్పు పాల కోసం బెంగళూరులో చాలా ప్రయత్నాలే చేసింది శిల్పి. ఆ సమయంలోనే ప్రతిముగ్గురు భారతీయులలో ఇద్దరు కల్తీపాలు తాగుతున్నారని ఫుడ్ రెగ్యులేటర్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన సర్వే వివరాలు శిల్పి మనసును కలచివేశాయి.





అప్పుడే తను బెంగళూరులోనే ఆవు పాల వ్యాపారం చేయాలని నిర్ణయించుకుంది. కొంతమంది పాడి రైతులను కలిసింది. భాష రాకపోయినప్పటికీ రైతుల వద్దకు వెళ్లిన శిల్పి ఆవుల దాణా, వాటి సంరక్షణ గురించి వివరాలు తెలుసుకుంది. బయటి వారు ఇచ్చే ధర కన్నా తను కొంచెం ఎక్కువ మొత్తమే చెల్లిస్తానని చెప్పింది. రైతులు సంతోషంగా సరే అన్నారు.

**ది మిల్క్ ఇండియా**

పాలసేకరణకు పనివాళ్లు లేరు. వాళ్లకు చెల్లించడానికి తన దగ్గర అంత డబ్బూ లేదు. అందుకని, తనే తెల్లవారుజామున మూడు గంటలకు రైతులవద్దకు వెళ్లేది. ఆమె నిజాయితీ, పాలలోని స్వచ్ఛత ఆరునెలల్లోనే వినియోగదారుల సంఖ్యను 500కు చేర్చేసింది. అది అంతకంతకూ పెరిగిపోతూండడంతో రెండేళ్ల కిందట జనవరిలో సంస్థకు ‘ది మిల్క్ ఇండియా’ అని పేరు పెట్టింది. ఈ సంస్థ ప్రారంభ పెట్టుబడి రూ.11,000. రెండేళ్లలోనే ‘ది మిల్క్ ఇండియా’ సంస్థ కోటిరూపాయల టర్నోవర్‌కి చేరుకుంది. సాధ్యమైందిలా...

ముందు ఒకటి నుండి తొమ్మిదేళ్ల పిల్లల ఎదుగుదలకు ఆవుపాలు ఎలా దోహదం చేస్తాయో వివరిస్తూ, వారిలో చైతన్యం కలిగించింది.

**నాణ్యమైన పశుగ్రాసం**

కర్ణాటక, తమిళనాడులోని 21 గ్రామాలకు వెళ్లి అక్కడి రైతులను కలిసి తమ వ్యాపార విషయాలతో పొందుపరిచిన నమూనాను ఇచ్చి చర్చలు జరుపుతుంది. నాణ్యమైన పశుగ్రాసాన్ని పశువులకు అందిస్తే ఆరోగ్యకరమైన పాలు వస్తాయని, ఆ పాలకు మంచి ధర ఇస్తానని హామీ ఇచ్చింది. దీంతో స్థానిక రైతులు ఆవులకు మొక్కజొన్నను ఆహారంగా ఇవ్వడం మొదలుపెట్టారు. దాంతో అటు రైతులూ, ఇటు ‘ది మిల్క్ ఇండియా’ సంస్థ కూడా మంచి ఫలితాలను సాధించారు. శిల్పి మొదటి సవాల్ రైతుల నమ్మకాన్ని పొందడం. మొదట్లో అది జరగలేదు కానీ, కాలక్రమేణా అనేకమంది రైతులు శిల్పి చెప్పిన దారిలో పయనించారు.

ఎనిమిదేళ్ల కిందట ఒక కప్పు పాల కోసం శిల్పి చేసిన ప్రయత్నం ఈ రెండేళ్లలో ఆమెను కోటి రూపాయల సామ్రాజ్యానికి రాణిని చేసింది. అలా తన వ్యాపారాన్ని తానే నిర్మించుకున్న సార్థక నామధేయురాలయింది శిల్పి.

– ఆరెన్నార్




epaper.sakshi.com

వేసవికాలం వస్తోందంటే
ఎండలు మండుతుంటాయి...
ఒక పక్క నుంచి వడగాడ్పులు ...
మరో పక్కనుంచి మామిడి గాలులు వీస్తాయి
కాయలు పెద్దవయ్యే వరకు ఊరుకోగలమా...
చెట్టు కింద రాలిన పిందెలను ఏరి

ఏదో ఒకటి చేసేయొద్దు...
పిందే కదా అని ఏరి పారేయద్దు...
అందులోనూ రుచి ఉంది...
తిని చూడండి... మీకు నచ్చి తీరుతుంది...
కావాలంటే ఈ పిందె మీద ఒట్టు...
పిందె విందు చేసుకు తిందాం...

# పిందె విందు



## వడు మాంగా

**కావలసినవి:** మామిడి పిందెలు – రెండు కప్పులు; (మామిడి పిందెలు గుండ్రంగా ఉండాలి); ఉప్పు – తగినంత (రాతి ఉప్పు మంచిది. మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి); నువ్వుల నూనె – 2 టేబుల్ స్పూన్లు.

**పొడి కోసం:** ఎండు మిర్చి – 20; మెంతులు – అర టీ స్పూను; ఆవాలు – ముప్పావు టీ స్పూను; పసుపు – కొద్దిగా; ఇంగువ – పావు టీ స్పూను.

**తయారీ:** ● ముందుగా మామిడి పిందెలను శుభ్రంగా కడిగి, పొడి వస్త్రంతో తుడిచి, కాసేపు నీడలో ఆరబెట్టాలి ● ఒక పాత్రలో ఆరిన మామిడి పిందెలు వేసి వాటి మీద నూనె వేసి బాగా కలపాలి (అలా చేయడం వల్ల నూనె అన్ని మామిడి పిందెలకు పడుతుంది) ● బాణలిలో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మెంతులు, ఎండుమిర్చి వరసగా ఒక దాని తరవాత ఒకటి వేసి వేయించి చల్లారాక, ఉప్పు, ఇంగువ జత చేసి మిక్సీలో వేసి మెత్తగా పొడి చేయాలి ● పావు కప్పు నీళ్లను మరిగించి చల్లార్చాక, పొడికి జత చేసి మెత్తటి ముద్దలా అయ్యేలా చేయాలి ● ఈ మిశ్రమాన్ని మామిడిపిందెల మీద పోసి కిందకి పైకి బాగా కలపాలి ● రోజుకి మూడు నాలుగు సార్ల చొప్పున అలా సుమారు మూడు రోజులు కలపాలి ● మామిడి పిందెలు మెత్తగా అయ్యి తినడానికి అనువుగా తయారవుతుంది.



## కన్ని మాంగా అచార్

**కావలసినవి:** మామిడి పిందెలు – కేజీ; కారం – 4 టేబుల్ స్పూన్లు; ఉప్పు – పావు కేజీ; ఇంగువ – టీ స్పూను; ఆవాలు – 50 గ్రాములు (పొడి చేయాలి).

**తయారీ:** ● ముందుగా మామిడిపిందెలను శుభ్రంగా కడిగి పొడి వస్త్రంతో తుడిచి, తడి పోయేవరకు ఆరబెట్టి, ముచికలు కట్ చేయాలి ● తగినన్ని నీళ్లకు ఉప్పు జత చేసి మరిగించి చల్లార్చాలి ● ఒక పెద్ద జాడీలో ముందుగా మామిడి పిందెలు వేసి, వాటి మీద నీళ్లు పోసి (పిందెలన్నీ మునగాలి) మూత పెట్టి, మూడు రోజులు అలాగే ఉంచాలి ● నాలుగవ రోజున నీళ్లను వడకట్టి పిందెలు వేరు చేయాలి ● ఈ నీటికి కారం, ఇంగువ, ఆవ పొడి జత చేసి బాగా కలపాలి ● ఈ నీటిని మళ్లీ జాడీలో పోసి, ఆ పైన మామిడి పిందెలు వేసి బాగా కలిపి మూత గట్టిగా బిగించి, సుమారు వారం రోజుల తరవాత తీసి వాడుకోవాలి.

## మామిడి ఔషధం

వేసవి వస్తోందనే సమాచారాన్ని మామిడి కాయలు మోసుకొస్తాయి. ఆ సమాచారంతో పాటు ఆరోగ్యాన్నిచ్చే విటమిన్లు, మినరల్స్‌నూ తీసుకొస్తాయి. మండు వేసవి రాక ముందే అందరినీ నోరూరించే మామిడి కాయల వల్ల మంచి ఆరోగ్యం వస్తుంది ● మామిడిలో పొటాషియం, మెగ్నీషియం సమృద్ధిగా ఉండటం వల్ల రక్త పోటును నియంత్రణలో ఉంచుతుంది ● క్యాన్సర్ ప్రమాదాన్ని నివారిస్తుంది ● కొలెస్ట్రాల్ స్థాయులు తగ్గిస్తుంది ● మామిడిలో అధిక మొత్తంలో ఉండే పెక్టిన్, పీచు పదార్థం రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తుంది. పెక్టిన్.. ప్రోస్టేట్ క్యాన్సర్ బారిన పడకుండా ఉంచుతుంది ● బరువు పెరగడానికి సహాయపడుతుంది ● రక్త హీనతను తగ్గిస్తుంది ● మామిడిలో ఐరన్ సమృద్ధిగా ఉండటం వల్ల, గర్భధారణ సమయంలో గర్భిణీలకు అవసరమైన ఇనుము వీటి ద్వారా పుష్కలంగా లభిస్తుంది ● మొటిమల నివారణకు మామడి చక్కని ఔషధం. చర్మానికి అడ్డు పడే రంధ్రాలు తెరుచుకోవటం వల్ల మొటిమలు ఏర్పడటాన్ని నివారిస్తుంది ● వృద్ధాప్యాన్ని నివారిస్తుంది ● మామిడికాయలో ఉండే ఏ, సి విటమిన్లు శరీరంలో అధికమొత్తం కొల్లాజెన్ ప్రొటీన్ ఉత్పత్తి చేయడానికి సహాయం చేస్తాయి ● మామిడికాయలో అధికంగా ఉండే విటమిన్ బి 6 మెదడు చురుకుగా పనిచేయడానికి ఉపకరిస్తుంది ● రోగనిరోధక శక్తి పెంచుతుంది ● మామిడిలో అధిక పరిమాణంలో ఉండే బీటా కెరొటిన్ అనే కెరొటినాయిడ్ వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది ● కంటి ఆరోగ్యానికి మామిడి చక్కని ఔషధం. మామిడికాయ ముక్కలు ప్రతిరోజూ తీసుకుంటే విటమిన్ ఏ లభిస్తుంది. తద్వారా రేచీకటి, కళ్లు పొడిబారడం వంటి సమస్యలు దూరమై, కంటి చూపు మెరుగుపడుతుంది ● పచ్చి మామిడికాయ రసంలో నీళ్లు, కొంచెం పంచదార కలిపి తాగితే శరీరం చల్లగా మారి, వేసవిలో వడదెబ్బ ప్రమాదాన్ని నివారించడానికి ఉపయోగపడుతుంది ● సూర్యుని వేడి వల్ల మన శరీర వేడి తగ్గక పోతే, మూత్రవిసర్జన ఆగి, మూత్రపిండాలు విషపదార్థాలతో నిండే ప్రమాదం ఉంటుంది. దీనిని నివారించడానికి మామిడి కాయ ఎంతో ఉపయోగపడుతుంది.



## కడు మాంగా అచార్

**కావలసినవి:** మామిడి పిందెలు – 5; ఆవాలు – టీ స్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; పచ్చిమిర్చి – 6; పసుపు – పావు టీ స్పూను; మెంతి పొడి – టీ స్పూను; కారం – 2 టీ స్పూన్లు; ఉప్పు – తగినంత; నూనె – 4 టేబుల్‌స్పూన్లు.

**తయారీ:** ● మామిడిపిందెలను శుభ్రంగా కడిగి, తడిపోయే వరకు ఆరబెట్టి, చిన్న చిన్న ముక్కలుగా తరిగి పక్కన ఉంచాలి ● బాణలిలో నూనె వేసి కాగాక ఆవాలు వేసి చిటపటలాడించాలి ● కరివేపాకు, పచ్చి మిర్చి తరుగు వేసి వేయించాలి ● పసుపు, కారం కూడా వేసి బాగా వేయించి, చిన్న కప్పుడు నీళ్లు, ఉప్పు వేసి మరిగించాలి ● చివరగా మామిడికాయ ముక్కలు వేసి సుమారు పది నిమిషాలు ఉడికించాలి ● మిశ్రమం దగ్గరపడి చిక్కగా తయారయ్యాక, గాలిచొరని సీసాలోకి తీసుకోవాలి ● (ఇష్టపడేవారు కొద్దిగా బెల్లం తురుమును ఎండబెట్టి కలుపుకోవచ్చు)

– నిర్వహణ: వైజయంతి పురాణపండ



## టెండర్ మ్యాంగో పికిల్

**కావలసినవి:** మామిడిపిందెలు – 850 గ్రా.; ఉప్పు – ముప్పావు కప్పు; ఆవాలు – టేబుల్ స్పూను; పసుపు – ఒకటిన్నర టీ స్పూన్లు; నువ్వుల నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; ఎండుమిర్చి – 20.

**తయారీ:** ● ముందుగా మామిడి పిందెలను శుభ్రంగా కడిగి, పొడివస్త్రంతో తుడిచి, నీడలో కొద్దిసేపు ఆరబెట్టాలి ● ముచికలు చాకుతో కట్ చేయాలి ● రాతి ఉప్పును మిక్సీలో వేసి మెత్తగా చేసి పక్కన ఉంచాలి ● ఆవాలు మిక్సీలో వేసి మెత్తగా అయ్యాక పసుపు జత చేయాలి ● తగినన్ని నీళ్లు జత చేసి మెత్తగా చేయాలి ● పెద్ద పాత్రలో మామిడి పిందెలు వేసి వాటి మీద నువ్వుల నూనె వేసి బాగా కలపాలి ● ఆవపిండి వేసి మరోమారు కలపాలి ● చివరగా ఉప్పు వేసి బాగా కలిపి, పెద్ద మూతి ఉన్న జాడీలోకి తీసుకోవాలి ● మూడు రోజుల పాటు ప్రతిరోజూ రెండు పూటలా పైకి కిందకి కలుపుతుండాలి ● నాలుగో రోజుకి బాగా ఊట దిగుతుంది ● మిక్సీలో ఎండుమిర్చి వేసి పొడి చేయాలి ● ముందుగా తయారుచేసి ఉంచుకున్న ఊరగాయ లోనుంచి వచ్చిన ఊట కొంత తీసి, ఎండుమిర్చి పొడిలో వేసి మెత్తగా చేయాలి ● ఒక పెద్ద పాత్రలోకి ఊరగాయ తిరగదీసి, దాని మీద ఈ మిశ్రమం వేసి, జాడీలోకి తీసుకోవాలి ● పది రోజుల పాటు ప్రతిరోజూ పైకి కిందకి కలపాలి ● ఊటంతా దిగి, ఊరగాయ తయారవుతుంది.

## ఉగాది పచ్చడి



**కావలసినవి:**
నీళ్లు – తగినన్ని; చింతపండు – తగినంత; చెరకు ముక్కలు – ఒక కప్పు (చిన్న చిన్న ముక్కలు); అరటి పండ్లు – 2 (ముక్కలు చేయాలి); బెల్లం తరుగు – నీళ్లకు తగినన్ని; వేప పువ్వు – 2 టేబుల్ స్పూన్లు; మామిడి కాయ – 1 (ముక్కలు చేయాలి); ఉప్పు – చిటికెడు; పచ్చి మిర్చి – 4 (ముక్కలు చేయాలి); మిరియాలు – 6 (పొడి చేయాలి).

**తయారీ:**
- చింతపండును తగినన్ని నీళ్లలో నానబెట్టి, పల్చగా రసం తీసుకోవాలి
- ఒక గిన్నెలో చింతపండు రసం, తగినన్ని నీళ్లు, బెల్లం తరుగు, ఉప్పు వేసి గరిటెతో కలియబెట్టాలి
- శుభ్రం చేసి నీళ్లలో కడిగిన వేప పువ్వు, అరటి పండు ముక్కలు వేసి మరో మారు కలియబెట్టాలి
- సన్నగా తరిగిన మామిడికాయ ముక్కలు, చెరకు ముక్కలు, పచ్చి మిర్చి వేసి బాగా కలిపి, చివరగా మిరియాల పొడి వేసి కలిపి, దేవుడికి నైవేద్యం పెట్టాలి
- చిన్న చిన్న గ్లాసులలో ప్రసాదంగా అందించాలి.

సిల్క్ మార్క్ – సెంట్రల్ సిల్క్ బోర్డ్, జౌళి మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం వారి ప్రోత్సాహం
CENTRAL SILK BOARD INDIA
SILK MARK INDIA
Your Assurance of Pure Silk

అందరికి శార్వరినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు
100% అసలైన పట్టు వస్త్రాలతో పండుగను జరుపుకోండి

దగ్గరలోని ఆథరైజ్డ్ సిల్క్ మార్క్ షాప్‌లను ఈరోజే సందర్శించండి

SILK MARK LABEL
E 00000017

All Showrooms of: TISCO. AEPOOR: Sri Laxmi Narasimha Swamy Silk HL W Co-Op Society – 98488 89524. ALAR: Handllom Weavers' Co-operative Society Ltd. - 99121 40753. ATMAKUR: Podugu Venkatesham – 99593 91068. BANDASOMARAM: Namala Haribabu – 99120 78926. BHONGIR: The Bhongiri Handloom Weavers Co-Op Society – 94408 00101. CHOUTUPPAL: G. Suresh - 98497 08022, Goshika Ravi Kumar -99486 28091, Sri Bhavanarushi Badravathi Handlooms – 98494 59256, The Choutuppal HL W Co-Op Society – 98482 46755, Vikram - 95056 82348. GHATTUPPAL: Ghattuppal Handloom Weavers' Co-op Society – 94403 48141, The Dhanalakshmi Silk HL W Co-Op Society – 97054 73781. KATTANGUR: Kattangur Hand-Loom Weaver's Co-op Society – 96036 15503. LINGOTAM: Swamulavari Lingotam HL W Co-Op Society – 9912095330. NARAYANPUR: Narayanpur HL Co-Op Society – 92475 91420. PALADUGU: Paladugu Handloom Weavers Co-Op Society – 98482 48279. PALIVELA: Palivela Handloom Weavers Co-Op Society – 99486 69682. PALLERLA: Pallerla Mixed HL W Co-Op Society – 97045 98204. POCHAMPALLY: Addepu Aravind – 81433 63282, Arundhathi Handloom Emporium – 94904 36454, Bharata Ashok – 99485 58045, Bharatha Harishankar – 90309 03048, Boga Markandeya – 98486 25660, Boga Natraj – 88856 58055, Boga Venkatesham – 98786 65043, D S R Weavers – 88862 22639, Dudyala Ramakrishna – 98484 59259, Eepuri Muthyalu – 98487 24009, Ganji Narender – 99519 61755, Ganji Yugender – 91601 69593, Kadaveru Sateesh Kumar – 98484 20626, Kudikala Narasimha – 98487 06694, Macha Venkatesham – 90323 84378, Mangal Pally Ramesh – 98482 79785, Paladi Yadagiri – 99481 04726, Pochampalli Weaves – 97047 56911, Pochampally Handloom Park Ltd. – 98480 92257, Pochampally Handloom Weavers Co-Op Society – 99484 28447, Rachha Suresh – 80992 62141, Rapolu Srinivas – 90309 03062, Sangem Chandriah – 98488 45492, Seetha Sudhakar – 74163 37416, Shree Ranjan Iktat Sarees – 96400 92432, Thadaka Ramesh – 98490 79799, Vanam Ravi – 90596 88886. RAMANNAPET: Lakshmi Silk Handllom Weaver's Co-op Society – 98859 55968. THUMMALAGUDEM: Thummalagudem Handllom Co-Op Society – 99487 81056.



"నేను ఎప్పుడూ సిల్క్ మార్క్ కలిగిన పట్టువస్త్రాలనే ధరిస్తాను" - విద్యాబాలన్

భారతీయ సిల్క్ మార్క్ సంస్థ, హైదరాబాద్ – +91 95735 53337 | hyderabad@silkmarkindia.com | www.silkmarkindia.com



● అఖిల్

## రెండోసారి

అఖిల్ హీరోగా నితిన్ మరో సినిమా నిర్మించబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రస్తుతం 'బొమ్మరిల్లు' భాస్కర్ తెరకెక్కిస్తోన్న 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' చిత్రంలో నటిస్తున్నారు అఖిల్. ఈ సినిమా తర్వాత సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించబోతున్నారట. ఈ సినిమాను హీరో నితిన్ నిర్మించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అంటే అఖిల్ హీరోగా, నితిన్ నిర్మాతగా రెండోసారి కలువనున్నారన్నమాట. అఖిల్ హీరోగా పరిచయమైన 'అఖిల్: ది పవర్ ఆఫ్ జువ్వా' (2015) చిత్రానికి నితిన్ నిర్మాతగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

## రజనీతో లారెన్స్ సినిమా?



● రాఘవ, రజనీకాంత్

రజనీకాంత్‌కి కొరియోగ్రాఫర్, డైరెక్టర్ రాఘవ లారెన్స్ వీరాభిమాని. తన అభిమాన హీరోని డైరెక్ట్ చేయాలని ఏ డైరెక్టరైనా అనుకుంటారు. లారెన్స్ కూడా అనుకున్నారు. ఇప్పుడు ఆ కల నిజం కాబోతోందని కోలీవుడ్ టాక్. రజనీకాంత్ చేయబోయే తదుపరి చిత్రాల్లో లారెన్స్ సినిమా కూడా ఒకటనే వార్త తమిళ ఇండస్ట్రీలో ప్రచారంలో ఉంది. ప్రస్తుతం శివ దర్శకత్వంలో 'అన్నాత్తే' అనే సినిమా చేస్తున్నారు రజనీ. అది రజనీ కెరీర్‌లో 168వ సినిమా. ఆ తర్వాత కమల్‌హాసన్ బ్యానర్‌లో ఓ సినిమా (169వ చిత్రం) కమిట్ అయ్యారు. 170వది రాఘవ లారెన్స్ సినిమా అవుతుందని టాక్. ప్రస్తుతం రజనీతో కథా చర్చలు జరుపుతున్నారట లారెన్స్.

## ఉరే సరి

నిర్భయ అత్యాచారం కేసులో నిందితులుగా నిలిచిన నలుగురిని శుక్రవారం ఉరి తీశారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియాలో తమ స్పందనను తెలియజేశారు. 'ఉరే సరి' అని అభిప్రాయాలను పేర్కొన్నారు.



ఆలస్యమైనా న్యాయం జరిగింది. న్యాయ వ్యవస్థ మీద నమ్మకం తగ్గిపోకుండా ఉండేందుకు నిర్భయ కేసు మరో ఉదాహరణ అయింది. నిర్భయ కేసు కోసం పోరాడిన ఆమె తల్లి, న్యాయవాదులందరికీ సెల్యూట్ చేస్తున్నాను. న్యాయ వ్యవస్థకు నా గౌరవాన్ని తెలియజేస్తున్నాను. ఇలాంటి ఘోర సంఘటనలు జరగకుండా ఉండేందుకు మరిన్ని కఠిన చట్టాలు, సత్వర తీర్పులు తీసుకురావాలని కోరుతున్నాను.

**– మహేశ్‌బాబు**



ఏడేళ్ల సుదీర్ఘ సమయం తర్వాత నిర్భయ దోషులను ఉరి తీశారు. న్యాయం కోసం ఇన్నేళ్లు నిర్విరామంగా పోరాడిన నిర్భయ తల్లిగారు, న్యాయవాదులకు నా సెల్యూట్.

**– రవితేజ**



నిర్భయ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. జైహింద్.

**– మనోజ్ మంచు**



ఒకరి చావు నాకు బోలెడు రిలీఫ్ ఇస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. అలాగే కొంతమందికి భయాన్నిస్తే చాలు.

**– హరీష్ శంకర్**



నిర్భయ దోషులను ఉరి తీశారనే అద్భుతమైన వార్తతో నా రోజుని ప్రారంభించాను. న్యాయం చేకూరింది.

**– తమన్నా భాటియా**



చాలా ఏళ్ల తర్వాత నిర్భయ తల్లిదండ్రులు ప్రశాంతంగా నిద్రపోతారని అనుకుంటున్నాను. చాలా పెద్ద యుద్ధమే చేశారు. ఆశా దేవి (నిర్భయ తల్లి) గారికి నా సెల్యూట్

**– తాప్సీ**



న్యాయం నిజంగా జరిగిందనుకుందామా? అత్యాచారం చేసిన ఆరు నెలల్లో ఉరి తీయాలనే చట్టాన్ని తీసుకురావాలి. ఇలాంటి సంఘటనల్లో అమ్మాయిలు ప్రాణాలు కోల్పోయినా తీర్పును అమలు చేయడంలో ఇంత ఆలస్యం చేయడమెందుకు?

**– వరలక్ష్మీ శరత్ కుమార్**



నిర్భయ కేసు మరింత త్వరగా ముగిసి ఉండాల్సింది. ఇప్పటికైనా ముగిసినందుకు సంతోషం.

**– ప్రీతీ జింటా**



నిర్భయ దోషులను ఉరి తీశారు. అత్యాచారానికి శిక్ష మరణమే. ఈ నిర్ణయం ఇండియాలోనే కాదు...ప్రపంచవ్యాప్తంగా కూడా ఓ ఉదాహరణగా నిలవాలి. మహిళలను గౌరవించాలి. నిర్భయ దోషులను ఉరి తీయడాన్ని ఆలస్యం చేయడానికి ప్రయత్నించిన వారిని చూసి సిగ్గుపడతున్నా

**– రిషీ కపూర్**



ఈ భూమి మీద నలుగురు రాక్షసులు (నిర్భయ దోషులను ఉద్దేశిస్తూ) ఇకపై లేరు. నిర్భయ తల్లిదండ్రులు దీనికోసం ఏడేళ్లుగా ఎదురు చూశారు. చివరికి నిర్భయ ఆత్మకు శాంతి కలిగింది

**– రవీనా టాండన్**



కఠినమైన చట్టాలు, శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర తీర్పులు వంటివి మాత్రమే నిర్భయలాంటి ఘటనలకు పాల్పడాలనుకునేవారికి భయాన్ని కలిగిస్తాయి. కాస్త ఆలస్యమైనా న్యాయం చేకూరింది

**– రితేష్ దేశ్‌ముఖ్**



ఇవాళ (శుక్రవారం) దేశానికి న్యాయం జరిగింది. నిర్భయ తల్లి రూపంలో మనందరికీ ఓ హీరో దొరికారు. ఈ తీర్పు వల్ల న్యాయవ్యవస్థ మీద గౌరవం అలానే కొనసాగుతుంది. అలాగే తప్పు చేయాలనుకునే ఆలోచనలు ఉన్నవాళ్లకు ఓ హెచ్చరికగానూ ఉంటుంది.

**– ప్రణీతా సుభాష్**



ఈ కేసు గెలవడానికి నిర్భయ తల్లికి ఏడేళ్లు పట్టింది. ఈ ఏడేళ్ల సమయంలో ఎన్నో అవమానాలు, మాటలు భరించాల్సి వచ్చిందామె. అవన్నీ దాటుకుంటూ ముందుకు వచ్చి పోరాడారు.. 'అంత ఆలస్యంగా బయట ఏం చేస్తుందో?' అని సులువుగా ఓ మాట అనేసి తన (నిర్భయ) వ్యక్తిత్వాన్ని తప్పు బట్టినవాళ్లందరూ స్వీయ పరిశీలన చేసుకోవాలని కోరుతున్నాను.

**– చిన్మయి శ్రీపాద**

## మళ్లీ జోడీ?

'నేల టిక్కెట్టు' సినిమాలో జంటగా నటించిన రవితేజ–మాళవికా శర్మ మరోసారి కలిసి నటించనున్నారని సమాచారం. ప్రస్తుతం 'క్రాక్' చిత్రంలో నటిస్తున్నారు రవితేజ. 'డాన్‌శీను, బలుపు' వంటి హిట్ చిత్రాల తర్వాత రవితేజ–గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా తర్వాత రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు పచ్చజెండా ఊపారు రవితేజ. హవీశ్ ప్రొడక్షన్స్ పతాకంపై కోనేరు సత్యనారాయణ నిర్మించనున్న ఈ చిత్రంలో రవితేజ ద్విపాత్రాభినయం చేయనున్నారట. దీంతో ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకి అవకాశం ఉంది. ఇప్పటికే ఒక హీరోయిన్‌గా నిధీ అగర్వాల్‌ను తీసుకున్న చిత్రబృందం మరో హీరోయిన్‌గా మాళవికా శర్మను తీసుకోనున్నారని టాక్. ఇదే నిజమైతే రవితేజ–మాళవికలను రెండోసారి జోడీగా చూడొచ్చన్నమాట.



● మాళవికా శర్మ

● రవితేజ

## ఏసీకే, టింకిల్ 30 రోజులు ఉచితం



● రానా

'ఏసీకే (అమర్ చిత్ర కథ), టింకిల్' యాప్స్‌లోని కంటెంట్‌ను 30రోజుల పాటు ఉచితంగా తిలకించవచ్చని హీరో రానా ప్రకటించారు. ఆ రెండు యాప్స్ ఆయనవే. కరోనా వైరస్ ప్రభావంతో సినిమా సహా ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ మొత్తం కార్యకలాపాల్ని నిలిపివేసింది. థియేటర్లు మూతపడ్డాయి. కరోనా వైరస్ భయంతో ప్రజలు ఇళ్లల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో వారికి బుల్లితెర మాత్రమే వినోదాన్ని పంచుతోంది. అందుకే దేశవ్యాప్తంగా 'ఏసీకే (అమర్ చిత్ర కథ), టింకిల్' యాప్స్‌ని ఉచితంగా చూసే అవకాశం కల్పించారాయన. ''ఏసీకే విషయంలో ఈ నెలలో ఆన్‌లైన్ సభ్యత్వాలను మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నాం. ఏసీకే, టింకిల్ యాప్స్‌లోని కంటెంట్‌ను పిల్లలు, పెద్దలు ఉచితంగా చూసుకోవచ్చు. మన గతం గురించి తెలుసుకొని, భవిష్యత్తును నిర్మించుకోవడానికి నేటి తరానికి ఇది చాలా ముఖ్యం'' అన్నారు రానా. ఇదిలా ఉంటే రానా హీరోగా తెరకెక్కిన 'అరణ్య' చిత్రం విడుదల వాయిదా పడింది.

## పర్‌ఫెక్ట్ హజ్బెండ్



● సత్యరాజ్

'బాహుబలి' చిత్రంలో కట్టప్ప పాత్రతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు సత్యరాజ్. ఆ సినిమా తర్వాత ఆయన ఎంత బిజీ అయ్యారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఇప్పటి వరకూ పెద్ద తెరపై ప్రేక్షకుల్ని అలరిస్తున్న ఆయన తాజాగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలిసారి ఓ తమిళ వెబ్ సిరీస్‌లో నటించేందుకు అంగీకరించారు. 'పర్ఫెక్ట్ హజ్బెండ్' (పరిపూర్ణమైన భర్త) అనే వెబ్ సిరీస్‌లో సత్యరాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. 'ఇరట్టై సుళి', 'ఆన్ దేవదై' వంటి చిత్రాలకి దర్శకత్వం వహించిన తామిరా ఈ వెబ్ సిరీస్‌ని తెరకెక్కిస్తున్నారు. భార్యాభర్తల మధ్య అనుబంధంతో ఈ వెబ్‌సిరీస్ రూపొందుతోంది. ఇందులో రేఖ, సీతా తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్‌లు కొనసాగనుందట.

## ఫెస్టివల్ క్యాన్సిల్

ప్రఖ్యాత ఫిల్మ్ ఫెస్టివల్ కాన్స్ వాయిదా పడింది. ఈ ఏడాది కాన్స్ చిత్రోత్సవాలు కరోనా కారణంగా జరుగుతాయా? లేదా? అనుకుంటున్న సందర్భంలో ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించబోవడం లేదని కాన్స్ నిర్వాహకులు ప్రకటించారు. ప్రతి ఏడాది ఫ్రాన్స్‌లో కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతుంది. కాన్స్‌లో గెలుపొందిన సినిమాల నుంచే ఆస్కార్ రేసు కూడా మొదలవుతోంది. ఈ ఏడాది మే 12 నుంచి 23 వరకు ఈ ఫెస్టివల్‌ను నిర్వహించాలని ముందు అనుకున్నారు. కానీ కరోనా ప్రభావంతో జరగడంలేదని ఓ లేఖను విడుదల చేశారు. ''ప్రస్తుతం ప్రపంచవ్యాప్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కాన్స్‌ని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం. జూన్ చివర్లోనో లేదా జూలై ప్రారంభంలోనో కాన్స్ ఫెస్టివల్‌ని నిర్వహించాలనుకుంటున్నాం'' అని చిత్రోత్సవాల నిర్వాహకులు పేర్కొన్నారు.

PALME D'OR
FESTIVAL DE CANNES

## కన్నడంలో నిన్ను కోరి



● ధృవ్

నాని, నివేదా థామస్, ఆది పినిశెట్టి ముఖ్య తారలుగా 2017లో వచ్చిన సూపర్ హిట్ సినిమా 'నిన్ను కోరి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఈ సినిమా తమిళంలో రీమేక్ అవుతోంది. అథర్వా మురళి, అనుపమా పరమేశ్వరన్ జంటగా 'తల్లి పోగాదే' టైటిల్‌తో ఈ రీమేక్ తెరకెక్కుతోంది. తాజాగా కన్నడంలోనూ 'నిన్ను కోరి' రీమేక్ కాబోతోందని సమాచారం. కన్నడ పాపులర్ నటుడు ధృవ్ సార్జా ఈ రీమేక్‌లో హీరోగా నటించనున్నారు. నంద కిశోర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నారు.

## 31 వరకు షూటింగ్స్ బంద్

కరోనా కారణంగా సినిమాల షూటింగ్స్‌ని నిలిపివేస్తున్నట్లు ఈ నెల 15న తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ప్రకటించిన విషయం తెలిసిందే. 24 శాఖలు తమ విధులను ఈ నెల 21 వరకు తక్షణం ఆపేయాల్సిందిగా మండలి కోరింది. ఇప్పుడు 24 శాఖల వారితో సంప్రదించి మరో కీలక నిర్ణయాన్ని శుక్రవారం విడుదల చేశారు. 21 వరకు పెట్టిన రద్దును మార్చి 31 వరకూ పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ముందు జాగ్రత్త చర్యగా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఉత్తుర్వుల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చలన చిత్ర వాణిజ్య మండలి ప్రతినిధులు పేర్కొన్నారు.

## అమలా పరిణయం



ఏఎల్ విజయ్‌తో విడిపోయిన తర్వాత తన రిలేషన్‌షిప్‌కి సంబంధించిన ప్రతీ విషయాన్ని రహస్యంగా ఉంచారు అమలా పాల్. ప్రేమలో ఉన్నానంటారు కానీ ఆ విషయాలేవీ బయటకు చెప్పలేదు. అయితే ముంబైకు చెందిన సింగర్ భవీందర్ సింగ్‌తో అమల ప్రేమలో ఉన్నారని, సహజీవనం చేస్తున్నారనే విషయం కొన్ని రోజుల క్రితం బయటకు వచ్చింది.



● అమలా పాల్, భవీందర్

తాజాగా ఈ ఇద్దరూ పెళ్లి చేసుకున్న విషయం బయటకు వచ్చింది. పెళ్లికి సంబంధించిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు భవీందర్. ప్రస్తుత పరిస్థితులను (కరోనా) అనుసరించి కేవలం కుటుంబ సభ్యుల మధ్య ఈ పెళ్లి చేసుకున్నారని సమాచారం. అయితే పెళ్లి ఫొటోలను షేర్ చేసిన కొన్ని నిమిషాలకే ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి తొలగించారు భవీందర్.

## ఆట వాయిదా

కోవిడ్ 19 (కరోనా వైరస్) ప్రభావం వల్ల బాలీవుడ్‌లో సినిమాలు వాయిదా పడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ జాబితాలోకి రణ్‌వీర్ సింగ్ '83' మూవీ కూడా చేరింది. 1983లో భారతజట్టు మొదటిసారి క్రికెట్ వరల్డ్‌కప్ గెలిచిన మధుర సంఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఇది. ఈ చిత్రానికి కబీర్‌ఖాన్ దర్శకత్వం వహించారు. ఇందులో ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ పాత్రలో నటించారు రణ్‌వీర్ సింగ్. అలాగే కపిల్‌దేవ్ భార్య రోమీగా నటించారు రణ్‌వీర్ సింగ్ భార్య దీపికాపదుకోన్. '83' సినిమాను తొలుత ఏప్రిల్ 10న విడుదల చేయాలనుకున్నారు. కోవిడ్ 19 ప్రభావంతో విడుదలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటిస్తూ ఓ నోట్‌ను విడుదల చేశారు రణ్‌వీర్ సింగ్. ''మనందరి ఆరోగ్యాలకు కోవిడ్ 19 సృష్టిస్తున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని '83' సినిమా విడుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించుకున్నాం. పరిస్థితులు చక్కబడిన తరువాత సినిమా విడుదల గురించి ప్రకటిస్తాం. '83' అనేది భారతీయులందరి సినిమా. ఎంతో కష్టపడి ఈ సినిమా చేశాం'' అని పేర్కొన్నారు చిత్రబృందం.



● రణ్‌వీర్

### వెనక్కి తగ్గిన కూలీ?

వరుణ్ ధావన్, సారా అలీఖాన్ జంటగా డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ నెం 1'. 1995లో డేవిడ్ ధావన్ దర్శకత్వంలోనే తెరకెక్కిన 'కూలీ నెం 1' చిత్రానికి ఇది తాజా రీమేక్. ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. తొలుత ఈ సినిమాను కార్మికుల దినోత్సవం సందర్భంగా మే 1న విడుదల చేయడానికి నిర్ణయించారు. కానీ ప్రస్తుతం కరోనా వైరస్ ప్రభావం కారణంగా విడుదలను వాయిదా వేయాలనుకుంటున్నారు. వరుణ్ ధావన్ నటించిన గత రెండు చిత్రాలు 'కళంక్, స్ట్రీట్ డ్యాన్సర్ 3'లకు బాక్సాఫీస్ వద్ద సరైన స్పందన రాలేదు. 'కూలీ నెం 1' వరుణ్ సొంత బేనర్‌లో రూపొందింది. పరిస్థితులన్నీ చక్కబడిన తర్వాత విడుదల చేస్తే కలెక్షన్స్ బాగుంటాయని వరుణ్ భావిస్తున్నారట. అందుకని 'కూలీ' విడుదల మే తర్వాతే అని బాలీవుడ్ టాక్.



● వరుణ్, సారా అలీఖాన్



ఉరి శిక్ష అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకుంటున్న ఢిల్లీ వాసులు

# 'నిర్భయ'దోషులకు ఉరి



## ఎట్టకేలకు అమలైన మరణశిక్ష ● 2012లో ఢిల్లీలో పారామెడిక్ విద్యార్థినిపై పాశవిక హత్యాచారం

**న్యూఢిల్లీ:** నిర్భయ తల్లిదండ్రుల ఏడేళ్ల న్యాయ పోరాటం ఎట్టకేలకు ఫలించింది. 2012లో రాజధాని నడిబొడ్డున నడుస్తున్న బస్సులో పారామెడికో విద్యార్థిని నిర్భయని అత్యంత క్రూరంగా హింసించి అత్యాచారం, హత్య చేసిన కేసులో దోషులైన ముఖేష్ సింగ్(32), పవన్ గుప్తా(25), వినయ్ శర్మ(26), అక్షయ్ కుమార్ సింగ్(31)లను శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు తీహార్ జైల్లో ఉరితీశారు. ఇలా ఒకేసారి నలుగురికి ఉరి శిక్ష అమలు చేయడం తీహార్ జైలు చరిత్రలో ఇదే మొదటిసారి. ప్రాణాల మీద ఆశతో దోషులు చివరి వరకు ఉరిశిక్ష అమలును ఆపడానికి తీవ్రంగా ప్రయత్నించారు. చట్టంలో ఉన్న అవకాశాలను వాడుకుంటూ ఆఖరి వరకు పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తూనే ఉన్నారు. దాంతో, గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత కూడా వారి ఉరిపై సందిగ్ధత నెలకొంది. గురువారం రాత్రి పవన్ గుప్తా పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు, ఆ తర్వాత సుప్రీం కోర్టు అత్యవసర విచారణ చేపట్టాయి. తన క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి రెండోసారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ పవన్ గుప్తా వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు బెంచ్ అసాధారణ రీతిలో శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ప్రారంభించింది. గంటపాటు జరిగిన వాదనల అనంతరం ఆ పిటిషన్‌ను బెంచ్ కొట్టివేసింది. దాంతో, ఉరి శిక్ష అమలు చేయడానికి చట్టపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఉరిశిక్ష అమలుకు ముందు కుటుంబ సభ్యులను కలిసేందుకు అనుమతినివ్వాలని అక్షయ్ సింగ్, పవన్ గుప్తా పెట్టుకున్న అభ్యర్థనను కూడా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇది జరిగిన మూడు గంటల్లోనే తీహార్ జైలు అధికారులు నలుగురికీ ఉరి శిక్ష అమలు చేశారు. నిబంధనల ప్రకారం.. ఉరి వేసిన తరువాత అరగంట పాటు వారిని ఉరికంబానికే వేలాడదీసి ఉంచారని జైలు అధికారులు తెలిపారు. 'ఉరి శిక్ష అనంతరం డాక్టర్లు పరీక్షించారు. నలుగురూ మృతి చెందారని నిర్ధారించారు' అని ఆ తరువాత తీహార్ జైలు డైరెక్టర్ జనరల్ సందీప్ గోయెల్ ప్రకటించారు. ఆ తరువాత డీడీయూ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పగించామన్నారు. అక్షయ్, ముఖేష్‌ల మృతదేహాలను బిహార్, రాజస్తాన్‌ల్లోని తమ తమ గ్రామాలకు వారు తీసుకెళ్లారని చెప్పారు. వినయ్, పవన్‌ల మృతదేహాలను ఢిల్లీలో రవిదాస్ క్యాంప్‌లో ఉన్న వారి ఇళ్లకు తరలించామన్నారు.

### చివరి క్షణాలు

ఒకవైపు కోర్టులో వాదనలు జరుగుతున్నా.. తీహార్ జైలు అధికారులు ఉరిశిక్ష అమలుకు సన్నాహాలు చేస్తూనే ఉన్నారు. గురువారం రాత్రి నుంచే మొత్తం జైలుని లాక్‌డౌన్ చేశారు. దోషులు నలుగురిని వేర్వేరు గదుల్లో ఉంచారు. రాత్రి డిన్నర్‌ని ముఖేష్, వినయ్ రోజూ మాదిరిగా ఇచ్చిన టైమ్‌కి తినేశారు. వారికిచ్చిన ఆహారంలో రోటీ, పప్పు, అన్నం, కూర ఉన్నాయి. అక్షయ్ గురువారం సాయంత్రం టీ తాగాడు. ఆ తర్వాత అతను ఏం తీసుకోలేదు. పవన్ గుప్తా కూడా ఆహారం తీసుకోవడానికి నిరాకరించాడు. వారిలో ఎలాంటి ఆందోళన కనిపించలేదని, రాత్రంతా కూడా వారు ముభావంగానే గడిపారని జైలు అధికారి ఒకరు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన తర్వాత లాంఛనాలు పూర్తి చేయడానికి తెల్లవారు జామున 3.30 గంటలకి ఆ దోషులు నలుగురిని నిద్ర లేపడానికి అధికారులు వెళ్లారు. అయితే వారు మేలుకొని ఉన్నారు. రాత్రంతా వారు నిద్రలేకుండానే గడిపారని జైలు అధికారులు వెల్లడించారు. స్నానం చేయడానికి, అల్పాహారం తినడానికి ఇష్టపడలేదు. నిర్వికారంగానే ఉరికంబం వైపు అడుగులు వేశారు.

### ఒకరి ఆత్మహత్య.. మరొకరి విడుదల

దోషులుగా తేలి, ఉరిశిక్షకు గురైన నలుగురితో పాటు మరో ఇద్దరు నిందితులుగా విచారణ ఎదుర్కొన్నారు. విచారణ జరుగుతుండగానే.. ఆ ఇద్దరిలో రామ్‌సింగ్ తీహార్ జైల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. మరో నిందితుడు నేరం జరిగిన సమయానికి మైనర్ కావడంతో.. నిర్బంధ వసతి గృహంలో మూడేళ్ల శిక్ష అనుభవించి 2015 సంవత్సరంలో విడుదల అయ్యాడు.

### ప్రధాని మోదీ హర్షం

**నిర్భయ** దోషుల ఉరిపై ప్రధాని మోదీ పరోక్షంగా స్పందించారు. నిర్భయ కేసును ప్రస్తావించకుండా.. 'న్యాయం గెలిచింది. మహిళల గౌరవం, భద్రత మనకు అత్యంత ముఖ్యమైన విషయం. మన మహిళలు అన్ని రంగాల్లోనూ అద్భుత విజయాలు సాధిస్తున్నారు. మహిళల సాధికారతపై ప్రధానంగా దృష్టి పెట్టే.. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలు లభించే సమాజాన్ని మనమంతా కలిసి నిర్మించాలి' అని ఆయన ట్వీట్ చేశారు. కాగా, మహిళలపై హింసను నివారించేందుకు మరణశిక్ష ఏ నాటికి పరిష్కారం కాబోదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వ్యాఖ్యానించింది. ఈ ఉరి శిక్ష భారతదేశ మానవహక్కుల చరిత్రలో ఒక మరకలా నిలిచిపోతుందని పేర్కొంది.

### ఆఖరి కోరికలివే

**ఉ**రికంబం ఎక్కడానికి ముందు దోషుల్లో ఒకరైన ముఖేష్ సింగ్ తన అవయవాలను దానం చేశాడు. అదే తన ఆఖరి కోరికని చెప్పాడు. వినయ్ తాను జైల్లో ఉన్నప్పుడు వేసిన పెయింటింగ్‌లను జైలు సూపరింటెండెంట్‌కి ఇవ్వమని కోరాడు. తాను చదివే హనుమాన్ చాలీసా తన కుటుంబసభ్యులకు ఇవ్వమని చెప్పినట్టు జైలు అధికారి వెల్లడించారు. ముఖేష్, వినయ్, పవన్, అక్షయ్ ఎవరూ ఎలాంటి విల్లు రాయలేదని ఆ అధికారి చెప్పారు.

## న్యాయం దక్కింది

● నిర్భయ దోషులకు ఉరిశిక్షపై పలువురు ప్రముఖుల హర్షం

**న్యూఢిల్లీ/బెంగళూరు:** నిర్భయ దోషుల ఉరిపై ప్రధాని మోదీ సహా, పలువురు కేంద్రమంత్రులు, మహిళా సంఘాలు సానుకూలంగా స్పందించాయి. పలువురు రాజకీయ నేతలు న్యాయనిపుణులు హర్షం వ్యక్తం చేశారు. దోషులకు ఉరిశిక్ష అమలును పలువురు కేంద్ర మంత్రులు స్వాగతించారు. దేశంలో మహిళలపై జరిగే అత్యాచారాలకు కఠిన శిక్షలు అమలు చేయాలని బాలీవుడ్ ప్రముఖులు రిషి కపూర్, తాప్సీ పన్ను, రితేశ్ దేశ్‌ముఖ్ తదితరులు పేర్కొన్నారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ మాత్రం.. మహిళలపై అత్యాచారాలకు దోషులకు మరణ శిక్ష విధించడం ఏమాత్రం పరిష్కారం కాదని తెలిపింది. భారత్ మానవహక్కుల రికార్డుపై ఈ ఘటనను మాయని మచ్చగా అభివర్ణించింది.

దోషులకు కఠిన శిక్షలు పడేలా నిర్భయ తల్లి సాగిస్తున్న పోరాటాన్ని స్వయంగా చూశాం. ఇందుకు కొంత సమయం తీసుకున్నా, చివరికి ఆ కుటుంబానికి న్యాయం దక్కినందుకు సంతోషంగా ఉంది. నిర్భయ దోషులకు ఉరి శిక్ష అమలుతో నేరగాళ్లు చట్టం నుంచి తప్పించుకోలేరని గట్టి హెచ్చరిక పంపినట్లయింది.

–మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ

నిర్భయ ఘటనల వంటివి భవిష్యత్తులో జరక్కుండా చూస్తామని ఈ సమయంలో మనమంతా ప్రతినబూనాలి. ఏ కూతురికీ ఇలాంటి ఆపద రాకూడదు. వ్యవస్థలో లోపాలను అధిగమించేందుకు పోలీసులు, కోర్టులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా కృషి చేయాలి.

–ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

తీవ్ర వేదనను అనుభవించిన ఒక కూతురు నిర్భయకు ఎట్టకేలకు న్యాయం జరిగింది. మరణశిక్ష అమల్లో జాప్యం అయ్యేలా దోషులు తప్పుదోవ పట్టించకుండా ఇకపై న్యాయవ్యవస్థ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–కేంద్ర న్యాయశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్

నిర్భయకు ఎట్టకేలకు న్యాయం దొరికింది. ఆమె ఆత్మకు శాంతి లభించింది. ఈ కేసులో నలుగురు దోషులను ఉరి తీయడం మిగతా వారికి హెచ్చరికలా పనిచేస్తుంది. న్యాయ వ్యవస్థలోని లొసుగులను ఈ కేసు బయటపెట్టింది. వీటిని నలుగురు దోషులు వాడుకున్నారు.

–జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖా శర్మ

### నిర్భయ నివాసంలో హర్షం

**దో**షులకు ఉరిశిక్ష అమలు శుక్రవారంనాడు పూర్తి కావడంతో పశ్చిమ ఢిల్లీ ద్వారకా ప్రాంతంలోని నిర్భయ కుటుంబసభ్యులు, ఇరుగు పొరుగువారు సంతోషం వ్యక్తం చేశారు. నిర్భయ కుటుంబసభ్యులను కలిసేందుకు జనం క్యూ కట్టారు. ఈ సందర్భంగా వారంతా స్వీట్లు పంచుకున్నారు. పాటలు పాడుకుంటూ, ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. 'గత ఏడాది డిసెంబర్ 12వ తేదీ నుంచి మా ఇంటి ఆవరణలో నిర్భయకు నివాళిగా రోజూ కొవ్వొత్తులను వెలిగిస్తున్నాం. ఇటీవల ఒక రోజు రాత్రి భారీ వర్షం కురిసినా కూడా ఒక కొవ్వొత్తి వెలుగుతూనే ఉండటం గమనించాం. దీనిని మేం శుభ సూచికంగా భావించాం'అని నిర్భయ తండ్రి బద్రీనాథ్ సింగ్ తెలిపారు.

## నా కూతురి ఆత్మ శాంతించింది!

### మార్చి 20ని 'నిర్భయ న్యాయ దివస్'గా జరుపుకోవాలి

### నిర్భయ తల్లి ఆశాదేవి స్పందన



ఉరి అనంతరం చిరునవ్వులు చిందిస్తున్న నిర్భయ తల్లి

**న్యూఢిల్లీ:** నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలు కావడంపై బాధితురాలి కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. ఎట్టకేలకు న్యాయం లభించిందని, ఇప్పుడు భద్రంగా ఉన్నామని మహిళలు భావిస్తారని వ్యాఖ్యానించారు. శిక్ష అమలు ఇంతగా వాయిదా పడటానికి కారణమైన చట్టపరమైన లోపాలపై ఇకపై తాము పోరాటం చేస్తామన్నారు. నిర్భయ తల్లి ఆశాదేవి, తండ్రి బద్రీనాథ్ సింగ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆలస్యంగానైనా న్యాయం జరిగిందని ఆశాదేవి వ్యాఖ్యానించగా, తమ కూతురికి న్యాయం జరిగిందని, ఇలాంటి అన్యాయానికి గురైన బాధితుల కోసం ఇకపై పోరు కొనసాగిస్తామని బద్రీనాథ్ పేర్కొన్నారు. ఉరిశిక్ష అమలు మూడుసార్లు వాయిదా పడటంపై స్పందిస్తూ.. శిక్ష అమలును వాయిదా వేసేందుకు చేసే ఇలాంటి కుయుక్తులకు అడ్డుకట్ట వేసేలా మార్గదర్శకాలను విడుదల చేయాలని సుప్రీంకోర్టును వారు అభ్యర్థించారు. 'ఇప్పటికైనా మిగతా బాధితులకు సకాలంలో న్యాయం జరగాలి. అందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు జరగాలి. ఆ దిశగా పోరాటం సాగిస్తాం' అన్నారు. ఈ రోజు తన కూతురి ఆత్మ శాంతించిందని భావిస్తున్నానని భావోద్వేగంతో ఆశాదేవి వ్యాఖ్యానించారు. మా ఊరి ప్రజలు ఈ రోజే హోళీ పండుగ జరుపుకుంటారన్నారు. ఈ శిక్ష తరువాతైనా.. తల్లిదండ్రులు మహిళలతో ఎలా ప్రవర్తించాలనే విషయాన్ని తమ కుమారులకు నేర్పిస్తారని ఆశిస్తున్నామన్నారు. 'గురువారం రాత్రి సుప్రీంకోర్టు విచారణ అనంతరం ఇంటికి వచ్చి నా కూతురు ఫొటోను హత్తుకుని, బేటీ.. నీకు న్యాయం జరిగింది' అని విలపించానని ఆశాదేవి తెలిపారు. రాత్రంతా తామిద్దరికి కంటి మీద కునుకు లేదన్నారు. మార్చి 20వ తేదీ చరిత్రలో నిలిచిపోవాలని, ఈ రోజును ఏటా 'నిర్భయ న్యాయ దివస్'గా జరుపుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఆశాదేవి ఇంటి వద్ద తెల్లవారు జామున గుమికూడిన ప్రజలు ఉరిశిక్ష అమలుపై 'కౌంట్ డౌన్' నిర్వహించారు.





నిర్భయ దోషుల మృతదేహాలతో ఆస్పత్రి వద్దకు వచ్చిన వ్యాన్



విజయ సంకేతం చూపుతున్న నిర్భయ తల్లిదండ్రులు, లాయర్లు సీమా కుష్వాహ, జితేంద్ర ఝూ

## కనికా కపూర్‌కు కరోనా



**బా**లీవుడ్ ప్రముఖ గాయని కనికా కపూర్‌కు కరోనా పాజిటివ్ అని తేలడంతో ఏకంగా ఎంపీలు సెల్ఫ్ క్వారంటైన్ విధించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. వివరాల్లోకి వెళితే గాయని కనికా కపూర్ ఇటీవల లక్నోలో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులో రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, ఆమె కుమారుడు దుష్యంత్ సింగ్‌లు పాల్గొన్నారు. ఇప్పుడు కనికా కపూర్‌కు కరోనా పాజిటివ్ అని తేలడంతో వసుంధర రాజే, దుష్యంత్ సింగ్‌లు సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లారు. రాజస్తాన్ నుంచి ఎంపీగా ఉన్న దుష్యంత్ పార్లమెంటులో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్, ఎంపీ అనుప్రియా పటేల్‌లతో సన్నిహితంగా మెలిగారు. దీంతో వారివురు కూడా సెల్ఫ్ క్వారంటైన్ విధించుకుంటున్నట్లు ప్రకటించారు. అంతేగాక మార్చి 18న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చిన ఉపాహార విందుకు పలువురు ఎంపీలతోపాటు దుష్యంత్ కూడా హాజరయ్యారని, బుధవారం రవాణా, సాంస్కృతిక శాఖలు నిర్వహించిన సమావేశంలోనూ దుష్యంత్ 20 మంది ఎంపీలతో కలిసి ఉన్నారని డెరెక్ వివరించారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలను వాయిదా వేయాలని ఆయన కోరారు.

### 2012 నుంచి 2020 వరకు

**న్యూఢిల్లీ:** నిర్భయ ఘటన 2012 డిసెంబర్ 16న చోటు చేసుకోగా, దోషులకు ఉరిశిక్ష 2020 మార్చి 20న అమలైంది. ఏడు సంవత్సరాలకు పైగా ఈ కేసు విచారణ సాగింది. దోషులుగా తేలి, ఉరిశిక్షను నిర్ధారించిన తరువాత కూడా కేసును సాధ్యమైనంత సాగదీశారు. విచారణ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు, రాష్ట్రపతి కార్యాలయం చుట్టూ పలుమార్లు ఈ కేసు చక్కర్లు కొట్టింది. చివరగా, మార్చి 5న ట్రయల్ కోర్టు మార్చి 20న ఉరిశిక్షను అమలు చేయాలని డెత్ వారెంట్లను జారీ చేసింది.

### 'నిర్భయ' తలారికి లక్ష నజరానా

**యశవంతపుర:** నిర్భయ హంతకులను ఉరి తీసిన తలారి పవన్ జల్లాద్‌కు రూ.లక్ష నజరానా ప్రకటించినట్లు నటుడు జగ్గేశ్ ట్వీట్ చేశారు. హంతకులను ఉరితీసే వ్యక్తికి రూ. లక్ష బహుమతిగా ఇస్తానని గతంలో తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉరితీతతో సత్యం, ధర్మానికి న్యాయం లభించిందన్నారు. ఈ డబ్బుతో తన కుమార్తె వివాహం చేస్తానని జల్లాద్ గతంలో పేర్కొనడాన్ని జగ్గేశ్ గుర్తు చేశారు.



### జైలు వద్ద నినాదాలు

తీహార్ జైలు వెలుపల గురువారం రాత్రంతా జనం హడావుడి కనిపించింది. కరోనా భయాన్ని కూడా పక్కనపెట్టి వందలాది మంది గుమిగూడారు. దోషులను ఉరి తీశారన్న వార్త వినగానే జాతీయ జెండాను ఎగురవేస్తూ లాంగ్ లివ్ నిర్భయ, భారత్ మాతా కీ జై అని నినాదాలు చేశారు.

# కోవిడ్ బాధితులు 200పైనే



కాన్పూర్ ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన శిశువుకు మాస్క్

**న్యూఢిల్లీ:** దేశంలో కోవిడ్ కోరలు చాస్తోంది. చాపకింద నీరులా ఒక్క రోజులోనే అత్యధికంగా 50 కొత్త కేసులు నమోదు కావడంతో శుక్రవారం నాటికి దేశం మొత్తమ్మీద కరోనా వైరస్ బాధితుల సంఖ్య 223కు చేరుకుంది. ఈ మహమ్మారిని ఎదుర్కొనే విషయంలో రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధాని ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వైరస్ కట్టడికి రాష్ట్రాలు పలు చర్యలు చేపట్టాయి. మహారాష్ట్ర రాజధాని ముంబై, పుణే, నాగపూర్‌లలో కార్యాలయాలన్నింటినీ మార్చి 31వ తేదీ వరకూ మూసివేస్తున్నట్లు ముఖ్యమంతి ఉద్ధవ్ ఠాక్రే ప్రకటించగా, కిరాణా, మందుల దుకాణాలను మినహాయించి అన్ని మాల్స్‌ను మూసివేస్తున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. ప్రధాని మోదీ ఇచ్చిన జనతా కర్ఫ్యూ పిలుపునకు స్పందనగా రైల్వే శాఖ శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి 10 గంటల వరకూ రైళ్లన్నింటినీ నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. దేశంలో కరోనా వైరస్ బారిన పడ్డవారిలో 32 మంది విదేశీయులు ఉన్నారు. వీరిలో 17 మంది ఇటలీకి చెందిన వారు కాగా, ఫిలిప్పీన్స్‌కు చెందిన వారు ఇద్దరు. బ్రిటన్‌కు చెందిన ఇద్దరితోపాటు కెనడా, ఇండొనేసియా, సింగపూర్‌లకు చెందిన వారు ఒకొక్కరు ఉన్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. దేశం మొత్తమ్మీద ఇప్పటివరకూ ఢిల్లీ, కర్ణాటక, పంజాబ్, ముంబైలలో ఒకొక్కరు చొప్పున నలుగురు కోవిడ్ కారణంగా మరణించిన విషయం తెలిసిందే. కాగా రాజస్తాన్‌లో చికిత్సతో స్వస్థత చేకూరిన ఒక ఇటాలియన్ పర్యాటకుడు గుండెపోటుతో గురువారం రాత్రి మరణించినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీలో మొత్తం 17 కేసులు నమోదు కాగా, వీరిలో ఒక విదేశీయుడు ఉన్నాడు. ఉత్తర ప్రదేశ్‌లో ఒక విదేశీయుడితో కలిపి మొత్తం కేసులు 19 నమోదయ్యాయి. మహారాష్ట్రలో ముగ్గురు విదేశీయులతో కలిపి 47 కేసులు నమోదు కాగా, కేరళలో ఇద్దరు విదేశీయులతో కలిపి 28 పాజిటివ్ కేసులు ఉన్నాయి. కర్ణాటకలో 15, లడాఖ్‌లో 10, జమ్మూకశ్మీర్‌లో నాలుగు, తెలంగాణలో 9 మంది విదేశీయులతో కలిపి 16 కేసులు ఉన్నాయని ఆరోగ్య శాఖ వివరించింది. రాజస్తాన్‌లో ఇద్దరు విదేశీయులతో కలిపి 9 మంది, తమిళనాడులో ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు వ్యాధి బారిన పడినట్లు తెలిపింది. ఇక, హరియాణాలో 17 మంది కోవిడ్ బారిన పడగా వీరిలో 14 మంది విదేశీయులు. ఒడిశాలో రెండు, ఉత్తరాఖండ్‌లో మూడు, బెంగాల్, పంజాబ్‌లలో రెండు చొప్పున, పుదుచ్చేరి, చండీగఢ్‌లలో ఒక్కో కేసు నమోదైంది. దేశంలో కరోనా వైరస్‌ను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు రాజ్యసభ సంఘీభావం ప్రకటించింది. ప్రధాని మోదీపై విశ్వాసం ప్రకటిస్తూ ఒక తీర్మానం ఆమోదించింది.



మాస్క్ ధరిస్తున్న బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

# ప్రపంచ వ్యాప్తంగా 10 వేల మరణాలు

**ప్యారిస్:** కరోనా వైరస్ మహమ్మారి ధాటికి ప్రపంచం దాదాపు స్తంభించిపోతోంది. చైనాలో పుట్టి 150 దేశాలకుపైగా విస్తరించిన ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకూ మరణించిన వారి సంఖ్య పదివేలు దాటగాదాదాపు 2.44 లక్షల మందికి ఈ వైరస్ సోకినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వైరస్ మొదలైన చైనాలోని వూహాన్ ప్రాంతంలో రెండో రోజూ కొత్త కేసులేవీ నమోదు కాలేదు. అమెరికాలోనూ కోవిడ్ మృతుల సంఖ్య 200 దాటిపోయింది.

### స్పెయిన్‌లో వెయ్యికి చేరిన మృతుల సంఖ్య...

యూరోపియన్ దేశం స్పెయిన్‌లో శుక్రవారం నాటికి కరోనా వైరస్ ధాటికి వెయ్యిమంది బలయ్యారు. మొత్తం 20 వేల మందికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు శ్రీలంక శుక్రవారం నుంచి దేశవ్యాప్త కర్ఫ్యూ విధించింది. కరోనా వైరస్‌తో ఇరాన్‌లో మృతుల సంఖ్య 1433కి చేరిందని, 20వేల మంది పాజిటివ్‌గా తేలారని అధికారులు తెలిపారు. సౌదీ అరేబియాలో మొత్తం 274 మంది వ్యాధి బారిన పడ్డ విషయం తెలిసిందే. పాకిస్తాన్‌లో 452 మంది వ్యాధి బారిన పడగా ముగ్గురు మరణించారు. చైనాలో ఈ వ్యాధితో మరణించిన వారి సంఖ్య 3,248కి చేరుకుంది. ఏటా జరిగే అగ్ర దేశాధినేతల సమావేశం జీ–7తోపాటు ప్రతిష్టాత్మక కేన్స్ ఫిలిం ఫెస్టివల్ కరోనా వైరస్ కారణంగా వాయిదా పడ్డాయి.

### ఇటలీలో ఒక్కరోజే 627 మంది మృతి

**రోమ్:** ఇటలీలో కరోనా విలయం కొనసాగుతోంది. శుక్రవారం ఒక్కరోజే 627 మంది బలయ్యారు. దీంతో ఆ దేశంలో మొత్తం మరణాల సంఖ్య 4,032కి చేరింది. అలాగే, కేసుల సంఖ్య 47 వేలు దాటింది. భారత ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'సార్క్ కరోనా ఎమర్జెన్సీ ఫండ్'కు నేపాల్ సుమారు 10 లక్షల డాలర్ల(10 కోట్ల నేపాలీ రూపాయలు) విరాళం ప్రకటించింది. కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలంటూ ప్రధాని మోదీ చేసిన ప్రతిపాదనకు పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ మద్దతు ప్రకటించారు.

# సామాజిక దూరాన్ని పాటించాలి

● రాష్ట్రాల సీఎంలతో మోదీ

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని మోదీ పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చలు జరిపారు. సామాజిక దూరాన్ని పాటించాలని మోదీ సూచించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో లింక్ ద్వారా జరిపిన ఈ చర్చల్లో ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్, ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారని ప్రధానమంత్రి కార్యాలయం ఓ నివేదికను విడుదల చేసింది. కరోనా కోసం తగినంత సిబ్బంది ఏర్పాటు, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపింది.

### కలసికట్టుగా పని చేయాలి..

కరోనా లాంటి మహమ్మారి ప్రపంచాన్ని కబళిస్తున్న వేళ నిర్లక్ష్యానికి తావివ్వడానికి వీలు లేదని, ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉండాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా పనిచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రులకు సూచించారు. పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. కరోనా నియంత్రణకు తమ రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలను వారు వివరించారు. కరోనాను ఎదుర్కొనేందుకు 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు వెంటనే విడుదల చేయాల్సిందిగా సీఎంలు మోదీని కోరారు. కాగా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి 38 మంది ఎంపీ (డాక్టర్లు కూడా)లతో సమావేశమయ్యారు. ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ప్రస్తుతం భారత్‌లో వ్యాప్తి రెండో దశలో ఉందని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డీజీ బలరాం భార్గవ చెప్పారు.





వీడియో లింక్ ద్వారా మాట్లాడుతున్న ప్రధాని మోదీ, చిత్రంలో ఏపీ సీఎం జగన్

# భారత ఫుట్‌బాల్ దిగ్గజం

# పీకే బెనర్జీ అస్తమయం

ప్రదీప్ కుమార్ బెనర్జీ అన్నా... పీకే బెనర్జీ అన్నా... నేటితరంలో చాలామందికి తెలియకపోవచ్చు. కానీ భారత ఫుట్‌బాల్‌కు బాగా తెలుసు. ఎందుకంటే ఆటగాడిగా, కెప్టెన్‌గా, చివరకు కోచ్‌గా ఆయన ఫుట్‌బాల్ క్రీడకు ఐదు దశాబ్దాలకు పైగా విశేష సేవలందించారు. అందుకే కేంద్ర క్రీడా పురస్కారం 'అర్జున' మొదలైందే తడవుగా ఈ అవార్డు పొందిన తొలి భారత ఫుట్‌బాలర్‌గా పీకే బెనర్జీ ఘనత వహించారు. ఇంతటి చరిత్ర ఉన్న అలనాటి దిగ్గజానికి భారత సాకర్ సెల్యూట్ చేస్తోంది.

## ప్లేయర్‌గా, కెప్టెన్‌గా, కోచ్‌గా 51 ఏళ్ల పాటు సేవలు

- 1956, 1960 ఒలింపిక్స్‌లలో దేశానికి ప్రాతినిధ్యం
- 1962 ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టు సభ్యుడు
- క్రీడాలోకం దిగ్భ్రాంతి







1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన భారత జట్టు సభ్యులతో పీకే బెనర్జీ (వృత్తంలోని వ్యక్తి)

**న్యూఢిల్లీ:** 'కోల్‌కతా మైదాన్'కు కళ్లు ఉంటే కన్నీరు మున్నీరయ్యేది. తన మట్టిపై ఆటలాడిన అడుగులు ఎంతో ఎత్తుకు ఎదిగి... దిగ్గజంగా అస్తమయం అయితే కారేది కన్నీరేగా! శుక్రవారం అదే జరిగింది. భారత ఫుట్‌బాల్ దిగ్గజం ప్రదీప్ కుమార్ (పీకే) బెనర్జీ కన్నుమూశారు. కొంతకాలంగా న్యూమోనియా, శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్న 83 ఏళ్ల బెనర్జీ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలున్నారు. 83 ఏళ్ల తన జీవిత కాలంలో 51 ఏళ్లు ఆటకే అంకితమిచ్చారు. తన కెరీర్‌లో భారత్ తరఫున ఫ్రెండ్లీ తదితర మ్యాచ్‌లు కలుపుకొని ఓవరాల్‌గా 84 మ్యాచ్‌లాడిన ఈ స్ట్రయికర్ 65 గోల్స్ చేశారు. 36 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 19 గోల్స్ సాధించాడు. సాకర్ క్రేజీ బెంగాల్‌లో ఆయన ఓ ఫుట్‌బాలర్ మాత్రమే కాదు 'అంతకుమించి'! సమున్నతమైన వ్యక్తిత్వం మూర్తీభవించిన ఆయనంటే బెంగాలీ వాసులకు ఎనలేని గౌరవం. అందుకే 'పీకే బెనర్జీ', 'ప్రదీప్ దా'గా చిరపరిచితుడైన అలనాటి ఈ దిగ్గజాన్ని ఎంతగానో ఆరాధిస్తారు. స్ట్రయికర్‌గా... సారథిగా... కోచ్‌గా... ఐదు దశాబ్దాలు ఫుట్‌బాల్ కోసమే పరితపించిన 'బెనర్జీ సాబ్' లేరనే వార్త బెంగాల్‌నే కాదు... భారత క్రీడాలోకాన్నే శోకసంద్రంలో ముంచింది.

**భారత ఫుట్‌బాల్‌లో మొనగాడు...**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మొయినగురిలో 1936, జూన్ 23న జన్మించిన బెనర్జీ ఏడుగురి సంతానంలో ఒకరు. ఆయన తండ్రి ప్రావత్ బెనర్జీ చిరుద్యోగి. 1941లో బెనర్జీ కుటుంబం తండ్రి ఉద్యోగరీత్యా జల్పాయ్‌గురికి వెళ్లింది. అనంతరం కోల్‌కతాకు చేరాక... అక్కడి కోల్‌కతా మైదాన్‌లో సరదాగా ఫుట్‌బాల్ ఆడే క్రమంలో ఓనమాలు నేర్చుకున్నారు. తర్వాత 1951లో తొలిసారి సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ ఆడిన పీకే బెనర్జీ తదనంతర కాలంలో భారత ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై కీలక ఆటగాడిగా ఎదిగారు. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో ఆయన సభ్యుడిగా ఉన్న భారత్ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. మరో ఒలింపిక్స్ వచ్చేసరికి రోమ్ (1960) ఈవెంట్‌లో బెనర్జీ భారత జట్టుకు నాయకత్వం వహించారు. ఆ విశ్వ క్రీడల్లో పటిష్టమైన ఫ్రాన్స్‌తో జరిగిన మ్యాచ్‌ను 1–1తో 'డ్రా'గా ముగించడంలో ఆయన గోల్ దోహదం చేసింది. అలాగే వరుసగా మూడు ఆసియా క్రీడల్లో (1958–టోక్యో, 1962–జకార్తా, 1966–బ్యాంకాక్) ఈ స్ట్రయికర్ రాణించారు. 1962 ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణం గెలుపొందడంలో బెనర్జీ కీలకపాత్ర పోషించారు. ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణం నెగ్గడం అదే చివరిసారి. క్రీడాకారుడిగా రిటైరయ్యాక 1970 నుంచి 1985 వరకు భారత జట్టుకు కోచ్‌గా సేవలందించారు. పీకే కోచింగ్‌లో భారత్ 1970 ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గింది. ఆసియా క్రీడల్లో భారత ఫుట్‌బాల్ జట్టు పతకం సాధించడం అదే చివరిసారి. భారత జట్టు కోచ్ పదవి నుంచి తప్పుకున్నాక ఆయన 2003 వరకు మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్, మొహమ్మడన్ స్పోర్టింగ్ క్లబ్ జట్లకు కోచ్‌గా ఉన్నారు.

**'అర్జున' విజయం ఆయనతోనే...**

జాతికి కీర్తిప్రతిష్టలు తెచ్చిన క్రీడాకారుల్ని అవార్డులతో గుర్తించాలని అప్పటి భారత ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 1961లో 'అర్జున' అవార్డులు మొదలయ్యాయి. ఫుట్‌బాల్ క్రీడాంశంలో తొలి అర్జున పొందింది 'ప్రదీప్ దా'నే! మళ్లీ 1990లో 'పద్మశ్రీ' పురస్కారంతో ఆయనను గౌరవించింది. ఆయన ఆట, శైలీ చూసేందుకు అప్పుడు మనం లేము. ఇప్పుడు చూసేందుకు ఆ కాలంలో వీడియో కవరేజీలు లేవు. ఏమున్నా బ్లాక్ అండ్ వైట్ ఫొటోలే! అందుకే 'కంటెంట్' ఉన్నా... కటౌట్‌కు ఎక్కలేకపోయారు. ఈయన సేవల్ని అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) కూడా గుర్తించింది.

### క్రీడాలోకం అశ్రునివాళి...

బెనర్జీ సేవల్ని కొనియాడిన భారత క్రీడారంగం ఆయన లేని లోటు పూడ్చలేనిదని నివాళులర్పించింది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్, బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా, టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్ తదితరులు సంతాపం వెలిబుచ్చారు.





# మొనాకో గ్రాండ్‌ప్రి రద్దు

- 1954 తర్వాత తొలిసారి రేసుకు బ్రేక్
- కోవిడ్–19 నేపథ్యంలో నిర్ణయం



**పారిస్:** ఫార్ములావన్ (ఎఫ్1) క్యాలెండర్‌లో 65 ఏళ్లుగా నిర్విరామంగా జరుగుతోన్న విఖ్యాత వీధి రేసు మొనాకో గ్రాండ్‌ప్రి రద్దయింది. ప్రస్తుతం కరోనా (కోవిడ్–19) యూరప్‌లో విలయతాండవం చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మే 24న ఈ రేసు జరగాల్సి ఉంది. దాంతో ఈ ఏడాది ఎఫ్1 సీజన్‌లో రద్దయిన రెండో రేసుగా మొనాకో నిలిచింది. 1929లో ఎఫ్1 క్యాలెండర్‌లో అరంగేట్రం చేసిన ఈ రేసు చివరిసారిగా 1954లో జరగలేదు. ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి (జీపి)తో గత వారమే ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్ ఘనంగా ఆరంభమవ్వాల్సి ఉండగా ... కరోనా కారణంతో తొలి రేసును రద్దు చేశారు. అనంతరం ఈ ఆదివారం జరగాల్సిన బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి, ఏప్రిల్‌లో జరగాల్సిన వియత్నాం, చైనీస్ రేసులను కూడా వాయిదా వేస్తూ అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) నిర్ణయం తీసుకుంది. దాంతో 2020 సీజన్ మే 1న డచ్ గ్రాండ్‌ప్రితో ఆరంభమవుతుందని భావించారు. అయితే డచ్ గ్రాండ్‌ప్రి రేసును, మే 8న జరగాల్సిన స్పెయిన్ గ్రాండ్‌ప్రి రేసును కూడా వాయిదా వేస్తున్నట్లు రేసు నిర్వాహకులు తెలిపారు. దీంతో ప్రస్తుత సీజన్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎఫ్1 నిర్వాహకులు మాత్రం జూన్ 7న జరగాల్సిన అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రితో సీజన్ ఆరంభమవుతుందనే విశ్వాసంతో ఉన్నారు.

## స్కాట్లాండ్ క్రికెటర్ మాజిద్‌కు కోవిడ్–19 పాజిటివ్



**లండన్:** పాకిస్తాన్ సంతతికి చెందిన స్కాట్లాండ్ క్రికెటర్, ఆఫ్ స్పిన్నర్ మాజిద్ హక్‌కు కోవిడ్–19 వైరస్ సోకింది. 37 ఏళ్ల మాజిద్ స్వయంగా ఈ విషయాన్ని శుక్రవారం ట్విట్టర్ ద్వారా ప్రకటించాడు. ప్రస్తుతం తాను స్కాట్లాండ్ రాజధాని గ్లాస్గోలోని రాయల్ అలెగ్జాండ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నానని... త్వరలోనే పూర్తి స్థాయిలో కోలుకొని ఇంటికి తిరిగి వస్తానని అతను ఆశాభావం వ్యక్తం చేశాడు. మాజిద్ 2006 నుంచి 2015 వరకు స్కాట్లాండ్ తరఫున 54 వన్డేలు, 21 టి20 మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 60 వికెట్లు... టి20ల్లో 28 వికెట్లు తీశాడు. ఆస్ట్రేలియా–న్యూజిలాండ్ ఆతిథ్యమిచ్చిన 2015 వన్డే ప్రపంచ కప్‌లో చివరిసారి స్కాట్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించిన మాజిద్ ప్రస్తుతం స్కాట్లాండ్ దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్నాడు.

## వెలవెలబోయిన 'జ్యోతి' స్వాగత వేడుకలు



**హిగషిమత్సుషిమా (జపాన్):** అసలు టోక్యో ఒలింపిక్స్ జరుగుతాయా? జరుగవా? అనే సందేహాల మధ్య 'ఒలింపిక్స్ జ్యోతి' ప్రభ రోజురోజుకీ తగ్గిపోతోంది. ఏథెన్స్‌లో జ్యోతి రిలే కార్యక్రమం తూతూ మంత్రంగా జరుగగా... జపాన్‌లోనూ స్వాగత వేడుకలు నామమాత్రంగానే నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక విమానంలో ఒలింపిక్ జ్యోతి ఏథెన్స్ నుంచి ఉత్తర జపాన్‌లోని మిత్సుషిమ ఎయిర్‌బేస్‌కు చేరుకుంది. అయితే కరోనా కారణంగా స్వాగత వేడుకలకు రావాల్సిన 200 మంది పాఠశాల విద్యార్థులను ఆహ్వానించలేదు. దీంతో అతికొద్ది మంది అధికారులు, మాజీ ఒలింపిక్ చాంపియన్స్ సయోరి యోషిదా (రెజ్లింగ్), టడాహిరో నోమురా (జూడో) మాత్రమే వేడుకలో పాల్గొన్నారు. దాంతో ఈ కార్యక్రమం కళ తప్పినట్లయింది. ఒకవైపు కోవిడ్–19 వైరస్ ఆందోళన కలిగిస్తున్నా... టోక్యో ఒలింపిక్స్‌ను షెడ్యూల్ ప్రకా రం ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు థామస్ బాచ్ అన్నారు.



# కమల్‌నాథ్ రాజీనామా

## బలపరీక్షకు ముందే తప్పుకున్న మధ్యప్రదేశ్ సీఎం



భోపాల్‌లో భేటీ సందర్భంగా మాట్లాడుతున్న శివరాజ్‌సింగ్, కమల్‌నాథ్

**భోపాల్:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ తన పదవికి రాజీనామా చేశారు. బలపరీక్షకు ముందే మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి కమల్‌నాథ్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ లాల్జీ టాండన్‌కి కమల్‌నాథ్ తన రాజీనామా పత్రాన్ని సమర్పించినట్టు రాజ్‌భవన్ అధికారులు వెల్లడించారు. దీంతో గత కొద్దిరోజులుగా మధ్యప్రదేశ్‌లో నెలకొన్న నాటకీయ పరిణామాలకు తెరపడింది. కమల్ నాథ్ రాజీనామాతో 15 నెలల కాంగ్రెస్ పాలన అర్ధాంతరంగా ముగిసే పరిస్థితి ఏర్పడింది. 22 మంది శాసనసభ్యుల రాజీనామా చేయడంతో బలపరీక్షకు సుప్రీంకోర్టు శుక్రవారం సమయమిచ్చింది. కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్‌పార్టీ శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు అసెంబ్లీలో తన మెజారిటీ నిరూపించుకోవాల్సిందిగా సుప్రీంకోర్టు గడువునిచ్చిన మరునాడే కమల్‌నాథ్ రాజీనామాకు ఉపక్రమించారు.

గవర్నర్‌కి సమర్పించిన రాజీనామా పత్రంలో 'నా 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజాస్వామిక విలువలతో కూడిన, స్వచ్ఛమైన రాజకీయాలు నెరపాను. వాటికే ప్రాముఖ్యతనిచ్చాను. ఐతే గత రెండు వారాల్లో ప్రజాస్వామ్య విలువలకు స్వస్తిపలికే సరికొత్త అధ్యాయానికి బీజేపీ తెరతీసింది' అని కమల్‌నాథ్ ఆరోపించారు. గవర్నర్‌కి రాజీనామా సమర్పించిన కమల్‌నాథ్ మధ్యప్రదేశ్‌కి కాబోయే నూతన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి తన తోడ్పాటునందిస్తానని తెలిపారు. ఈ రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కి అందజేయడానికి ముందు కమల్‌నాథ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్రపన్ని ప్రజాస్వామిక విలువలను ఖూనీ చేసిందని ఆరోపించారు. మధ్యప్రదేశ్ రాజకీయ సంక్షోభానికి జ్యోతిరాదిత్య సింధియా కారకుడంటూ నిందించారు. జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడంతో ఆయనకు అనుకూలంగా 22 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు తమ పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు బలపరీక్షకు సిద్ధం కమ్మంటూ సుప్రీం కోర్టు కమల్‌నాథ్ ప్రభుత్వానికి గురువారం గడువునిచ్చింది. 230 మంది సభ్యులున్న మధ్యప్రదేశ్ శాసనసభలో 16 మంది కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ప్రజాపతి ఆమోదించడంతో కమల్‌నాథ్ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయింది. విశ్వాసపరీక్ష కోసం మధ్యాహ్నం రెండు గంటలకు మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశమైంది. కమల్‌నాథ్ రాజీనామాతో రాష్ట్ర అసెంబ్లీ వాయిదాపడింది. ఒంటిగంట ప్రాంతంలో కమల్‌నాథ్ గవర్నర్‌కి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటుచేసినట్టు తెలిపిన స్పీకర్ ఎన్.పి. ప్రజాపతి, కమల్‌నాథ్ రాజీనామాతో ఆ ఆవశ్యకత లేదని వెల్లడించారు.

### జనతా కర్ఫ్యూని పాటించండి

- శివరాజ్ సింగ్ ప్రకటన
- తానే సీఎం అన్న సూచనా?

**భోపాల్:** మధ్యప్రదేశ్ కాబోయే ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహానే అని సూచనప్రాయంగా తెలుస్తోంది. ప్రధాని పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూని పాటించండంటూ చౌహాన్ ప్రజలను కోరడం ఆ అభిప్రాయాన్ని బలపరుస్తోంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ రాజీనామా లేఖను గవర్నర్‌కి సమర్పించిన అనంతరం శివరాజ్ సింగ్ చౌహాన్ విలేకరులతో మాట్లాడారు. కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో భాగంగా ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ప్రజలంతా ఇళ్లకు పరిమితం కావాలనీ, ఎవ్వరూ బయటకు రాకూడదనీ, జనతా కర్ఫ్యూ పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని పిలుపుని ప్రజలంతా పాటించాలంటూ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజలను కోరారు. అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కమల్‌నాథ్ ప్రభుత్వం కుప్పకూలిందనీ, అందులో బీజేపీ పాత్ర లేదన్నారు. అయితే తమ పార్టీ శాసనసభ్యులకు బీజేపీ డబ్బులు ఎరగా వేసిందని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌కి ఎవరు సీఎం కావాలనే విషయంలోనూ చౌహాన్‌కీ, మిశ్రాకీ విభేదాలున్నాయని దిగ్విజయ్ అన్నారు.

## మరో 5 ఐఐఐటీలకు జాతీయ ప్రాధాన్య హోదా

**లోక్‌సభలో బిల్లుకు ఆమోదం**

**న్యూఢిల్లీ:** జాతీయ ప్రాధాన్య సంస్థ (ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) హోదాను మరో ఐదు ఐఐఐటీలకు కల్పిస్తూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఐదు ఐఐఐటీలను పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్) చట్టం–2017 కిందకు తీసుకొచ్చే ఉద్దేశంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) చట్టం (సవరణ) బిల్లు–2020ను తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ జాబితాలో 15 ఐఐఐటీలు ఉన్నాయి. సూరత్, భోపాల్, భాగల్‌పూర్, అగర్తలా, రాయ్‌చూర్‌లతో ఉన్న ఐఐఐటీలకు తాజాగా జాతీయ ప్రాధాన్య హోదా ఇచ్చారు. దీంతో ఈ సంస్థల్లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ డిగ్రీలను అందించే వెసులుబాటు కలుగుతుంది. ఐటీ రంగంలో నూతన పరిశోధనలు చేసేందుకు అవసరమైన విద్యార్థులు చేరే అవకాశం ఉంటుంది. ఇలాంటి విద్యాసంస్థల్లో 100 శాతం ప్లేస్‌మెంట్లు కల్పించిన రికార్డు ఉందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి రమేశ్ పోఖ్రియాల్ లోక్‌సభలో పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో నాణ్యత పెరుగుతోందని, దేశం పరిశోధనలు, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు.

# పీటర్ ముఖర్జియా విడుదల



**ముంబై:** 2012నాటి సంచలన షీనా బోరా హత్య కేసులో గత నాలుగేళ్లుగా జైల్లో ఉంటున్న పీటర్ ముఖర్జియాకు శుక్రవారం విడుదల అయ్యారు. బాంబే హైకోర్టు ఆయనకు ఫిబ్రవరిలోనే బెయిల్ ఇచ్చినప్పటికీ.. ఈ కేసును విచారిస్తున్న సీబీఐ అప్పీల్ చేసుకునేందుకు వీలుగా ఆరువారాల పాటు ఆ బెయిల్ ఉత్తర్వులపై స్టే విధించింది. ఆ స్టే గడువు గురువారంతో ముగిసింది. సీబీఐ అప్పీల్ చేసుకోకపోవడంతో ఆయన శుక్రవారం విడుదల అయ్యారు. సొంత కూతురు హత్యకు సంబంధించిన ఈ కేసులో ముఖర్జియా మాజీ భార్య ఇంద్రాణి ముఖర్జియా ప్రధాన ముద్దాయి. పీటర్ ముఖర్జియా ఈ నేరంలో పాలు పంచుకున్నట్లుగా ప్రాథమికంగా ఎలాంటి ఆధారాలు లేవని బెయిల్ ఉత్తర్వుల్లో బొంబాయి హైకోర్టు వ్యాఖ్యానించింది.

## అఫ్గాన్‌లో భద్రతా దళాల స్థావరంపై దాడిలో 24 మంది మృతి

**కాబుల్:** అఫ్గానిస్తాన్ భద్రతా బలగాలపై కొందరు వ్యక్తులు దాడులు జరిపారు. దక్షిణ అఫ్గాన్‌లోని జాబుల్‌లో ఉన్న స్థావరంపై శుక్రవారం జరిగిన ఈ దాడుల్లో భద్రతా దళాలకు చెందిన 24 మంది మృతి చెందారు. భద్రతా దళాలు నిద్రిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు సైనికులపై దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ అధికారులు వివరించారు. ఈ ఘటనలో అఫ్గాన్ ఆర్మీ దళానికి చెందిన 14 మంది, 10 మంది పోలీసులు మరణించినట్లు తెలిపారు. మరో నలుగురు అధికారుల జాడ తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

# ఆ ఆరుగురి పాపమే!

**న్యూఢిల్లీ:** డిసెంబర్ 16, 2012.. దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున కదులుతున్న బస్సులో ఢిల్లీ మెడికో విద్యార్థిని నిర్భయపై జరిగిన దారుణం అత్యంత హేయమైనది. నిర్భయపై అత్యాచారం చేసి, ఆ తర్వాత ఆమెని, ఆమె స్నేహితుడ్ని ఐరన్ రాడ్‌లతో రక్తాలు కారేలా చితకబాది కదులుతున్న బస్సులోంచే బయటపడేసిన అకృత్యమది. ఏడేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనతో యావత్ జాతి కదలిపోయింది. నిర్భయ దోషులకు తగిన శాస్తి జరిగే వరకు పోరాడతామని ఎలుగెత్తి చాటింది. నిర్భయ తల్లిదండ్రులు, రేపిస్టులపై జాతి యావత్తు చేసిన పోరాటం నలుగురి ఉరితీతతో ముగిసింది. ఈ నేరం చేసిన ఆరుగురి వివరాలేంటో చూద్దాం

**రామ్‌సింగ్, ప్రధాన నిందితుడు :**



నిర్భయను అత్యంత దారుణంగా అత్యాచారం చేసిన బస్సు డ్రైవరే రామ్ సింగ్. దక్షిణ ఢిల్లీలో రవిదాస్ కేంప్ మురికివాడల్లో నివాసం ఉండే అతనే ఈ కేసులో ప్రధాన నిందితుడు. ఢిల్లీ పోలీసులు రామ్‌సింగ్‌ను తొలుత అదుపులోకి తీసుకున్నారు. రామ్‌సింగ్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే అతని సోదరుడు ముఖేష్ సింగ్ సహా మిగిలిన అయిదుగురిని అరెస్ట్ చేశారు. కేసు విచారణ కొనసాగుతుండగానే రామ్ సింగ్ 2013, మార్చి 10న జైలు గదిలోనే ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. మానసిక ఒత్తిడి తట్టుకోలేక అతను ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబితే, అతనిని హత్య చేశారంటూ అతని తల్లిదండ్రులు ఆరోపించారు.

**మైనర్:** అత్యంత హేయమైన ఈ నేరంలో ఒక మైనర్ ప్రమేయం కూడా ఉంది. నిర్భయను క్రూరంగా హింసించింది ఈ మైనరే. అతనిని ఆనంద్‌విహార్ ప్రాంతంలో మర్నాడు ఉదయం నిర్బంధించిన పోలీసులు జువైనల్ కోర్టులో హాజరు పరిచారు. నేర నిర్ధారణ కావడంతో మూడేళ్లు రిమాండ్ హోమ్‌కి తరలించారు. మైనర్ అయినందున అతని వివరాలేవీ బయటకు వెల్లడించలేదు. మూడేళ్ల నిర్బంధం తర్వాత 2015 డిసెంబర్‌లో అతనిని విడుదల చేశారు.

### ఉరిశిక్ష అమలు చేసింది ఈ నలుగురికే

**ముఖేష్ సింగ్, బస్సు క్లీనర్**



తీహార్ జైల్లో ఉరి వేసుకొని చనిపోయిన బస్సు డ్రైవర్ రామ్ సింగ్ తమ్ముడే ముఖేష్ సింగ్ (32). దక్షిణ ఢిల్లీలోని మురికివాడల్లో సోదరుడితో కలిసి నివసించేవాడు. అత్యాచారం జరిగిన రాత్రి నిర్భయను, ఆమె స్నేహితుడిని ఐరన్ రాడ్‌తో చితకబాదాడని ముఖేష్‌పై అభియోగాలున్నాయి. నేరం జరిగాక ముఖేష్ సింగ్ అక్కడ నుంచి పరారయ్యాడు. పోలీసులు అతనిని రాజస్తాన్‌లోని కరోలిలో అదుపులోనికి తీసుకున్నారు. నిర్భయపై అత్యాచారం చేసినప్పుడు ఆమె ప్రతిఘటించలేదని బీబీసీ ఇండియా డాటర్ అనే డాక్యుమెంటరీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖేష్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

**పవన్ గుప్తా, పండ్ల వ్యాపారి**



పవన్ గుప్తా (25) పండ్ల వ్యాపారి. అతను కూడా రవిదాస్ మురికివాడల్లోనే నివాసం ఉంటాడు. డిసెంబర్ 16 మధ్యాహ్నం తప్ప తాగాడు. ఆ తర్వాత అన్నం తిని మద్యం మత్తులోనే బయటకు వెళ్లాడు. నిర్భయ దుర్ఘటన జరిగినప్పుడు బస్సు దరిదాపుల్లో కూడా లేడని పవన్ కుటుంబ సభ్యులు చెప్పారు. కానీ పవన్ గుప్తా ఫోన్ కాల్ డేటా పరిశీలిస్తే అతను నేరం జరిగిన సమయంలో బస్సులోనే ఉన్నాడని బయటపడింది.

**వినయ్ శర్మ, జిమ్ ట్రైనర్**



వినయ్‌శర్మ (26) కూడా రవిదాస్ మురికివాడల్లో నివసించే వాడు. అతను ఫిట్‌నెస్ ట్రైనర్. ఒక జిమ్‌లో అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. ప్రాథమిక విద్య అభ్యసించాడు. ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడగలడు. పోలీసులు అతనిని జిమ్ బయటే అదుపులోనికి తీసుకున్నారు. నేరం జరిగిన సమయంలో తాను బస్సు దగ్గర లేనని, ఒక సంగీత కార్యక్రమానికి హాజరవడానికి వెళ్లానని వినయ్ శర్మ పదే పదే చెప్పుకున్నాడు. 2016లో ఒకసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు కానీ జైలు అధికారులు అతనిని కాపాడారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా జైలు గోడలకి తలని బాదుకొని గాయపరుచుకున్నాడు.

**అక్షయ్ ఠాకూర్, స్కూల్ డ్రాపవుట్**



అక్షయ్ ఠాకూర్ (31) బీహార్ వాసి. నిర్భయను అత్యాచారం చేసిన బస్సులో హెల్పర్‌గా ఉన్నాడు. స్కూల్ డ్రాపవుట్ అయిన అక్షయ్ 2011లో బీహార్ నుంచి ఢిల్లీకి వచ్చాడు. నేరం చేయడమే కాదు సాక్ష్యాధారాల్ని కూడా నాశనం చేయడానికి ప్రయత్నించాడు. నేరం జరిగిన అయిదు రోజుల తర్వాత అక్షయ్‌ని బీహార్‌లో అతని స్వగ్రామం తాండ్వాలో పోలీసులు అరెస్ట్ చేశారు. అక్షయ్ భార్య తన కుమారుడితో కలిసి బీహార్‌లోనే ఉంటోంది. ఉరితీతకు మూడు రోజుల ముందు అతను రెండోసారి రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. అక్షయ్ ఉరి శిక్షకు ముందు తాను వితంతువుగా జీవితాంతం బతకనని, తనకి విడాకులు ఇప్పించాలని కోరుతూ అతని భార్య కోర్టుకెక్కింది.

సాక్షి బిజినెస్
శనివారం
21-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 1,628 ▲ | 482 ▲ |
| 29,916 | 8,745 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,155 | ▲ 6 |
| డోజోన్స్ | 19,961 | ▼ 126 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 5,191 | ▲ 39 |
| డాక్స్ | 8,929 | ▲ 319 |
| షాంఘై | 2,746 | ▲ 43 |
| నికాయ్ | 16,552 | ▼ 174 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 74.07 | 75.73 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 85.51 | 88.60 |
| € | యూరో | ఎస్‌బీఐ | 78.96 | 81.86 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 66.75 | 69.19 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 43.00 | 45.06 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.80 | 52.50 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 19.00 | 20.87 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.14 | 21.78 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.49 | 11.26 |

# 4 రోజుల నష్టాలకు బ్రేక్

- కోవిడ్ వైరస్ కల్లోలం కొనసాగుతోంది...
- అయినా స్టాక్ మార్కెట్లో ర్యాలీ
- ఉద్దీపనలతో పెరుగుతున్న ప్రపంచ మార్కెట్లు
- మన దగ్గరా ఉద్దీపన చర్యలపై ఆశలు
- షార్ట్ కవరింగ్ కొనుగోళ్ల జోరు..
- ఇది టెక్నికల్ ర్యాలీయే అంటున్న నిపుణులు
- 1,628 పాయింట్ల లాభంతో 29,916కు సెన్సెక్స్
- 482 పాయింట్లు పెరిగి 8,745కు నిఫ్టీ



కోవిడ్–19 (కరోనా) వైరస్ కల్లోలాన్ని కట్టడి చేయడానికి వివిధ కేంద్ర బ్యాంక్‌లు చర్యలు తీసుకుంటుండటంతో ప్రపంచ మార్కెట్లతో పాటే మన మార్కెట్ కూడా శుక్రవారం లాభపడింది. దీంతో నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. కరోనా ఉత్పాతాన్ని ఎదుర్కొనడానికి ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఉద్దీపన చర్యలు ఉంటాయనే అంచనాలు కూడా సానుకూల ప్రభావం చూపించాయి. గురువారం 75 మార్కును చేరిన డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు పుంజుకోవడం కలిసి వచ్చింది. మరోవైపు ఇది పూర్తిగా టెక్నికల్ ర్యాలీయేనని, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జోరుగా సాగాయని కొంతమంది నిపుణులంటున్నారు. అయితే ట్రేడింగ్ ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగింది. ఒక దశలో 355 పాయింట్లు పతనమై, 2,130 పాయింట్లకు ఎగసిన సెన్సెక్స్ చివరకు 1,628 పాయింట్లు పెరిగి 29,916 పాయింట్ల వద్ద ముగిసింది. శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 5.75 శాతం, నిఫ్టీ 5.83 శాతం చొప్పున లాభపడ్డాయి. ఆరు నెలల కాలంలో ఒక్క రోజులో ఈ సూచీలు ఇన్ని పాయింట్లు పెరగడం ఇదే మొదటిసారి. అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి. వారం పరంగా చూస్తే, సెన్సెక్స్ 4,188 పాయింట్లు, నిఫ్టీ 1,210 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. శాతం పరంగా చూస్తే, ఈ రెండు సూచీలు చెరో 12 శాతం మేర నష్టపోయాయి. సూచీలు వరుసగా ఐదో వారమూ నష్టపోయాయి.

> స్టాక్ మార్కెట్ భారీ లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.6.32 లక్షల కోట్లు పెరిగింది.
>
> **రూ. 6.32 లక్షల కోట్లు పెరిగిన సంపద**
>
> ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.6.32 లక్షల కోట్లు ఎగసి రూ.116.1 లక్షల కోట్లకు పెరిగింది.

ఇక ప్రపంచ మార్కెట్లన్నీ లాభాల్లోనే ముగిశాయి. షాంఘై, హాంగ్ కాంగ్, సియోల్ సూచీలు 7% మేర లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 5% లాభాల్లో ఆరంభమయ్యాయి.

**లాభాల్లో కోవిడ్ ఔషధ షేర్లు**

కోవిడ్–19 చికిత్సలో హైడ్రోక్లోరోక్వినైన్ ప్రభావవంతంగా పనిచేస్తోందన్న వార్తల కారణంగా ఈ ఔషధాన్ని తయారు చేసే కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. క్యాడిలా హెల్త్‌కేర్ 16 శాతం లాభంతో రూ.285కు, ఇప్కా ల్యాబ్స్ 9 శాతం లాభంతో రూ.1,372కు, టొరెంట్ ఫార్మా 4 శాతం లాభంతో రూ.1,846కు పెరిగాయి.

- ఓఎన్‌జీసీ 19 శాతం లాభంతో రూ.72 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. అల్ట్రాటెక్ సిమెంట్, 13 శాతం, హిందుస్తాన్ యూనిలీవర్ 12 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 11 శాతం, టీసీఎస్ 10 శాతం, టాటా స్టీల్ 10 శాతం, ఏషియన్ పెయింట్స్ 9 శాతం చొప్పున లాభపడ్డాయి.
- సెన్సెక్స్ 30 షేర్లలో రెండు షేర్లు– హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లు మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 28 షేర్లు లాభపడ్డాయి.
- నిఫ్టీలోని 50 షేర్లలో నాలుగు షేర్లు–హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్,, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్‌లు మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 46 షేర్లు లాభాల్లో ముగిశాయి.
- భారతీ ఇన్‌ఫ్రాటెల్ 23 శాతం లాభంతో రూ.152 వద్ద ముగిసింది. నిఫ్టీ షేర్లలో అత్యధికంగా పెరిగిన షేర్ ఇదే.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 11 శాతం లాభంతో రూ.1,020 వద్ద ముగిసింది. దీంతో ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.65,358 కోట్లు పెరిగి రూ.6,46,732 కోట్లకు పెరిగింది.

### టెక్నికల్ ర్యాలీ.. జాగ్రత్త!

కోవిడ్ కల్లోలం తగ్గకపోయినా స్టాక్ మార్కెట్ ర్యాలీ జరపడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ ర్యాలీ కొనసాగింపుపై అపనమ్మకం వ్యక్తం చేస్తున్న నిపుణులు అప్రమత్తంగా ఉండాలని ఇన్వెస్టర్లను హెచ్చరిస్తున్నారు. ఫండమెంటల్స్ పరంగా ఎలాంటి మార్పుల్లేకపోయినా, కేవలం టెక్నికల్స్ కారణంగానే ఈ ర్యాలీ చోటు చేసుకుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్ వినోద్ నాయర్ చెప్పారు. మార్కెట్ రికవరీ మొదలైందని భావించి, ఇప్పుడే కొనుగోళ్లకు దిగవద్దనేది నిపుణుల సూచన.

### రూపాయి.. కొత్త కనిష్టం



ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ మారకంలో రూపాయి విలువ వరుసగా రెండవరోజు శుక్రవారం మరో 'చరిత్రాత్మక' కనిష్టానికి పడిపోయింది. గురువారం ముగింపుతో పోల్చితే 8 పైసలు బలహీనపడి 75.20కి పడిపోయింది. ఈ స్థాయిని ఎప్పుడూ రూపాయి చూడలేదు. ఇంట్రాడేలో రూపాయి గురువారం తరహాలోనే 75.30ని తాకింది. రూపాయి క్రితం ముగింపు 75.12.

**ఆరు నెలల కనిష్టానికి విదేశీ మారకపు నిల్వలు...**

భారత్‌లో విదేశీ మారకపు నిల్వలు మార్చి 13తో ముగిసిన వారంలో 6 నెలల కనిష్ట స్థాయి 481.89 డాలర్లకు పడిపోయాయి. వారంవారీగా 5.35 బిలియన్ డాలర్లు తగ్గాయి. మార్చి 6తో ముగిసిన వారంలో విదేశీ మారకపు నిల్వలు రికార్డు స్థాయిలో 487.23 బిలియన్ డాలర్లకు చేరాయి.

## షార్ట్ సెల్లింగ్... ఒకింత కఠినం!

**న్యూఢిల్లీ:** స్టాక్ మార్కెట్లో చోటు చేసుకుంటున్న తీవ్రమైన ఒడిదుడుకులను నివారించేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ నడుం బిగించింది. మ్యూచువల్ ఫండ్స్, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు జరిపే షార్ట్ సెల్లింగ్‌పై పరిమితులను విధించడం ద్వారా ఒడిదుడుకులను తగ్గించే ప్రయత్నాలు చేస్తోంది. డెరివేటివ్స్ సెగ్మెంట్లోని షేర్ల మార్కెట్ వైడ్ పొజిషన్ల పరిమితిని సవరించింది. డైనమిక్ ప్రైస్‌బాండ్లలో సరళీకరణతో సహా మరి కొన్ని మార్పులు, చేర్పులు చేసింది. సోమవారం (ఈ నెల 23) నుంచి నెల రోజుల పాటు ఈ మార్పులు, చేర్పులు అమల్లో ఉంటాయని పేర్కొంది. సెబీ తాజా నిర్ణయాల కారణంగా ఇంట్రాడేలో షార్టింగ్ చేసే వారిపై ప్రభావం పడుతుందని నిపుణులంటున్నారు. ఒడిదుడుకులు ఒకింత తగ్గుతాయని వారంటున్నారు. వివరాలు....



- డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో లేని షేర్లకు క్యాష్ మార్కెట్లో మార్జిన్‌ను 40 శాతం వరకూ పెంచింది.
- ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్ ఓ) సెగ్మెంట్లోని షేర్ల మార్కెట్ వైడ్ పొజిషన్ లిమిట్(ఎమ్‌డబ్ల్యూపీఎల్) ప్రస్తుతమున్న స్థాయి నుంచి 50 శాతం మేర తగ్గించింది.
- ఏదైనా ఒక షేర్ ఎమ్‌డబ్ల్యూపీఎల్ యుటిలైజేషన్ 95 శాతం మేర మించితే, ఈ షేర్‌పై నిషేధం విధిస్తారు.
- డెరివేటివ్స్ సెగ్మెంట్‌లోని షేర్లలో డైనమిక్ ప్రైస్ బాండ్లలో మార్పులు, చేర్పులు చేసింది.
- మ్యూచువల్ ఫండ్స్, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు, ట్రేడింగ్ మెంబర్స్(ప్రొప్రయిటరీ), క్లయింట్లు షార్ట్ పొజిషన్లపై పరిమితులు విధించింది.
- ఇండెక్స్ డెరివేటివ్స్‌లో ఈ సంస్థల షార్ట్ పొజిషన్లు, వాటి నోషనల్ వేల్యూలో మించకుండా ఉండాలి.
- నగదు, ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లులు, ఇలాంటి సాధనాల్లో ఈ సంస్థల హోల్డింగ్స్‌ను మించి ఇండెక్స్ డెరివేటివ్స్‌లో ఈ సంస్థల లాంగ్ పొజిషన్లు ఉండకూడదు.

### షార్ట్ సెల్లింగ్ అంటే....

షార్ట్ సెల్లరు–భవిష్యత్తులో ధర తగ్గుతుందనే అంచనాలతో తమ వద్ద షేర్లు లేకపోయినా, వాటిని ఇతరులకు విక్రయిస్తారు. దీని కోసం కొంత మార్జిన్‌ను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద ఉంచుతారు. వారి అంచనాలకనుగుణంగానే ధర తగ్గగానే ఆ షేర్లను కొనుగోలు దారులకు డెలివరీ చేస్తారు. ధరల తేడా కారణంగా షార్ట్ సెల్లర్లు లాభపడతారు. దీంట్లో రిస్క్ అధికంగా, లాభాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. వారి అంచనాలకనుగుణంగానే ధర తగ్గకుండా, పెరిగిపోతే, ఆ మేరకు వారికి భారీగా నష్టాలు వస్తాయి.

## జీఎంఆర్ చేజారిన నాగ్‌పూర్ ఎయిర్‌పోర్ట్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** నాగ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి ప్రాజెక్టు జీఎంఆర్ చేజారింది. బిడ్డింగ్ ప్రక్రియను మహారాష్ట్ర ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కంపెనీకి చెందిన మిహాన్ ఇండియా (మల్టీ మోడల్ ఇంటర్నేషనల్ కార్గో హబ్ అండ్ ఎయిర్‌పోర్ట్ – నాగ్‌పూర్) రద్దు చేసింది. నాగ్‌పూర్ విమానాశ్రయం అభివృద్ధి, ఆధునీకరణ, కార్యకలాపాలు, నిర్వహణ పనులను జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ గతంలోనే దక్కించుకుంది. ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రారంభించేలోపే మహారాష్ట్రలో ఎన్నికలు వచ్చాయి. దీంతో నిర్మాణ పనులను కంపెనీ ఆపింది. ప్రస్తుతం అక్కడ ప్రభుత్వం మారింది. కాగా, మిహాన్ నిర్ణయంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని జీఎంఆర్ శుక్రవారం బీఎస్‌ఈకి వెల్లడించింది.

## రాణా జుడీషియల్ కస్టడీ పొడిగింపు



**ముంబై:** యస్‌బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్ జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 2 వరకూ కోర్టు పొడిగించింది. వివరాల్లోకి వెళితే, అక్రమ ధనార్జనా నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద అరెస్టయిన 62 సంవత్సరాల కపూర్ జ్యుడీషియల్ కస్టడీ శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆయనను ఇక్కడి కోర్టు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హాజరుపరిచింది. రిమాండ్‌ను పొడిగించాలని ఈడీ కోరలేదు. అయితే మరో కేసులో కపూర్‌పై ఉన్న వారంట్‌ను సీబీఐ కోర్టుకు సమర్పించింది. దీనితో ఆయన జ్యుడీషియల్ రిమాండ్‌ను ఏప్రిల్ 2 వరకూ కోర్టు పొడిగించింది. కోర్టుకు హాజరుపరచిన సందర్భంగా న్యాయమూర్తి అడిగిన ఒక ప్రశ్నకు కపూర్ సమాధానం చెబుతూ, గడచిన ఏడేళ్లుగా తాను ఆస్తమాతో బాధపడుతున్నట్లు తెలిపారు. తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నట్లూ పేర్కొన్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నందున రాణా కపూర్‌కు తేలిగ్గా కరోనా వైరస్ సోకే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆయన న్యాయవాది కోర్టుకు విన్నవించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు తగిన అన్ని వైద్య చర్యలూ తీసుకోవాలని జైలు అధికారులను ఆదేశించింది.

**యస్ బ్యాంకులో అదనపు డైరెక్టర్లు:** యస్ బ్యాంకులో ఆర్‌బీఐ ఇద్దరు అదనపు డైరెక్టర్లను శుక్రవారం నియమించింది. ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ ఆర్. గాంధీ, ఎస్‌పీ జైన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న అనంత్ నారాయణ్‌లను అదనపు డైరెక్టర్లుగా నియమించినట్లు ప్రకటించింది.

## టెలికంకు సత్వర సాయం కావాలి

### పరిష్కారం చూపించాలని కోరిన సీవోఏఐ



**న్యూఢిల్లీ:** ''తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న టెలికం రంగానికి తగిన పరిష్కారం చూపించేందుకు అందుబాటులో ఉన్న సాధనాలను వినియోగించుకోవాలని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ/ టెలికం కంపెనీల అసోసియేషన్) కోరింది. ఎటువంటి ఉపశమన ప్యాకేజీ కల్పించకపోతే ఎదురయ్యే పరిణామాల గురించి ప్రభుత్వానికి బాగానే తెలుసని పేర్కొంది. ''టెలికం పరిశ్రమకు అత్యవసరంగా సాయం అవసరం ఉంది. అందుకే ప్రభుత్వం తగిన పరిష్కారాలతో వెంటనే ముందుకు రావాలని కోరుతున్నాం'' అని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ ఎస్ మాథ్యూస్ పేర్కొన్నారు. సర్దుబాటు చేసిన ఆదాయం విషయంలో టెలికం కంపెనీలు స్వీయ మదింపు చేయడానికి వీల్లేదని, అసలు, వడ్డీ, పెనాల్టీలను తీర్పులో చెప్పిన విధంగా చెల్లించాల్సిందేనని సుప్రీంకోర్టు గత బుధవారం స్పష్టం చేసిన విషయం గమనార్హం. దీంతో టెలికం కంపెనీలు మరో విడత ప్రభుత్వ సాయం కోసం ఒత్తిళ్లు తీసుకురావడం మొదలు పెట్టాయి. టెలికం శాఖ (డీవోటీ) అంచనాల ప్రకారం భారతీ ఎయిర్‌టెల్, టెలినార్ (ఎయిర్‌టెల్‌లో విలీనమవడంతో)తో కలసి రూ.43,980 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.58,254 కోట్లు, టాటా టెలికం కంపెనీలు రూ.16,798 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉంది. అయితే భారతీ ఎయిర్‌టెల్ రూ.13,004 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.21,533 కోట్లు, టాటా టెలికం కంపెనీలు రూ.2,197 కోట్లు చెల్లించాలని టెలికం కంపెనీలు తమ స్వీయ మదింపులో తేల్చాయి.

## ఇంటి నుంచే పని..!

- కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం సూచన
- కరోనా వైరస్ కట్టడి చర్యల్లో భాగం
- ప్రభుత్వరంగ సంస్థల్లో సగం మంది ఇంటి నుంచే పని

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ నియంత్రణ పోరులో భాగంగా కంపెనీలు, ఎల్‌ఎల్‌పీ కింద నమోదైన సంస్థలు తమ ఉద్యోగులను వారి ఇళ్ల నుంచే పనిచేయించుకునే విధంగా తక్షణ కార్యాచరణను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. తాత్కాలిక చర్యల్లో భాగంగా మార్చి 31 వరకు దీన్ని అమలు చేయాలని కోరింది. కోవిడ్–19 వైరస్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధతను తెలియజేసే సీఏఆర్ పత్రాన్ని కంపెనీలు విధిగా ఫైల్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. సామాజిక దూరాన్ని ప్రోత్సహించడం ద్వారా కరోనా విస్తరణను అడ్డుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఇక కార్పొరేట్ కంపెనీలు బోర్డు సమావేశాలను వీడియో కాన్ఫరెన్స్, ఆడియో, విజువల్ విధానంలో జూన్ 30 వరకు నిర్వహించుకునేందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ అనుమతించింది.



**సగం మంది ఇంటి నుంచే..:** కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలన్నీ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల్లో సగం మందిని తప్పకుండా ఇంటి నుంచే పనిచేయించుకోవాలని ప్రభుత్వరంగ సంస్థల విభాగం ఆదేశించింది. కార్యాలయాలు, ప్లాంట్లు, యూనిట్లలో రద్దీని నివారించాలని సూచనలు చేసింది. ఈ ఆదేశాలను తక్షణమే అమల్లోకి తీసుకురావాలని, ఏప్రిల్ 4 వరకు అమల్లో ఉంటాయని పేర్కొంది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (99.9, 10గ్రా) | 41,580 | – |
| బంగారం (99.5, 10గ్రా) | 39,600 | – |
| వెండి (కిలో) | 40,200 | ▲ 1900 |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,500 | ▲ 700 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,520 | ▲ 730 |
| వెండి (కిలో) | 40,200 | ▲ 1900 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,200 | ▲ 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,800 | ▲ 270 |
| వెండి (కిలో) | 38,500 | ▲ 100 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,180 | – |
| బంగారం (22 క్యారెట్లు) | 39,250 | – |
| వెండి (కిలో) | 39,990 | – |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,500 | ▲ 650 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,520 | ▲ 730 |
| వెండి (కిలో) | 38,700 | ▲ 1800 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 21-3-2020

| | |
|---|---|
| విశాఖ | 260-00 |
| చిత్తూరు | 223-00 |
| వరంగల్ | 213-00 |
| విజయవాడ | 225-00 |
| గోదావరి | 225-00 |
| **20-3-2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 210-00 |

# త్వరలో ఆర్థిక ప్యాకేజీ ప్రకటిస్తాం

## ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ప్రభావం కారణంగా సమస్యలను ఎదుర్కొంటున్న రంగాలకు ఆర్థిక ప్యాకేజీని వీలైనంత త్వరలో ప్రకటిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం భరోసానిచ్చారు. అయితే, ఇందుకు ఎన్ని రోజులు పడుతుందన్న వివరాలను ఆమె వెల్లడించలేదు. పౌర విమానయానం, పర్యాటకం, ఎంఎస్‌ఎంఈ, పశుసంవర్ధక శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి సీతారామన్ ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఆయా శాఖల నుంచి వచ్చిన డిమాండ్లపై విస్తృతంగా చర్చించినట్టు మంత్రి తెలిపారు. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు శనివారం అంతర్గతంగా మరో సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రధాని ప్రకటించిన కోవిడ్–19 ఎకనమిక్ రెస్పాన్స్ టీమ్ ఇంకా ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. ఆర్థిక రంగానికి సంబంధించి ఉపశమన చర్యల గురించి మీడియా నుంచి ఎదురైన ప్రశ్నకు.. సెబీ ప్రకటించిన నియంత్రణ చర్యలు మార్కెట్లలో కొంత స్థిరత్వాన్ని తీసుకొస్తాయన్నారు. ప్రస్తుత స్థితిలో ప్రతీ ఒక్కరి నుంచి అభిప్రాయాలు తీసుకుని వాటిపై పూర్తి స్థాయిలో పనిచేస్తున్నట్టు చెప్పారు.



**పర్యాటకానికి గడ్డు పరిస్థితి**

''పర్యాటక రంగంపై ప్రభావం ఉన్న విషయం మన అందరికీ తెలుసు. ఈ రంగానికి వచ్చే నష్టాల గురించి పూర్తి అధ్యయనం అనంతరం ఏదైనా ప్యాకేజీ ప్రకటించే అంశాన్ని నిర్ణయిస్తాం'' అని పర్యాటక మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ తెలిపారు.

### ఆర్థిక సాయం అవసరం: క్రిసిల్

తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటున్న ఎయిర్‌లైన్స్, హోటల్స్, మాల్స్, మల్టీప్లెక్సులు, రెస్టారెంట్లు, రిటైలర్లకు స్వల్ప, మధ్యకాలిక ఆర్థిక సాయం వెంటనే అందించాలని క్రిసిల్ తన నివేదికలో కోరింది. చైనాలో కొత్తగా కరోనా కేసులు తగ్గుతున్న నేపథ్యంలో మే చివరినాటికి సరఫరా వ్యవస్థ సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని వివరించింది. ఇది జరక్కపోతే స్టీల్, జెమ్స్, జువెల్లరీ, కన్‌స్ట్రక్షన్, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ రంగాలూ కరోనా బారిన పడతాయని హెచ్చరించింది.

### నగదు రాక తగ్గింది..: ఫిక్కీ

దేశవ్యాప్తంగా కరోనా కారణంగా 50 శాతంపైగా కంపెనీల కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని ఫిక్కీ తెలిపింది. ఫిక్కీ నిర్వహించిన సర్వేలో 80 శాతం కంపెనీలు నగదు రాక తగ్గినట్టు తెలిపాయి. కరోనాతో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, డిమాండ్. సరఫరా దెబ్బతిందని ఫిక్కీ వివరించింది. ఉద్యోగుల వేతనాలు, వడ్డీ, రుణ చెల్లింపులపై ప్రభావం ఉంటుందని కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆర్‌బీఐ పాలసీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు తగ్గించాలని ఫిక్కీ కోరింది.

### జనతా కర్ఫ్యూలో 7 కోట్లకుపైగా...

ఆదివారం జరిగే జనతా కర్ఫ్యూలో తమ సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) తెలిపింది. 7 కోట్లకుపైగా వ్యాపార సంస్థలు మూతపడనున్నాయని సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. ఈ సంస్థల్లో పనిచేస్తున్న 40 కోట్ల మంది ఉద్యోగులు ఇళ్లకే పరిమితం అవుతారని చెప్పారు.

### నగదు సాయం చేయండి: సీఐఐ

పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పన్ను తగ్గింపులు, వడ్డీ రేట్ల కోతతోపాటు రూ.2 లక్షల కోట్ల ఆర్థిక ఉద్దీపన ప్రకటించాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరింది. వ్యాపారాలకు భారీ అంతరాయం రానుందని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ అన్నారు. కరోనా మూలంగా రియల్టీ, విమానయానం, పర్యాటక రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. 'ఆధార్ ఆధారంగా గ్రామీణ, పట్టణ నిరుపేదలకు ఒక్కొక్కరికీ రూ.5,000 నేరుగా వారి ఖాతాకు జమచేయాలి. బలహీన వర్గాలు, వృద్ధులకు రూ.10,000 అందించండి. వ్యక్తుల్లో ఆర్థిక భయాలను తొలగించేందుకు ఇది దోహదం చేస్తుంది' అని తన లేఖలో తెలిపారు.

**వేతనాలను తగ్గించుకోవాలి..**

వ్యయ భారం తగ్గేందుకు సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ స్థాయిలో వేతనాలను కుదించుకోవాలి అని చంద్రజిత్ సూచించారు. 'ప్రభుత్వం లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై 10 శాతమున్న పన్నును ఎత్తివేయాలి. టోటల్ డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్‌ను 25 శాతానికి చేర్చాలి. ఇన్వాయిస్‌ల ఆధారంగా కాకుండా బిల్లుల వసూళ్లపై మాత్రమే జీఎస్టీ అమలు చేయాలి' అని ఆయన పేర్కొన్నారు.

### బీఎస్ఎన్ఎల్ నెలరోజుల ఉచిత బ్రాడ్‌బ్యాండ్

**న్యూఢిల్లీ:** ఇంటి నుంచి పనిచేసుకోవాలంటే బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ అవసరం ఉంటుంది. ఆన్‌లైన్‌లో సమాచారం పంపడాలు, సంప్రదింపులు వంటివి చేసుకోవాల్సి ఉంటుంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఒక నెల రోజుల పాటు ఉచిత బ్రాడ్‌బ్యాండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ల్యాండ్‌లైన్ కస్టమర్లు అందరూ, నూతనంగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ తీసుకునే కస్టమర్లు నెల రోజుల పాటు ఉచిత సదుపాయాన్ని పొందొచ్చని కంపెనీ తెలిపింది. కొత్తగా కాపర్ కేబుల్ ఆధారిత కనెక్షన్ తీసుకునే వారు ఇన్‌స్టలేషన్ చార్జీలు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. కేవలం మోడెమ్ ఒకటి కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్ ఎంచుకుంటే మాత్రం ఇన్‌స్టలేషన్ చార్జీలు కూడా చెల్లించాల్సి ఉంటుంది.




### స్టార్ హెల్త్ నుంచి కరోనా రక్షణ పాలసీ

**ముంబై:** కరోనా వైరస్ (కోవిడ్–19) పాజిటివ్‌గా తేలి, హాస్పిటల్ పాలైన వారికి కవరేజీని అందించే పాలసీని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ సంస్థ తీసుకొచ్చింది. 'స్టార్ నోవెల్ కరోనా వైరస్' అనే పేరుతో వచ్చిన ఈ పాలసీలో 18–65 సంవత్సరాల వయసు వారు పాజిటివ్‌గా నిర్ధారణ అయితే, ఈ పాలసీ కింద ఏక మొత్తంలో పరిహారాన్ని కంపెనీ అందిస్తుంది. విదేశీ పర్యటన చరిత్ర ఉండకూడదన్న షరతులు ఈ పాలసీలో లేకపోవడం సానుకూలం. రూ.21,000 సమ్ ఇన్సూరెన్స్ పాలసీకి రూ.459 (జీఎస్టీ అదనం), రూ.42,000 సమ్ ఇన్సూరెన్స్ పాలసీకి రూ.918 (జీఎస్టీ అదనం) ప్రీమియంగా కంపెనీ నిర్ణయించింది. 18–65 సంవత్సరాల వయసున్న వారు ఎవరైనా కంపెనీ ఆన్‌లైన్ పోర్టల్‌కు వెళ్లి ఈ పాలసీని కొనుగోలు చేసుకోవచ్చు. ఎటువంటి ముందస్తు వైద్య పరీక్షలు అవసరం లేదు. అలాగే, అన్ని రెగ్యులర్ హెల్త్ పాలసీల్లో కోవిడ్19 చికిత్సకు కవరేజీ వర్తిస్తుందని కంపెనీ తెలిపింది.




వరంగల్‌లోని శ్రీ భద్రకాళి ఆలయం


హన్మకొండలోని వేయిస్తంభాల ఆలయం


నిర్మానుష్యంగా యాదగిరిగుట్ట రోడ్డు

## దర్శనాలు బంద్
### బోసిపోయిన ఆలయాలు

కరోనా వైరస్ వ్యాప్తిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పలు చారిత్రక ఆలయాల్లో శుక్రవారం నుంచి దర్శనాలు నిలిపివేశారు. ఈనెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, నిత్యకైంకర్యాలు, పూజలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. కాగా, దర్శనాలను నిలిపివేయడంతో వరంగల్ అర్బన్ జిల్లాలోని శ్రీభద్రకాళి, వేయిస్తంభాల ఆలయంతో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని ముక్తీశ్వర ఆలయం, భద్రాద్రి, యాదాద్రి ఆలయాలు బోసిపోయాయి.

— హన్మకొండ కల్చరల్/భద్రాచలం టౌన్/యాదగిరిగుట్ట

# ఉలిక్కిపడిన నల్లగొండ

**ఈ నెల 9న వియత్నాం నుంచి 12 మంది రాక**
- మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన ఇద్దరు గైడ్‌లు కూడా..
- కరోనా పరీక్షల కోసం హైదరాబాద్‌కు తరలింపు
- వారికి కరోనా లక్షణాలు లేవు: ఎస్పీ రంగనాథ్

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ/నల్లగొండ క్రైం:** నల్లగొండ జిల్లాలో 'కరోనా'కలకలం సృష్టించింది. వియత్నాం నుంచి 12 మంది మత బోధకులు జిల్లా కేంద్రానికి వచ్చినట్టు తెలియడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు వారిని గురువారం రాత్రి రెండు అంబులెన్సుల్లో హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం వారికి అక్కడి ఫీవర్ ఆస్పత్రిలో కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నారు. 'నల్లగొండ పట్టణంలోని జైల్‌ఖానా సమీపంలో ఒక ప్రార్థనా మందిరంలో వియత్నాం దేశానికి చెందిన 12 మందిని అదుపులోకి తీసుకున్నాం. వారికి కరోనా లక్షణాలు లేకున్నా.. ముందు జాగ్రత్తగా పరీక్షల కోసం హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రికి తరలించాం..'అని జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఈ వార్త శుక్రవారం ఉదయం వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వియత్నాం నుంచి వచ్చిన వారికి కరోనా వైరస్ ఉందా? లేదా? అనే విషయమై వైద్య పరీక్షలకోసం హైదరాబాద్‌కు తరలించామని, వారంతా ఉత్సాహంగా ఉన్నారని అధికార వర్గాలు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఇటీవలికాలంలో విదేశాల నుంచి వచ్చినవారు స్వీయ నియంత్రణ పాటించాలని, కనీసం పద్నాలుగు రోజుల పాటు ఇంటినుంచి బయటకు రాకుండా ఉండాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఈ మధ్య విదేశాలనుంచి వచ్చిన అరవై మంది జిల్లా వాసులను గుర్తించిన అధికారులు వారిపై నిఘా పెట్టి ఉంచారు.

**ఢిల్లీ టు నల్లగొండ వయా హైదరాబాద్..**

జిల్లా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీన వియత్నాంకు చెందిన 12 మంది ఢిల్లీకి వచ్చారు. మొదట ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజీ సెంటర్‌కు చేరుకున్న వారు.. ఆ కేంద్రంలో తమ వివరాలు నమోదు చేసుకున్నారు. తర్వాత మహారాష్ట్రకు చెందిన ఒకరిని, ఒడిశాకు చెందిన మరొకరిని గైడ్‌లుగా ఏర్పాటు చేసుకుని మొత్తం 14 మంది రైలు మార్గంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ నెల 9న హైదరాబాద్ నుంచి రైలు మార్గంలో ఆ బృందం నల్లగొండకు చేరుకుంది. 9 నుంచి 19వ తేదీ వరకు పట్టణంలోని జైల్‌ఖానా, పాతబస్తీ, మాన్యంచెల్క, మిర్యాలగూడ రోడ్డు ప్రార్థనా మందిరాల్లో వారు మత ఆచారాలను బోధించారు. వీరంతా మందిరాల్లోనే బస చేశారు.


నల్లగొండలోని ఓ ప్రార్థనామందిరంలో విచారణ జరుపుతున్న పోలీసులు

**మత బోధనల కోసం నల్లగొండకు..**

వియత్నాం నుంచి వచ్చిన బృందం మత బోధనలకోసం వచ్చినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా వారు మందిరానికి ప్రార్థనలకు రాని వారిని గుర్తించి వారి ఇళ్లకు కూడా వెళ్లి బోధించారని సమాచారం. కరోనా వైరస్ నేపథ్యంలో పోలీసులు ఇతర దేశాలనుంచి జిల్లాకు వచ్చిన వారి వివరాలు సేకరిస్తుండగా వీరి గురించి తెలిసింది.

**రిపోర్టుకోసం ఎదురుచూపులు**

ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఫీవర్ ఆస్పత్రిలో ఉన్న పన్నెండు మంది వియత్నాం దేశీయులు, మహారాష్ట్ర, ఒడిశాలకు చెందిన ఇద్దరు సహా పద్నాలుగు మంది మెడికల్ రిపోర్టుల కోసం జిల్లా అధికార యంత్రాంగం ఎదురుచూస్తోంది. ఒకవేళ వీరిలో ఎవరికైనా కరోనా లక్షణాలు ఉన్నట్లు తేలితే.. వియత్నాం బృందం ఎక్కడెక్కడ తిరిగింది? ఎవరెవరి ఇళ్లకు వెళ్లారు..? ఎవరెవరిని కలిశారు.. అన్న వివరాలు సేకరించి వారికి కూడా వైద్య పరీక్షలు జరిపిస్తామని జిల్లా వైద్య శాఖ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ బృందం సభ్యులు బస చేసిన, పర్యటించిన అన్ని మందిరాలను శుక్రవారం జిల్లా వైద్యశాఖ బృందాలు సందర్శించి శుభ్రం చేశాయి.

### ముందు జాగ్రత్త కోసమే

సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నమ్మొద్దు. కరోనా వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి అంతా సహకరించాలి. వియత్నాం మత బోధకుల బృందం సభ్యులను పరీక్షల కోసం హైదరాబాద్ తరలించాం. వీరిలో ఎవరికీ కరోనా లక్షణాలు లేకున్నా.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే వైద్య పరీక్షలకు పంపాం.

–ఎస్పీ ఏవీ రంగనాథ్

## 31 వరకు సీఎస్‌ఐ చర్చ్ మూసివేత

### బిషప్ సాల్మన్‌రాజ్



**మెదక్‌జోన్:** కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ నెల 31వ తేదీ వరకు మెదక్ పట్టణంలోని సీఎస్‌ఐ చర్చ్‌తోపాటు దాని పరిధిలోని అన్ని చర్చ్‌లను మూసివేస్తున్నట్లు బిషప్ సాల్మన్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరోనా వైరస్ మహమ్మారిని అందరం కలసి అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలన్నారు.

## ప్రేమ వేధింపులకు ఇంటర్ విద్యార్థిని బలి

**నర్సాపూర్‌రూరల్:** ప్రేమ వేధింపులు భరించలేక నర్సాపూర్ మండలం రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన దండు మాధవి (17) ఆత్మహత్యకు పాల్పడింది. అదే గ్రామానికి చెందిన సార రవి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన మాధవి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


**INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI**
(An Autonomous Institution under Ministry of HRD., Govt. of India)
Karakambadi Road, Tirupati - 517 507

**RECRUITMENT FOR THE POST OF ASSISTANT REGISTRAR**

IISER Tirupati invites online applications from Indian nationals having excellent academic record and relevant work experience for recruitment of Assistant Registrar.

For detailed advertisement, please visit www.iisertirupati.ac.in and click on the link "Opportunities-Technical/Administration". The last date for submission of online applications is April 22, 2020.

Advt.No.12/2020/IISER-T/Rect./20.03.2020 Sdl-Registrar


# ఎవరైనా ఫారిన్ నుంచి వచ్చిండ్రా?

**విదేశీయానం చేసిన వారి వివరాలు సేకరిస్తున్న పోలీసులు**
- వరంగల్‌లో ఎన్నారై పెళ్లి రిసెప్షన్ రద్దు చేయించిన కమిషనర్
- వియత్నాం, ఇండోనేసియా పౌరుల పర్యటనపై కలకలం..

**సాక్షి, హైదరాబాద్:** విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారిని గుర్తించే పనిలో పడింది పోలీసు విభాగం. ఇటీవల విదేశాలకు వెళ్లి వచ్చిన వారి వివరాలు సేకరిస్తోంది. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాల బాధ్యతలను కానిస్టేబుళ్లకు అప్పగిస్తూ విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీవో)లుగా పోలీసుశాఖ నియమించింది. వీరంతా గ్రామాల్లోని ఆశా వర్కర్లు, వీఆర్వోల సాయంతో ఎన్నారైలు, విదేశాలకు వెళ్లి వచ్చిన వారి వివరాలు సేకరించి ఎస్పీలు, కమిషనర్లకు అక్కడ నుంచి డీజీపీ ఆఫీస్‌కు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నారు. ఫంక్షన్ హాళ్లలో విందులు, పెళ్లిళ్లపై పూర్తిగా నిషేధం విధించారు. సోషల్ మీడియాలో జిల్లా ఎస్పీలు, కమిషనర్లకు పౌరులు తమకు తెలిసి విదేశీయానం చేసి వచ్చిన వారి వివరాలను చెబుతున్నారు. మార్చి 12న ఫ్రాన్స్ నుంచి వచ్చిన వరంగల్ వాసి వివాహం చేసుకున్నాడు. ఆ పెళ్లికి స్థానిక వీఐపీలతో సహా, 1,000 మంది వరకు హాజరయ్యారు. పెళ్లికొడుకు యూరోప్ నుంచి వచ్చాడని తెలుసుకున్న ఓ మహిళ ట్విట్టర్ ద్వారా వరంగల్ సీపీ రవీందర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై ఆయన ఆగమేఘాలపై స్పందించారు. పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో శుక్రవారం జరగాల్సిన రిసెప్షన్ రద్దు చేసేందుకు రెండు కుటుంబాలు అంగీకరించాయి. అనంతరం సీపీ రవీందర్ ఆదేశాల మేరకు పెళ్లికొడుకును ఐసోలేషన్ వార్డుకు తరలించారు.

**పోలీసు శాఖకు ప్రత్యేక నిధులు**

కోవిడ్ వ్యాధి వ్యాప్తి నివారణలో భాగంగా పోలీసు సిబ్బందికి మాస్కులు, శానిటైజర్లు, థర్మల్ స్క్రీనర్ల కోసం ప్రతి జిల్లాకు దాదాపుగా రూ.3 లక్షల చొప్పున హోంశాఖ నిధులు విడుదల చేసింది. ఈ మొత్తం జిల్లా విస్తీర్ణం, పోలీసుల సంఖ్య ఆధారంగా కేటాయించారని ఉన్నతాధికారులు తెలిపారు.

**విదేశీయుల కలకలం**

ఇటీవల కరీంనగర్‌కు 8 మంది ఇండోనేసియన్లు రావడం, వారందరికీ కరోనా పాజిటివ్‌గా తేలడంతో రాష్ట్రంలో హై అలర్ట్ ప్రకటించడం తెలిసిందే. వీరు తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా రావడంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మతపరమైన కార్యక్రమమే అయినప్పటికీ.. వారు పట్టణానికి చేరేవరకు గోప్యత పాటించాల్సిన అవసరం ఏమొచ్చింది? అన్న విషయాలను ఆరా తీస్తున్నారు. నల్లగొండలో 14మంది వియత్నాం వాసులకు సంబంధించి సమాచారం అందడంతో ఎస్పీ వారిని పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని మల్లేపల్లిలోనూ ఇండోనేసియాకు చెందిన 8 మందిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. వీరికి వ్యాధి లక్షణాల సంగతి అటుంచితే.. రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వీరు ఎందుకు వచ్చారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. వీరంతా విమానాల ద్వారా కాకుండా రోడ్డు, రైళ్ల ద్వారా రాష్ట్రానికి రావడంతో సరిహద్దుల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లోని 18 చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు చేశాకే అనుమతిస్తున్నారు.


**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం: తిరుపతి**
**ప్రవేశ ప్రకటన - 2020**

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వారు 2020-21 సంవత్సరంలో M.A., M.Sc., M.Com., Master's in సోషియల్ వర్క్, M.P.Ed., M.Ed., B.Ed(Spl) (H.I) & 5 సంవత్సరముల ఇంటిగ్రేటెడ్ B.A/M.A పబ్లిక్ పాలసీ అండ్ ఆంత్రోపాలజీ కోర్సులకు SPMVVPGCET-2020 ద్వారా మరియు 5 సంవత్సరముల ఇంటిగ్రేటెడ్ M.Sc., బి.ఓకేషనల్, వివిధ పీజీ డిప్లమో కోర్సులలో ప్రత్యక్ష ప్రవేశాల కొరకు మహిళా అభ్యర్థినుల నుండి ధరఖాస్తులు కోరుతున్నది. అర్హత గల అభ్యర్థినులు ఆంధ్ర బ్యాంకు (బిల్ డెస్క్) లేదా పేమెంట్ గేట్వే (క్రెడిట్ / డెబిట్ కార్డు) ద్వారా 425/- రూపాయలు అప్లికేషను ఫీసు చెల్లించి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల కొరకు www.spmvvdoa.in ను 21.03.2020 నుండి సందర్శించవచ్చు. దరఖాస్తు చివరి తేది 30.04.2020. తదుపరి వివరాలు www.spmvv.ac.in, www.spmvvdoa.in, admnspmvv@gmail.com టెలిఫోన్ 0877-2284592 ద్వారా పొందవచ్చు.

సం/- రిజిస్ట్రార్






**క్రమేపి విశ్వాసం కల్పించడం ద్వారా వివాదాల పరిష్కారం**

**మీ ఆదాయ పన్ను వివాదాల ఏకకాల పరిష్కారం**

**ముఖ్యమైన తేదీలు**
- అధిక ప్రయోజనాలు వినియోగించుకొనుటకు 31 మార్చి 2020లోగా చెల్లించండి.

**అర్హత**
- 31.01.2020న లేదా ఆలోగా దాఖలు చేసిన మరియు అపరిష్కృతంగా ఉన్న అప్పీళ్ళు/ రిట్లు
- అప్పీలు దాఖలు చేసేందుకు 31.01.2020న గడువు ముగియని వాటి కొరకు ఉత్తర్వులు
- 31.01.2020న డిస్ప్యూట్ రిజల్యూషన్ ప్యానల్ (DRP) సమక్షంలో అపరిష్కృతంగా ఉన్న కేసులు
- 31.01.2020న లేదా అంతకంటే ముందుగా DRP ఆదేశం జారీ చేసిన అయితే ఉత్తర్వు ఏదీ ఇవ్వబడని కేసులు
- 31.01.2020న లేదా అంతకంటే ముందుగా అసెస్సీ దాఖలు చేసిన రివిజన్ (సెక్షన్ 264) కేసులు
- వివాదం గల పన్ను సంవత్సరంలో రూ.5 కోట్ల కంటే తక్కువ ఉంటే సెర్చ్ కేస్
- పన్ను చెల్లింపుదారులు లేదా డిపార్ట్‌మెంట్‌చే దాఖలు చేయబడిన అప్పీళ్ళు/రిట్లు
- ఇప్పటికే చెల్లింపు జరిపిన వివాదాలు కూడా అర్హమవుతాయి
- భారతదేశం లేదా విదేశాలలో ఆర్బిట్రేషన్‌లోని కేసులు

**కవర్ చేయబడే వివాదాలు**
- దిగువ వాటికి సంబంధించి కొన్ని మినహాయింపులకు లోబడి అన్ని వివాదాలు
  - (i) వివాదంలో గల పన్ను
  - (ii) వివాదంలో గల జరిమానా
  - (iii) వివాదంలో గల వడ్డీ
  - (iv) వివాదంలో గల రుసుము
  - (v) వివాదంలో గల మూలంలో తగ్గించబడిన పన్ను (TDS) లేదా మూలంలో వసూలు చేసిన పన్ను (TCS)

**ముఖ్యమైన అంశాలు...చెల్లింపు నిబంధనలు**

| దిగువ తెలిపిన తేదీన లేదా ఆలోగా చేసిన చెల్లింపు | వివాదంలో ఉన్న పన్నుకు సంబంధించిన అప్పీలు | వివాదంలో ఉన్న పెనాల్టీకి లేదా వడ్డీ లేదా రుసుముకు మాత్రమే సంబంధించిన అప్పీలు |
|---|---|---|
| 31 మార్చి, 2020 | వివాదంలో ఉన్న పన్నులో 100% (సెర్చ్ కేసులలో 125%) | వివాదంలో ఉన్న పెనాల్టీ లేదా వడ్డీ లేదా రుసుములో 25% |
| ముగింపు తేది (30 జూన్, 2020) | వివాదంలో ఉన్న పన్నులో 110% (సెర్చ్ కేసులలో 135%) అంటే అది మొత్తం డిమాండ్‌కు మించరాదు | వివాదంలో ఉన్న పెనాల్టీ లేదా వడ్డీ లేదా రుసుములో 30% |

పన్ను చెల్లింపుదారుల వివాదంలో అపరిష్కృతంగా ఉన్న అప్పీలు అప్పిలేట్ ఫోరం ద్వారా అతని పేరున ఇప్పటికే నిర్ణయించబడితే లేదా ఈ వివాదంపై డిపార్ట్‌మెంట్ అప్పీలు దాఖలు చేస్తే పైన తెలిపిన మొత్తాలలో 50% మొత్తాన్ని చెల్లించాలి.

davp 15401/13/0021/1920

Visit: www.incometaxindia.gov.in
www.incometaxindiaefiling.gov.in

ఆదాయ పన్ను శాఖ

**ఆదాయపన్ను శాఖ**
**సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్**

@IncomeTaxIndia @incometaxindiaofficial

# పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీకి ఎంపీ సంతోష్‌కుమార్

**లోక్‌సభ నుంచి 15 మంది.. రాజ్యసభ నుంచి ఏడుగురి ఎంపిక**

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ రంగ సంస్థల నివేదికలు, ఖాతాలను మదింపు చేసి, పనితీరుపై కేంద్రానికి నివేదికలు ఇచ్చే పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీకి ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును మెరుగుపరిచేందుకు మార్గదర్శకంగా నిలిచే ఈ కమిటీ 1964 సంవత్సరం నుంచి పనిచేస్తోంది. లోక్‌సభ నుంచి 15 మంది ఎంపీలు, రాజ్యసభ నుంచి ఏడుగురు ఎంపీలు, మొత్తంగా 22 మంది కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తారు.



ప్రాధాన్యతా ఓటు ఆధారంగా రెండు సభలకు చెందిన ఎంపీలు ఈ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. కమిటీకి చైర్మన్‌ను లోక్‌సభ స్పీకర్ నిర్ణయిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల నివేదికలను అధ్యయనం చేయటం, వాటి ఖాతాలను పరిశీలించటంతో పాటు, మరింత మెరుగ్గా పనిచేసేందుకు వీలుగా ఈ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఇచ్చే నివేదికలను కూడా పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ అధ్యయనం చేస్తుంది. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల వార్షిక నివేదికలు ప్రతిఏటా పార్లమెంట్ ముందు ఉంచేలా కమిటీ పర్యవేక్షిస్తుంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన పార్లమెంటరీ కమిటీకి తాను ఎంపిక కావటంపై సంతోష్ కుమార్ సంతృప్తి వ్యక్తంచేశారు. ఎంపీగా తన బాధ్యత మరింత పెరిగిందని, ప్రభుత్వ రంగ సంస్థలు మరింత మెరుగ్గా పనిచేసేందుకు వీలుగా తమ కమిటీ అధ్యయనం చేస్తుందని ఆయన వెల్లడించారు.

# 4లోగా హాజరు మినహాయింపు ఫీజు చెల్లించండి: ఇంటర్ బోర్డు

**సాక్షి, హైదరాబాద్:** జూనియర్ కాలేజీలో చదువుకోకుండానే మే/జూన్‌లలో నిర్వహించే ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే వారు హాజరు మినహాయింపు పొందాలని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ ఓ ప్రకటనలో తెలిపారు. వారంతా వచ్చే నెల 4లోగా హాజరు మినహాయింపు ఫీజు రూ. 500 ఆన్‌లైన్‌లో (tsbie.cgg.gov.in ద్వారా) చెల్లించి దరఖాస్తు ఫారమ్ సబ్మిట్ చేయాలని పేర్కొన్నారు. 4వ తేదీ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులను స్వీకరించేది లేదని వెల్లడించారు. పదో తరగతి పూర్తి అయి ఏడాది గడిచిన వారు ప్రథమ సంవత్సరం పరీక్షలు, రెండేళ్లు గడిచిన వారు ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అయితే వారు ఆర్ట్స్/హ్యూమానిటీస్ సబ్జెక్టుల్లోనే ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని వెల్లడించారు. అలాగే వారు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, ఎన్విరాన్మెంటల్ ఎగ్జామినేషన్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు అదనపు సబ్జెక్టుగా ద్వితీయ భాష పరీక్ష రాయవచ్చని, బైపీసీ ఉత్తీర్ణులైన వారు అదనపు సబ్జెక్టుగా మేథమెటిక్స్ పరీక్ష రాయవచ్చని వివరించారు.

# ఉపాధ్యాయులందరికీ సెలవులు ప్రకటించాలి

**యూఎస్‌పీసీ, జాక్టో స్టీరింగ్ కమిటీ డిమాండ్**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తి నిరోధక చర్యల్లో భాగంగా పాఠశాలన్నింటినీ మూసివేసి ఉపాధ్యాయులకు కూడా సెలవులు ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు జరగాల్సిన పదో తరగతి పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసిన నేపథ్యంలో టీచర్లకు సెలవులు ప్రకటించాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్‌కు విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఈనెల 31 వరకు అన్ని విద్యా సంస్థలను, హాస్టళ్లను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ.. సెలవులు విద్యార్థులకు మాత్రమేనని, ఉపాధ్యాయులు పాఠశాలలకు యథావిధిగా హాజరు కావాలని విద్యాశాఖాధికారులు ఆదేశించడం సరికాదని అన్నారు.

## ‘బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి’

**సాక్షి, న్యూఢిల్లీ:** బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఈ దిశగా కేంద్రం బిల్లు తెచ్చేలా చూడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌లను బీసీ సంఘాల నేతలు కలసి విన్నవించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసిన వారిలో బీసీ సంఘాల నేతలు జయంతిగౌడ్, రాజేశ్వరి తదితరులున్నారు.





రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్ వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా తెలంగాణ ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. డిపోల నుంచి బయల్దేరే ముందు బస్సును పూర్తిగా శానిటైజ్ చేయాలన్న సీఎం ఆదేశాల మేరకు బస్సులను ఆర్టీసీ సిబ్బంది శుభ్రపరుస్తున్నారు. అలాగే బస్సులో ఎక్కే ప్రతి ప్రయాణికుడికి చేతులు శుభ్రపర్చుకునేందుకు కండక్టర్లు విధిగా శానిటైజర్‌ను అందిస్తున్నారు.

# 31న కేటీపీఎస్ ఫేజింగ్ ఔట్

- 31న 720 మెగావాట్ల ఓఅండ్ఎం ప్లాంట్ల శాశ్వత మూసివేత
- ఇతర విద్యుత్ కేంద్రాలకు అక్కడి ఇంజనీర్ల బదిలీలు..
- 2,520 నుంచి 1,800 మెగావాట్లకు తగ్గనున్న కేటీపీఎస్ సామర్థ్యం
- ఆరు దశాబ్దాలుగా వెలుగులు పంచిన ఓఅండ్ఎం ప్లాంట్లు



**సాక్షి, హైదరాబాద్:** ఖమ్మంజిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీఎస్)లోని 720 మెగావాట్ల ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్(ఓఅండ్ఎం) ప్లాంట్లను ఈ నెల 31న శాశ్వతంగా మూసివేయనున్నారు (ఫేజింగ్ ఔట్ చేయనున్నారు). దశలవారీగా సాగిన ఈ ప్రక్రియ ఈ నెలాఖరుతో పూర్తి కాబోతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న 470 మంది ఇంజనీర్లు, ఇతర విభాగాల ఉద్యోగులను రాష్ట్రంలోని వేరే థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. కేటీపీఎస్ ఏడో దశ విస్తరణలో భాగంగా నిర్మించిన 800 (1 x800) మెగావాట్ల యూనిట్‌కు పర్యావరణ అనుమతులు జారీ చేసే సందర్భంగా 720 మెగావాట్ల పాత ఓఅండ్ఎంకు సంబంధించిన 8 యూనిట్లను 2018–19లోగా మూసేయాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఐదేళ్ల కింద షరతులు విధించింది. 60 మెగావాట్ల నాలుగు యూనిట్లు, 120 మెగావాట్ల నాలుగు యూనిట్లు కలిపి మొత్తం 720 (60 x4+120 x4) మెగావాట్ల ఓఅండ్ఎం ప్లాంట్లు ఆరు దశాబ్దాలుగా ఉమ్మడి ఏపీ, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందిస్తూ వస్తున్నాయి. పాత, కొత్త విద్యుత్ ప్లాంట్లు కలుపుకొని ప్రస్తుతం కేటీపీఎస్ విద్యుత్ కేంద్రంలో ఉన్న 2,520 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. 720 మెగావాట్ల పాత యూనిట్లను మూసివేస్తే ఉత్పత్తి సామర్థ్యం 1,800 మెగావాట్లకు తగ్గిపోనుంది.

**1965 నుంచి ప్రస్థానం..**

జెన్‌కో తొలుత పాల్వంచలో 60 మెగావాట్ల 4 యూనిట్లను 1966–67లో నిర్మించి మొత్తం 240 (4 x 60) మెగావాట్ల సామర్థ్యంతో కేటీపీఎస్‌ను నెలకొల్పింది. ఆ తర్వాత 1974–78 మధ్య కాలంలో ఒక్కొక్కటి 120 మెగావాట్ల సామర్థ్యంతో 4 యూనిట్లను నిర్మించి 480 (4 x 120) మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని జత చేసింది. తదనంతరం ఈ విద్యుత్ కేంద్రం ఐదు, ఆరు దశల విస్తరణలో భాగంగా మరో 1,000 (2 x 250+1 x500) మెగావాట్లతో మూడు యూనిట్లను నిర్మించడంతో కేటీపీఎస్ సామర్థ్యం 1,720 మెగావాట్లకు పెరిగింది. 1998–2004 మధ్య కాలంలో 60 మెగావాట్లు, 120 మెగావాట్ల పాత యూనిట్ల ఆధునీకరణ కోసం ఏకంగా రూ.604 కోట్లను జెన్‌కో ఖర్చు చేసింది. భారీ పెట్టుబడి పెట్టినందున 60 మెగావాట్ల యూనిట్లను 2023–24 వరకు, 120 మెగావాట్ల యూనిట్లను 2018–19 వరకు నడపాలని జెన్‌కో భావించింది. 800 మెగావాట్లతో చేపట్టిన ఏడో దశ విస్తరణ ప్రతిపాదనల్లో సైతం ఇదే అంశాన్ని పర్యావరణ శాఖకు తెలియజేసింది. పర్యావరణ శాఖ అందుకు ససేమిరా ఒప్పుకోకపోవడంతో పాత యూనిట్ల మూసివేతకు జెన్‌కో సిద్ధమైంది.

**కాలుష్యం నుంచి విముక్తి..**

కేటీపీఎస్ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తవుతున్న బూడిద వ్యర్థాలపై అప్పట్లో పర్యావరణ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇక్కడి బూడిదలో 15.89 శాతాన్ని మాత్రమే ఇటుకలు, సిమెంట్ తయారీకి వినియోగిస్తున్నారని, 2020–21 నాటికి 100 శాతం బూడిదను వినియోగంలోకి తేవాలని స్పష్టం చేసింది. ఆ మేరకు సిమెంటు, ఇటుకల పరిశ్రమలను ప్రోత్సహించాలని సిఫారసు చేసింది. కొత్త యూనిట్ నుంచి ఉత్పత్తయ్యే బూడిద కోసం కొత్త యాష్ పాండ్ ఏర్పాటుకు పర్యావరణ శాఖ వ్యతిరేకించింది. పాత యూనిట్ల యాష్ పాండ్‌లనే కొత్త యూనిట్‌కూ వినియోగించుకోవాలని కోరింది. కాలుష్య నివారణ చర్యలపై ప్రతి 6 నెలలకోసారి రాష్ట్ర పీసీబీతో కలసి పర్యవేక్షించాలని ఆదేశించింది. విద్యుత్ కేంద్రానికి 10 చ.కి.మీ.ల పరిధిలో నివాసముండే ప్రజల ఆరోగ్య పరీక్షలను ఏడాదికోసారి జరపాలని కో రింది. పాత విద్యుత్ కేంద్రాలను మూసేస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజలకు కాలుష్యం నుంచి కొత్త వరకు విముక్తి లభించే అవకాశాలున్నాయి.

# టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ ఇంట్లో సోదాలు

**ముసద్దీలాల్ అధినేతను అదుపులోకి తీసుకున్న పోలీసులు!**

**హైదరాబాద్:** టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ ఇంట్లో సీసీఎస్ పోలీసులు సోదాలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14 బీఎన్‌రెడ్డి కాలనీలోని రవిప్రకాశ్ ఇంట్లో ముసద్దీలాల్ జ్యువెల్లరీస్ అధినేత సుకేశ్ గుప్తా తలదాచుకున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడులు జరిపారు. సుకేశ్ గుప్తాపై ఎస్ఆర్ఈఐ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్ అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు. దీంతో పక్కా సమాచారం మేరకు భారీ బందోబస్తు ఏర్పాటుచేసి సుకేశ్ గుప్తాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బషీర్‌బాగ్ కేంద్రంగా పనిచేసే ఆశీ రియల్టర్‌కు చెందిన సుకేశ్‌గుప్తా, నీతూగుప్తా, నిహారిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సురేశ్‌కుమార్, రవిచంద్రన్‌లు ఎస్ఆర్ఈఐ వద్ద రూ.110 కోట్ల రుణం కోసం 2018 జూన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ దేడాది అక్టోబర్ నుంచి ప్రతి 3 నెలలకు ఓ వాయిదా చొప్పున చెల్లిస్తూ మొత్తం 4 దఫాల్లో రుణం వడ్డీ సహా తీర్చాలన్నది ఒప్పందం. ఈ రుణానికి సంబంధించి షూరిటీగా హఫీజ్‌పేటలో ఉన్న 8 ఎకరాల స్థలంతో పాటు, కింగ్‌కోఠిలో 28,106 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నజ్రీబాగ్ ప్యాలెస్‌ను చూపిస్తూ ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఆ రుణం చెల్లించడంలో విఫలం కావడంతో గతేడాది డిసెంబర్‌లో హఫీజ్‌పేటలోని స్థలాన్ని వేలం వేసిన ఎస్ఆర్ఈఐ సంస్థ 102.6 కోట్లు రాబట్టుకుంది. మిగిలిన మొత్తం రికవరీ కోసం నజ్రీబాగ్ ప్యాలెస్ వేలం వేయాలని ప్రయత్నించగా, నిందితులు అప్పటికే తమను మోసం చేస్తూ ఐరిస్ హాస్పిటాలిటీస్‌కు విక్రయించినట్లు గుర్తించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుకేశ్ గుప్తా, నీతూ గుప్తా, రవీంద్రన్, సురేశ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి, వారి కోసం వెతుకుతున్నారు. తాజాగా రవిప్రకాశ్ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకొని సుకేశ్‌గుప్తాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

॥ ఆనందంగా ఉండండి, ఆరోగ్యంగా ఉండండి ॥

జనతా కర్ఫ్యూ

మీ కోసం కాదు, అయితే దేశంలోని 130 కోట్ల మంది ప్రజల భద్రత కోసం, జాలిమ్ లోషన్ గ్రూప్ వారు 22 మార్చి, 2020న ఉ॥ 7.00 గం॥ నుండి రా॥ 9.00 గం॥ వరకు మీ ఇంటి వద్దనే ఉండవలసిందిగా మరియు కరోనా వైరస్ లేదా కోవిడ్-19 గా పిలువబడే ఈ తీవ్రమైన అంటువ్యాధిని నివారించేందుకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా దేశ ప్రజలకు సేవ చేస్తున్న సహాయకులకు కృతజ్ఞత తెలుపవలసిందిగా మిమ్మల్ని కోరుచున్నారు. సా॥ 5.00 గం॥ నుండి గట్టిగా చప్పట్లు కొడుతూ వారిని అభినందించండి మరియు వారి స్ఫూర్తికి ప్రోత్సాహం ఇవ్వండి

జాలిమ్ లోషన్®
శీఘ్రంగా పనిచేస్తుంది > విశ్వసించబడింది > పరీక్షించబడినది ...తరతరాలుగా

ప్రాణ్ సుధ®
తక్షణ పరిష్కారం ...తరతరాలుగా

ANIL PUB.

www.zalimlotion.in | www.pransudha.in | zalimlotion1929@gmail.com




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com